# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 224 | హైదరాబాద్ | శుక్రవారం 27-02-2026 | పేజీలు : 12 | వెల : 1.00




11లో

## ద్వైపాక్షికంలో సరికొత్త శకం



## పేదలపై ప్రతాపం..
# పెద్దలపై ప్రేమా..?

- తప్పు చేయకపోతే మంత్రులు ఎందుకు రాలేదు
- ముఖ్యమంత్రి కుటుంబసభ్యులే కబ్జాదారులు
- అండగా ఉంటాం..అధైర్యపడకండి
- ఖమ్మం భూదాన్ నిర్వాసితులకు కేటీఆర్ భరోసా

గాంధీచౌక్, భారతశక్తి : కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ రాజ్యం కాదని, కుంభకోణాల రాజ్యమని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు, తరువాయి 11లో

## బీఆర్ఎస్ అవినీతికి
# బీజేపీ సహకారం

- కాళేశ్వరంపై సీబీఐ విచారణలో కేంద్రం నిర్లక్ష్యం
- కడుపులో విషం నింపుకుని కాంగ్రెస్ పాలనపై విషం చిమ్ముతున్నారు
- పేదలే ఇందిరమ్మ ప్రభుత్వ పేటెంట్
- వెలుగుమెట్లలో 2023లో ఇండ్లు కూలగొట్టింది గత ప్రభుత్వమే
- బాధితులకు ఇంటిస్థలం, ఇండ్లు ఇచ్చే బాధ్యత మాదే
- మంత్రులు పొంగులేటి, పొన్నం, వివేక్

హైదరాబాద్ : బీఆర్ఎస్ సర్కారుకు కాళేశ్వరం ప్రాజెక్టు ఏటీఎంలా మారిందంటూ విమర్శలు గుప్పించిన బీజేపీ నాయకులే ఇప్పుడు అదే పార్టీకి సహకరిస్తున్నారని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి తరువాయి 11లో



## వంద తెలంగాణ
# పబ్లిక్ స్కూళ్లు

- రాష్ట్రంలో నియోజకవర్గానికి ఒకటి చొప్పున పైలెట్ ప్రాజెక్టు
- ఆరుట్ల పాఠశాల తరహాలో సకల వసతులు, రవాణా సౌకర్యాలు
- క్యూర్ పరిధిలో అన్ని హంగులతో ఏర్పాటు
- ఏఐ సాంకేతికతపై ఉపాధ్యాయులు, అధ్యాపకులకు శిక్షణ
- ప్రాథమికస్థాయి నుంచి 12వ తరగతి వరకు బ్రేక్‌ఫాస్ట్ : విద్యాశాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- వర్సిటీలకు నిధుల అందజేతపై నివేదిక ఇవ్వండి



హైదరాబాద్, భారత శక్తి: రాష్ట్ర వ్యాప్తంగా 100 నియోజకవర్గాల్లో (హైదరాబాద్ నగరం వెలుపల) తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ఈ ఏడాది నుంచి ప్రారంభించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. తరగతి గదులు, క్రీడా మైదానం, ఇతర అన్ని రకాల వసతులు, బోధనా సిబ్బంది, రవాణా సౌకర్యం కలిగి ఉన్న రంగారెడ్డి జిల్లా మంచాల మండలంలోని ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్ తరహాలోనే ఈ వంద స్కూళ్లు ఉండాలని నిర్దేశించారు. గురువారం హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. తరువాయి 11లో



## పెద్ద విమానాలతో తిరుపతి రన్‌వే కళకళ

- విమానాశ్రయంలో పెరిగిన రద్దీ
- తొలిసారిగా పదిలక్షల మందిప్రయాణికుల రాకపోకలు
- ఈ ఏడాది 11.5 లక్షల లక్ష్యం
- ఏపీడీ భూమినాథన్ వెల్లడి

తిరుపతి: తిరుపతి విమానాశ్రయం సరికొత్త రికార్డులు నమోదుచేస్తోంది. తొలిసారిగా ఆర్థిక సంవత్సరం ముగియకముందే (జనవరి నాటికే) 10 లక్షల మంది

తరువాయి 9లో



## ఎల్‌అండ్‌టీ కాంట్రాక్ట్ కార్మికుల ఆగ్రహం

- వేతనాలు, పనిగంటలపై ఆందోళన
- గుజరాత్‌లోని హజీరాలో చెలరేగిన హింస
- విరిగిన లాఠీలు, రెచ్చిపోయిన పోలీసులు
- టియర్‌గ్యాస్ ప్రయోగం

సూరత్ , భారత శక్తి: గుజరాత్‌లోని హజీరాలో నిర్మాణంలో ఉన్న ఆర్సెలర్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా ప్లాంట్‌లో లార్సెన్ అండ్ టుబ్రోకు చెందిన కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆందోళన చేపట్టారు. కూలీ రేటు పెంచాలని, పనిగంటలు తగ్గించాలని వీరు కొంతకాలంగా నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే గురువారం సుమారు ఐదువేల మంది కాంట్రాక్ట్ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ఆందోళనకు దిగారు. రెచ్చిపోయిన యాజమాన్యం వారి సమస్యల పరిష్కారానికి ముందుకు రాకపోగా పోలీసులను రంగంలోకి దింపింది. తరువాయి 11లో

## తప్పుడు ఫిర్యాదులపై
# సుప్రీం సీరియస్

- వేతనాలు, పనిగంటలపై ఆందోళన
- గుజరాత్‌లోని హజీరాలో చెలరేగిన హింస
- విరిగిన లాఠీలు, రెచ్చిపోయిన పోలీసులు
- టియర్‌గ్యాస్ ప్రయోగం

11లో



## వర్షపాతం తగ్గొచ్చు..
# ముందే సిద్ధమవుదాం

- 790 టీఎంసీలు నిల్వ ఉన్నాయి
- మే 15కే ఖరీఫ్ సాగు చేయించాలి
- స్వర్ణాంధ్ర విజన్‌లో నీటి భద్రతకు బ్లూప్రింట్
- ఈ ఏడాది జులై నాటికి వెలిగొండ నీళ్లు ఇస్తాం
- పుష్కరాల కన్నా ముందే పోలవరం పూర్తి
- పోలవరం-నల్లమలసాగర్ అనుసంధానం ఎవరికీ నష్టం కాదు
- శాసనసభలో సీఎం చంద్రబాబు

9లో





## మండలిని కుదిపేసిన
# లడ్డూ ప్రసాదం!

- అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదాలు
- సవాళ్లు, ప్రతి సవాళ్లలో హోరెత్తిన మండలి
- ఛైర్మన్, మంత్రి కేశవ్ మధ్య ఆసక్తికర సంభాషణ
- చివరకు చర్చ లేకుండానే వాయిదా

9లో

## ఇక మాజీ సైనికులకు రైల్వేలో ఉద్యోగాలు...
# ఆర్మీతో కీలక ఒప్పందం

- మాజీ సైనికుల కోసం రైల్వే శాఖలో 5,000 ఉద్యోగాలు
- కాంట్రాక్టు పద్ధతిలో పాయింట్స్‌మెన్ పోస్టుల భర్తీకి నిర్ణయం

9లో



# ఓటింగ్ కు ఏఐ మిక్సింగ్

భారత ఎన్నికల ప్రక్రియను బలోపేతం చేయడంపై కేంద్ర ఎన్నికల సంఘం దృష్టి సారించింది. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనది. అయితే వలసలు, అనారోగ్యం లేదా ఇతర అనివార్య కారణాల వల్ల లక్షలాది మంది తమ ఓటు హక్కును వినియోగించుకోలేకపోతున్నారు. ఈ సమస్యకు పరిష్కారంగా బిహార్ రాష్ట్ర ఎన్నికల సంఘం 'కృత్రిమ మేధ' 'బ్లాక్‌చెయిన్' సాంకేతికతలతో కూడిన ఇ-ఓటింగ్ విధానాన్ని తెరపైకి తెచ్చింది. 2026లో జరిగిన 'ఏఐ ఇంపాక్ట్ సమిట్'లో ఈ విధానాన్ని ప్రదర్శించి దేశవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించింది.ఇందుకోసం ఢిల్లీ భారత మండపంలో కేంద్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర ఎన్నికల కమిషనర్ల జాతీయ రౌండ్ టేబుల్ సమావేశం జరగనుంది. ఇది 27 ఏళ్ల తర్వాత కేంద్ర, రాష్ట్ర ఎన్నికల అధికారులు మధ్య జరుగుతున్న రౌండ్ టేబుల్ సమావేశం. ఈవీఎంలు, ఓటర్ల జాబితాలు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, ఎన్నికల ప్రక్రియలను బలోపేతం చేయడంపై అంశాలపై అధికారులు చర్చలు జరపనున్నారు. చివరిసారిగా ఇలాంటి సమావేశం 1999లో జరిగింది.ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ అధ్యక్షత వహిస్తారు. ఎన్నికల కమిషనర్లు డాక్టర్ సుఖ్‌బీర్ సింగ్ సంధు డాక్టర్ వివేక్ జోషి సమక్షంలో ఈ సమావేశం జరుగుతుంది. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల రాష్ట్ర ఎన్నికల కమిషనర్లు, చట్టపరమైన, సాంకేతిక నిపుణులు పాల్గొంటారు. మొత్తం 36 రాష్ట్రాలు కేంద్రపాలిత ప్రాంతాల నుంచి రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రధాన ఎన్నికల అధికారులు పాల్గొనున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర ఎన్నికల కమిషన్ ల పనితీరు, ఎన్నికల ప్రక్రియలు, లాజిస్టిక్స్ ను పెంపొందించడం, నిర్మాణాత్మక ఆలోచనల మార్పిడికి ఎన్నికల నిర్వహణలో సహకార సమాఖ్య స్ఫూర్తిని బలోపేతం చేయడం అంశాలపై చర్చలు జరగనున్నాయి.ఎన్నికల ప్రక్రియలను బలోపేతం చేయడంతో పాటు, సాంకేతికత, ఈవీఎంలు, ఓటర్ల జాబితా అంశాలపై చర్చలు జరగనున్నాయి. ఇటీవల ప్రారంభించినడిజిటల్ ప్లాట్‌ఫామ్, ఎన్నికల సేవలను క్రమబద్ధీకరించడంలో మార్పులు, సాంకేతికత వినియోగ కార్యాచరణ కార్యక్రమాలపై ఎన్నికల కమిషన్ సీనియర్ అధికారులు ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పటిష్టత, పారదర్శకత, భద్రత అంశాలపై రాష్ట్రాల ఎన్నికల అధికారులకు ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు సీనియర్ ఎన్నికల అధికారులు..అన్ని ప్రాంతాలలో ఓటర్ల జాబితా తయారీని నియంత్రించే చట్టపరమైన మార్గదర్శకాలను సులభతరం చేయడానికి, ప్రజాప్రాతినిధ్య చట్టం, 1950కి సంబంధించి రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల వారీగా ఓటర్ల అర్హతపై చర్చలు జరగనున్నాయి. ఆర్టికల్స్ 243ఐ, 243జిం ప్రకారం పంచాయతీలు, మున్సిపల్ సంస్థలకు ఎన్నికల జాబితా తయారీ, నిర్వహణ పర్యవేక్షణ, దిశానిర్దేశం నియంత్రణను రాష్ట్ర ఎన్నికల కమిషన్లు కలిగి ఉన్నాయి. దేశవ్యాప్తంగా సర్ ప్రక్రియ సహా త్వరలో జమిలి ఎన్నికల పై చర్చ జరుగుతున్న నేపథ్యం కేంద్ర రాష్ట్ర ఎన్నికల అధికారుల సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది.ద్యోగాల కోసం ఇతర నగరాలకు వెళ్లే కార్మికులు, దూర ప్రాంతాల్లో చదువుకునే విద్యార్థులు, అలాగే శారీరక ఇబ్బందులు ఎదుర్కొనే వృద్ధులు, వికలాంగులకు ఈ విధానం ఒక వరంలా మారనుంది. పోలింగ్ కేంద్రానికి వెళ్లాల్సిన అవసరం లేకుండానే, తమ వద్ద ఉన్న స్మార్ట్‌ఫోన్ ద్వారానే సురక్షితంగా ఓటు వేసే వెసులుబాటును ఈ ఇ-ఓటింగ్ యాప్ కల్పిస్తుంది. పట్టణ ప్రాంతాల్లో తగ్గుతున్న ఓటింగ్ శాతాన్ని పెంచడమే లక్ష్యంగా బిహార్ ప్రభుత్వం ఇప్పటికే మున్సిపల్ ఉప ఎన్నికల్లో దీనిని విజయవంతంగా పరీక్షించింది. ఈ ఓటింగ్ సాంకేతికతతో పకడ్బందీ భద్రత డిజిటల్ ఓటింగ్ అనగానే భద్రతపై అనేక అంచనాలు ఉంటాయి. అందుకే బిహార్ ఎన్నికల సంఘం అత్యున్నత స్థాయి రక్షణ చర్యలను చేపట్టింది: ఫేషియల్ రికగ్నిషన్: ఓటరు గుర్తింపు కార్డు డేటాబేస్ ఆధారంగా ముఖ గుర్తింపు ప్రక్రియ ద్వారా అసలైన ఓటరును గుర్తిస్తారు. బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ: వేసిన ప్రతి ఓటు ఎన్‌క్రిప్ట్ చేయబడి బ్లాక్‌చెయిన్‌లో రికార్డ్ అవుతుంది. దీనివల్ల డేటాను ఎవరూ ట్యాంపర్ చేయడం లేదా మార్చడం అసాధ్యం. డిజిటల్ ఈవీఎం: స్మార్ట్ కాంట్రాక్ట్ వ్యవస్థ ద్వారా డిజిటల్ పద్ధతిలో ఓట్ల లెక్కింపు జరుగుతుంది. రిటర్నింగ్ అధికారి డిజిటల్ సిగ్నేచర్ ఉంటేనే డేటా డీక్రిప్ట్ అవుతుంది. ఓటు వేయడం ఇప్పుడు సులభం ఓటర్లు ముందుగా అధికారిక యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, ఓటీపీ ద్వారా మొబైల్‌ను ధ్రువీకరించుకోవాలి. ఆపై ఎపిక్ కార్డు వివరాలు నమోదు చేసి, లైవ్ ఫేషియల్ రికగ్నిషన్ ద్వారా తమను తాము ధ్రువీకరించుకున్న తర్వాత నేరుగా ఓటు వేయవచ్చు. ఈ ప్రక్రియ అంతా అత్యంత రహస్యంగా, పారదర్శకంగా సాగేలా జాగ్రత్తలు తీసుకున్నారు. ఏదైనా కొత్త వ్యవస్థ అమల్లోకి వచ్చినప్పుడు కొన్ని ఇబ్బందులు సహజం. పాత ఫోటోలు స్పష్టంగా లేకపోవడం, ఇంటర్నెట్ అంతరాయాలు, డిజిటల్ అక్షరాస్యత లేకపోవడం వంటి సవాళ్లు ఉన్నప్పటికీ.. బిహార్ ఎన్నికల సంఘం నమూనా ఓటింగ్ ద్వారా ప్రజల్లో, రాజకీయ పార్టీల్లో నమ్మకాన్ని కలిగించగలిగింది. ఫలితాల లెక్కింపు కోసం కూడా ఏఐ ఆధారిత ఓసీఆర్ వ్యవస్థను వాడుతుండటం వల్ల మానవ తప్పిదాలకు తావు లేకుండా వేగంగా ఫలితాలు వెలువడనున్నాయి.. మరో వైపు ఏపీ, తెలంగాణ సహా 22 రాష్ట్రాల్లో ఓటర్ జాబితాలను సవరించబోతోంది. దీన్నే సర్ అని పిలుస్తున్నారు. అంటే.. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ అని అర్థం. ఈ సర్ ద్వారా.. కేంద్ర ఎన్నికల సంఘం.. ఓటర్ల జాబితాల్ని పూర్తిగా పరిశీలించి, తప్పులను సరిచేస్తుంది. అంటే ప్రక్షాళన చేస్తుందన్నమాట. ఇది ఏప్రిల్ నుంచి మొదలయ్యే ఛాన్స్ ఉంది.

# గ్రేటర్ విశాఖపై గురి

విశాఖపట్టణం, ఫిబ్రవరి 26,

సాధారణంగా ఉత్తరాంధ్ర అంటే తెలుగుదేశం పార్టీ అధిపత్యముంటుంది. ఒకటి రెండు సార్లు తప్పించి ఆ పార్టీదే హవా. విశాఖ నగరం గురించి చెప్పనవసరం లేదు. తెలుగుదేశం పార్టీకి ఆ నగరం కంచుకోట. కానీ ఒక విషయంలో మాత్రం తీరని లోటు. గ్రేటర్ విశాఖపట్నం మాత్రం ఆ పార్టీకి చిక్కలేదు. అప్పుడెప్పుడో ఐదేళ్లపాటు మాత్రం ఆ పార్టీ గ్రేటర్ విశాఖ ను ఏలింది. కానీ తరువాత మాత్రం చిక్కలేదు. ఇటీవల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి మేయర్ పదవిని స్వాధీనం చేసుకుంది. వచ్చే ఎన్నికల్లో మరోసారి గెలిచి గ్రేటర్ పీఠాన్ని దక్కించుకోవాలని చూస్తోంది. అయితే టిడిపి తో పాటు మిత్రపక్షాలైన జనసేన, బిజెపి సైతం విశాఖపట్నం పీఠాన్ని ఆశిస్తున్నాయి. ఆ దిశగా పావులు కదుపుతున్నాయి.రాష్ట్రంలోనే అతిపెద్ద కార్పొరేషన్ విశాఖపట్నం. 98 డివిజన్లతో గ్రేటర్ విశాఖ ఉంది. అయితే శివారు ప్రాంతాలను కలుపుతూ 150 డివిజన్లుగా మార్చాలన్న ఆలోచన ఉంది. ముఖ్యంగా భీమిలి, అనకాపల్లిలోని గ్రామీణ మండలాలను కూడా కలుపుతారని ఎప్పటినుంచో టాక్ ఉంది. ఇవన్నీ జీవీఎంసీలో కలిస్తే మరో 25 డివిజన్లు పెరుగుతాయి. జీవీఎంసీని 150 వార్డులుగా పెంచాలన్నది కూటమి ప్రభుత్వ ఆలోచనగా తెలుస్తోంది. అయితే ఈ డివిజన్ల చేర్పుల ప్రక్రియ అంత ఈజీగా తేలేలా లేదు. మరో ఆరు నెలల సమయం పట్టే అవకాశం ఉంది.ఇటీవల అవిశ్వాసం పెట్టి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి మేయర్ పదవిని అందుకుంది టిడిపి. మరోసారి ఆ పదవిని చేజిక్కించుకోవడం ద్వారా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి షాక్ ఇవ్వాలని భావిస్తోంది. మరోవైపు జీవీఎంసీ మేయర్ పీఠం కోసం కూటమిలో అప్పుడే చర్చ ప్రారంభం అయింది. విశాఖ తొలి మేయర్ పీఠం బిజెపి దక్కించుకుంది. 1987లో టిడిపి గెలిచింది. 1995, 2005,2007 లో వరుసగా మూడుసార్లు కాంగ్రెస్ పార్టీ మేయర్ పీఠాన్ని కైవసం చేసుకుంది. 2021 లో జరిగిన ఎన్నికల్లో మాత్రం వైసిపి మేయర్ పిఠాన్ని దక్కించుకుంది. నాలుగేళ్లపాటు మేయర్ గా వైసీపీకి చెందిన హరి వెంకట కుమారి కొనసాగారు. గత ఏడాది ఆమెపై అవిశ్వాస తీర్మానం పెట్టి పదవి నుంచి దించేశారు. తెలుగుదేశం పార్టీకి చెందిన శ్రీనివాస్ రావు మేయర్ అయ్యారు. ఏడాది మార్పుతో జీవీఎంసీ పాలకవర్గం పదవీకాలం పూర్తి కానుంది.



విశాఖ నగరంలో యాదవ సామాజిక వర్గం అధికం. ఆ సామాజిక వర్గం వారు పెద్ద సంఖ్యలో ఉన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సామాజిక కోణంలోనే యాదవ వర్గానికి చెందిన హరి కుమారిని నియమించింది. అయితే ఇప్పుడు ఆమెను తొలగించి శ్రీనివాసరావు అయ్యారు మేయర్ గా. ఈసారి మాత్రం యాదవ సామాజిక వర్గానికి చెందిన వారికి మేయర్ పదవి కట్ట పెట్టాలన్న డిమాండ్ టిడిపి నుంచి వినిపిస్తోంది. ఇంకోవైపు కాపులు, మత్స్యకారులు, నాగవంశీయులు కూడా మేయర్ పీఠానికి పోటీ పడుతున్నారు.. జనసేన సైతం ఇక్కడ మేయర్ పీఠాన్ని ఆశిస్తోంది. బిజెపికి సైతం విశాఖ నగరంలో బలం ఉంది. దీంతో మేయర్ పదవిని రెండున్నర ఏళ్ల పాటు పంచాలని.. డిప్యూటీ మేయర్ పదవులను మూడు పార్టీలు సమానంగా పంచుకోవాలని ప్రతిపాదనలు వస్తున్నాయి. చూడాలి గ్రేటర్ విషయంలో కూటమి ఎలా ముందుకు వెళ్తుందో..

# జగన్ టెంపుల్ రన్

కడప, ఫిబ్రవరి 26,

వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రస్తుతం తన సొంత నియోజకవర్గమైన పులివెందులలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన నందిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన నందీశ్వర ఆలయం విగ్రహ



ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిస్థితులు, ముఖ్యంగా తిరుమల లడ్డూ నెయ్యి కల్తీ వివాదం నేపథ్యంలో జగన్ ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొనడం ప్రాధాన్యత సంతరించుకుంది.జగన్ ఈ కార్యక్రమంలో పూర్తిగా హిందూ సంప్రదాయ పద్ధతిలో పాల్గొన్నారు. పంచె కట్టుకుని, సాంప్రదాయ దుస్తుల్లో ఆలయానికి చేరుకున్న ఆయనకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ ప్రాంగణంలో జరిగిన ప్రత్యేక హోమంలో జగన్ పాల్గొన్నారు. విగ్రహ ప్రతిష్టాపన సందర్భంగా వేద పండితులు నిర్వహించిన క్రతువుల్లో ఆయన చురుగ్గా పాలుపంచుకున్నారు. స్వామివారికి జరిగిన అభిషేకాలు, పూజా కార్యక్రమాల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు ఆయనకు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనం పలికారు.ఈ పర్యటన కేవలం ఒక ఆధ్యాత్మిక కార్యక్రమం మాత్రమే కాకుండా, బలమైన రాజకీయ సంకేతాన్ని ఇచ్చే ప్రయత్నంగా విశ్లేషకులు భావిస్తున్నారు. గత కొంతకాలంగా తిరుమల లడ్డూ ప్రసాదం విషయంలో జరుగుతున్న ప్రచారం వల్ల వైసీపీకి హిందూ వ్యతిరేక ముద్ర పడే ప్రమాదం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో జగన్ ఆలయ కార్యక్రమాల్లో, హోమాల్లో పాల్గొనడం ద్వారా తాను హిందూ సంప్రదాయాలను గౌరవిస్తాననే సందేశాన్ని ప్రజల్లోకి పంపే ప్రయత్నం చేస్తున్నారు.అధికారంలో లేని సమయంలో సొంత నియోజకవర్గంలో పర్యటించడం, ఇలాంటి బహిరంగ కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా క్షేత్రస్థాయి నాయకులకు, కార్యకర్తలకు జగన్ ధైర్యాన్ని ఇస్తున్నారు. ప్రజల్లో మమేకమవ్వడం ద్వారా పార్టీ బలాన్ని నిరూపించుకోవాలని ఆయన భావిస్తున్నారు. ఆలయ కార్యక్రమం ముగిసిన తర్వాత జగన్ భాకరాపురంలోని తన క్యాంపు కార్యాలయానికి చేరుకుని 'ప్రజా దర్బార్' నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన బాధితుల సమస్యలను అడిగి తెలుసుకోవడం ద్వారా, ప్రభుత్వంపై ఉన్న అసంతృప్తిని తనవైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు.ఒకవైపు జగన్ ఆలయాల్లో పూజలు చేస్తుంటే, మరోవైపు అధికార పక్షం ఆయనపై విమర్శలు ఎక్కుపెడుతూనే ఉంది. ముఖ్యంగా తిరుమల అంశంపై అసెంబ్లీలో జరిగిన చర్చల నేపథ్యంలో, కేవలం విమర్శల నుండి తప్పించుకోవడానికే జగన్ ఇలాంటి భక్తి ముసుగు వేసుకుంటున్నారని ప్రత్యర్థులు విమర్శిస్తున్నారు. అయితే, వైసీపీ శ్రేణులు మాత్రం జగన్ ఎప్పుడూ అన్ని మతాలను సమానంగా గౌరవిస్తారని, ఇది కేవలం నమ్మకానికి సంబంధించిన విషయమని వాదిస్తున్నారు.మొత్తానికి, వైఎస్ జగన్ పులివెందుల పర్యటన ఆయన రాజకీయ ప్రయాణంలో ఒక ముఖ్యమైన ఘట్టంగా కనిపిస్తోంది. సంక్షోభ సమయాల్లో దైవ దర్శనం, ప్రజల చెంతకు చేరడం అనే పాత వ్యూహాన్ని ఆయన మళ్ళీ అమలు చేస్తున్నారు. ఈ పర్యటన వల్ల వైసీపీపై ఉన్న ప్రతికూలత తగ్గుతుందా లేదా అనేది భవిష్యత్తులో తేలనుంది.

# మంత్రి పొన్నం తో ప్రొఫెసర్ కోదండరాంచ తెలంగాణ ఉద్యమకారుల భేటి

హైదరాబాద్

మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో తెలంగాణ ఉద్యమకారుల సమావేశం కానుంది. ప్రజా పాలన ప్రభుత్వంలో తెలంగాణ ఉద్యమకారుల హామీలు నెరవేర్చడానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేసారు. తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చుడానికి త్వరలో ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేయనుందన్నారు. కమిటీకి సంబంధించిన విధి విధానాలు ఉద్యమకారుల హామీలు తదితర అంశాలపై మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రొఫెసర్ కోదండరాం ఉద్యమకారులు చర్చించారు.

# పోక్సో కేసులో ఇద్దరికి శిక్ష, జరిమానా

రాజన్న సిరిసిల్ల మైనర్ బాలిక పై బలవంతపు వేధింపుల (పోక్సో) కేసులో ఇద్దరు నిందితులకు నాలుగు సంవత్సరాల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి 2000/-రూపాయల జరిమానా విధిస్తూ సిరిసిల్ల పోక్సో కోర్టు జడ్జి రాధిక జైస్వాల్ గురువారం రోజున తీర్పు వెల్లడించారు.ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన ఒక మైనర్ బాలికను 2021 సంవత్సరంలో వరుసకి అన్న అయిన మైనర్ బాలుడు బలవంతపు వేధింపులకు గురి చేసాడు. బాలుడి తండ్రి జానీ, నానమ్మ పొచవ్వ లు ఎవరికైనా చెప్తే చంపేస్తాం అని బాధితులని బెదిరించారు. విషయం పై బాధితురాలి యెక్క తల్లి పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేసింది. అప్పటి ఎస్.ఐ వెంకటకృష్ణ కేసు నమోదు చేయగా దర్యాప్తు తరువాత అప్పటి సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్ కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేసినాడుకేసు పూర్వాపరాలను పరిశీలించిన సిరిసిల్ల పోక్సో కోర్టు జడ్జి రాధిక జైస్వాల్ ఇద్దరు నిందితులు తూర్పటి జానీ,తూర్పటి పోచవ్వకి నాలుగు సంవత్సరల జైలు శిక్ష తో పాటు ఒక్కక్కరికి 2000/-రూపాయల జరిమానా విధించారు. ప్రధాన నిందితుడు మైనర్ కావడం వలన అతని మీద కేసు ప్రస్తుతం జువెనైల్ కోర్టులో నడుస్తుంది..

# హెరిటేజ్ నుంచి భారతికి పాకింది

ఒంగోలు ఫిబ్రవరి 26

ఏపీలోఇప్పుడు నెయ్యి కల్తీ వ్యవహారం రాజకీయ ప్రకంపనలు రేపుతోంది. అయితే పూర్తిగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఈ విషయంలో ఆత్మరక్షణలో పడింది. ఎదురుదాడికి దిగిన క్రమంలో అంబటి రాంబాబు ఎపిసోడ్ నడిచింది. నడిరోడ్డుపై సాక్షాత్ ముఖ్యమంత్రిని తిట్టడం అనేది సభ్య సమాజం హర్షించదు. అయితే రాజకీయాల్లో ఎదురుదాడి అనేది ముఖ్యం. వైయస్సార్ కాంగ్రెస్



పార్టీ తన ఆత్మ రక్షణకు గాను ఇప్పుడు హెరిటేజ్ ను తెరపైకి తెచ్చింది. సాధారణంగా డైరీలు తమ ఉత్పత్తులను పెంచుకునేందుకుగాను.. ఇతర సంస్థలపై ఆధారపడతాయి. అలా ప్రముఖ డైరీ లన్ని ఇందాపూర్ డైరీ నుంచి కొన్ని ఉత్పత్తులు పొందుతాయి. ఈ క్రమంలో హెరిటేజ్ కూడా ఆ జాబితాలో ఉంది. అయితే ఇందాపూర్ డైరీ అనేది హెరిటేజ్ సంస్థది అంటూ ప్రచారం మొదలుపెట్టింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. శాసనమండలిలో దీనిపై చర్చకు పట్టు పట్టింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. ఈ డిమాండ్ వచ్చిన మరుక్షణం శాసనసభలో చర్చకు అనుమతి ఇచ్చింది ప్రభుత్వం. అయితే హెరిటేజ్ పై క్లారిటీ ఇస్తూనే.. వైసిపి హయాంలో భారతి సిమెంట్స్ వ్యవహారాన్ని బయటపెట్టేశారు సీఎం చంద్రబాబు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒకటి అనుకుంటే.. ఇప్పుడు మరొకటి బయటపడినట్లు అయింది.వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అన్ని రకాల నిర్మాణాల్లో భారతి సిమెంట్స్ వాడారు అనేది ఇప్పుడు బయటకు వచ్చింది. హెరిటేజ్ పై చర్చించే క్రమంలో సీఎం చంద్రబాబు ఫుల్ క్లారిటీ ఇచ్చారు. ప్రభుత్వ శాఖల్లో ఎప్పుడూ హెరిటేజ్ ఉత్పత్తులను వాడలేదని తేల్చి చెప్పారు. గత ఐదేళ్లలో ప్రభుత్వ నిర్మాణాల్లో భారతి సిమెంట్స్ వాడారని చెప్పుకొచ్చారు. అయితే ఇది ప్రజల్లోకి బలంగా వెళ్తోంది. వైసిపి ప్రభుత్వ హయాంలో గ్రామ సచివాలయాలను, రైతు భరోసా కేంద్రాలను నిర్మించారు. జగనన్న కాలనీల పేరుట గృహ నిర్మాణం చేపట్టారు. మరికొన్ని ప్రభుత్వ నిర్మాణాలు కూడా జరిగాయి. అయితే వీటి పనుల కోసం సిమెంట్ కొనేటప్పుడు తక్కువ ధర కోట్ చేసిన సంస్థలకు ప్రాధాన్యం ఇవ్వాలి. కానీ జగన్మోహన్ రెడ్డి మాత్రం తన అధికార బలంతో మార్కెట్ ధర కంటే ఎక్కువ రేటుకు తన సొంత కంపెనీ దగ్గరే సిమెంట్ కొనేలా ఒప్పందాలు చేసుకున్నట్లు ఆధారాలు బయట పెట్టింది కూటమి ప్రభుత్వం. తద్వారా అప్పటి ప్రభుత్వ ఖజానాకు భారీగా గండిపడటమే కాకుండా.. ఇతర సిమెంట్ కంపెనీలకు అన్యాయం జరిగిందనే వాదనను తెరపైకి తెస్తున్నారు టిడిపి నాయకులు.వైసిపి హయాంలో టిడ్కో ఇళ్ల నిర్మాణంలో భారతి సిమెంట్స్ వాటా ఎక్కువగా ఉండేలా ప్లాన్ చేసినట్లు ఇప్పుడు బయటపడింది. మిగిలిన సిమెంట్ కంపెనీల కంటే మూడు రెట్లు ఎక్కువగా ఆర్డర్లు ఇచ్చి.. తన సంస్థ వృద్ధిరేటును పెంచుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్నారని ఇప్పుడు ఆరోపణలు వస్తున్నాయి. రాష్ట్రవృద్ధి రేటు కంటే తన సొంత కంపెనీ ఆస్తులు ఎలా పెరగాలనే దానిపై జగన్ దృష్టి పెట్టారని ప్రజల్లో చర్చ జరుగుతుంది. మరోవైపు ఈ కంపెనీకి సంబంధించిన సున్నపు గనుల లీజు వ్యవహారంలో కూడా అక్రమాలు జరిగాయని ఆరోపణలు రావడంతో.. వాటిపై కూడా ప్రభుత్వం పూర్తిగా దృష్టి పెట్టింది. ఆ లీజులను రద్దు చేసే దిశగా అడుగులు పడుతున్నాయి. అధికారులు రికార్డులను పూర్తిగా పరిశీలిస్తున్నారు.మద్యం కుంభకోణం లింకులు కూడా భారతి సిమెంట్స్ కు ఉన్నాయి. ఆ కంపెనీ డైరెక్టర్ గా ఉన్న బాలాజీ గోవిందప్ప మద్యం కుంభకోణంలో అరెస్టు అయ్యారు. కేవలం హెరిటేజ్ పై అవినీతి మరక అంటించేందుకు జగన్ ప్రయత్నాలు చేశారు. కానీ ఇప్పుడు ఏకంగా భారతి సిమెంట్స్ అవినీతి పుట్ట తవ్వేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమయింది. ఇప్పటికే వేట ప్రారంభించింది. నెయ్యి కల్తీ ఎపిసోడ్ ఒకవైపు ఉంటూనే.. భారతి సిమెంట్ ఎపిసోడ్ మొదలుకానుంది అన్నమాట.

# నాయకత్వ లోపం కాదు.. సలహాల విషం

విజయవాడ, ఫిబ్రవరి 26

ఒకప్పుడు జనంలోకి వెళ్లినప్పుడు జగన్ మోహన్ రెడ్డి ఎంతో ఆత్మవిశ్వాసంతో మాట్లాడేవారు. పాదయాత్ర సమయంలో లక్షలాది మంది ముందు పేపర్ చూడకుండా గంటల తరబడి ప్రసంగించిన సందర్భాలు ఉన్నాయి. అప్పట్లో ఆయన మాటల్లో ఒక స్పష్టత, వేగం ఉండేవి. కానీ ఇప్పుడు సీన్ పూర్తిగా మారింది. చివరకు అందరికీ నమస్కారం అనాలన్నా లేదా లోకేష్ క్రికెట్ మ్యాచ్ చూడటం వంటి చిన్న విషయాలపై విమర్శలు చేయాలన్నా స్క్రిప్ట్ వైపు చూడాల్సి రావడం వెనుక ఏదో పెద్ద కుట్ర ఉందనే అనుమానం పార్టీ వీరాభిమానుల్లో మొదలైందిజగన్ రెడ్డికి ఏమీ తెలియదనే భ్రమను ఆయనే నమ్మేలా చేయడంలో సజ్జల రామకృష్ణారెడ్డి అండ్ టీమ్ సక్సెస్ అయిందనేది క్యాడర్ ప్రధాన ఆరోపణ. నువ్వు ఏదైనా తప్పు మాట్లాడితే పరువు పోతుంది.. ప్రత్యర్థులు ట్రోల్ చేస్తారు అని భయపెట్టి, ఆయనలోని సహజ సిద్ధమైన నాయకత్వ లక్షణాలను చంపేశారని కార్యకర్తలు భావిస్తున్నారు. ఈ అతి జాగ్రత్తే జగన్‌ను ఒక రీడింగ్ మెషిన్ గా మార్చేసింది. సొంతంగా ఆలోచించి మాట్లాడే శక్తి లేదనే ముద్ర పడేలా చేయడంలో సజ్జల క్యాంప్ వ్యూహం పక్కాగా అమలు జరుగుతోందనిపిస్తోందని వైసీపీ కార్యకర్తలు సోషల్ మీడియాలో భగ్గుమంటున్నారు.రాజకీయాల్లో మాట తీరు చాలా ముఖ్యం. కానీ జగన్ రెడ్డి ప్రతి అక్షరాన్ని పేపర్ చూసి చదవడం వల్ల ఆయన సహజత్వం కోల్పోయారు. లోకేష్ కొలంబో వెళ్లడం వంటి అతి సామాన్యమైన అంశాలను కూడా చూసి చదవడం చూస్తుంటే.. అది జగన్ రెడ్డి వైఫల్యం కంటే, ఆయన చుట్టూ ఉన్న సలహాదారుల వైఫల్యమే అనిపిస్తుంది. నాయకుడిని ఒక రబ్బర్ స్టాంప్‌లా మార్చి, తామే సర్వస్వం అన్నట్టుగా సజ్జల వ్యవహరించడం



వల్ల పార్టీ ఇమేజ్ గ్రౌండ్ లెవల్‌లో దారుణంగా పడిపోయిందన్న అభిప్రాయం వినిపిస్తోంది.పార్టీ కోసం ప్రాణాలు ఇచ్చే కరడుగట్టిన కార్యకర్తలు సైతం ఈ మార్పును జీర్ణించుకోలేకపోతున్నారు. జగన్ రెడ్డికి తెలియకుండానే ఆయనను ఒక బందీగా మార్చేశారని, ప్రతి చిన్న విషయానికి సలహాదారులపై ఆధారపడేలా చేయడం వెనుక లోతైన రాజకీయ కుట్ర దాగి ఉందనే చర్చ సాగుతోంది. జగన్ రెడ్డి ఇమేజ్‌ను టార్నిష్ చేసి, ఆయనను జనానికి దూరం చేయడమే సజ్జల అంతిమ లక్ష్యమా అనే ప్రశ్నలు ఇప్పుడు వైసీపీ సర్కిల్స్‌లో గట్టిగా వినిపిస్తున్నాయినిజానికి జగన్ రెడ్డికి ఉన్న వాగ్ధాటి గురించి అందరికీ తెలుసు. కానీ అధికారంలోకి వచ్చాక ఆయన చుట్టూ చేరిన కోటరీ ఆయనను ఒక చదువరీ గా మార్చేసింది. ప్రజల కళ్ళలోకి చూసి మాట్లాడాల్సిన నాయకుడు, పేపర్ల వైపు చూస్తూ మాట్లాడటం వల్ల ఓటర్లతో కనెక్ట్ తగ్గిపోయింది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే, జగన్ రెడ్డి తన స్వయం ప్రతిపత్తిని కోల్పోయి, కేవలం సలహాదారుల చేతిలో కీలుబొమ్మగా మిగిలిపోతారనే ఆందోళన పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతోంది.

# పెద్దిరెడ్డి ఫ్యామిలీ గుడ్ బై

తిరుపతి ఫిబ్రవరి 26,

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఒక బలమైన లీడర్ గుడ్ బై చెబుతారా? వ్యూహాత్మకంగా సైలెన్స్ పాటిస్తున్నారా? అధినేత వైఖరి నచ్చడం లేదా? లేకుంటే కూటమి ప్రభుత్వం దూకుడు కారణమా? పొలిటికల్ వర్గాల్లో ఇదే చర్చ నడుస్తోంది. ఇంతకీ ఎవరో నేత అంటే చిత్తూరు జిల్లాకు చెందిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి.



వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో బలమైన నేతగా ఉన్నారు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి. మొన్నటి కూటమి ప్రభంజనాన్ని కూడా తట్టుకున్నారు. తాను ఒక్కడిని గెలవడమే కాదు తన సోదరుడు ద్వారకానాథ్ రెడ్డి ని తంబళ్లపల్లె నుంచి గెలిపించుకున్నారు. కుమారుడు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి రాజంపేట ఎంపీ గాను గెలిచారు. అయితే మారిన పరిస్థితుల నేపథ్యంలో పెద్దిరెడ్డి ఫ్యామిలీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెబుతుందన్న ప్రచారం జోరుగా సాగుతోంది.వైయస్ రాజశేఖర్ రెడ్డి కి అత్యంత సన్నిహితుడు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి. ఆ సాన్నిహిత్యం తోనే జగన్మోహన్ రెడ్డి వెంట అడుగులు వేశారు పెద్దిరెడ్డి. గత దశాబ్ద కాలంగా బలమైన, తిరుగులేని నేతగా ఎదిగారు. పార్టీ తరఫున రాయలసీమ బాధ్యతలను జగన్మోహన్ రెడ్డి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కి అప్పగించారు. అయితే వైసిపి అధికారంలో ఉన్నప్పుడు దూకుడు ప్రదర్శించిన పెద్దిరెడ్డి ఫ్యామిలీ ఇప్పుడు క్రమేపి పార్టీ కార్యకర్తలకు దూరంగా ఉంటుంది. దీంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఆ కుటుంబం రాజీనామా చేయబోతోందా? అనే చర్చ రాజకీయ వర్గాల్లో ప్రారంభం అయింది. ప్రస్తుతం ఆ ఫ్యామిలీ ఎదుర్కొంటున్న న్యాయపరమైన సమస్యలు చూస్తుంటే మాత్రం పార్టీ మారుతారని బలమైన ప్రచారం జరుగుతోంది. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత పెద్దిరెడ్డి ఫ్యామిలీతో పాటు వారి అనుచరుల వ్యాపారాలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. గతంలో పెద్దిరెడ్డి మాటే శాసనం అన్నట్టు ఉండేది. కానీ ఇప్పుడు పూర్తిగా సీన్ మారిపోయింది.మద్యం కుంభకోణంలో పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి అరెస్ట్ అయ్యారు. రాజమండ్రి సెంట్రల్ జైల్లో సుదీర్ఘకాలం రిమాండ్ ఖైదీగా ఉండిపోయారు. అటు తర్వాత పెద్దిరెడ్డి పై సైతం అనేక కేసులు తెరపైకి వచ్చాయి. ఈ పరిస్థితుల్లో దూకుడు కంటే మౌనం పాటించడమే మేలన్న నిర్ణయానికి పెద్దిరెడ్డి ఫ్యామిలీ వచ్చినట్లు తెలుస్తోంది. అయితే చివరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకత్వం పిలుపు ఇచ్చిన కార్యక్రమాలను సైతం నిర్వహించలేని పరిస్థితి ఆ ఫ్యామిలీది. పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉండటంతో జగన్ సైతం ప్రత్యామ్నాయ నాయకత్వాన్ని వెతుక్కుంటున్నట్లు సమాచారం. అందుకే పెద్దిరెడ్డి తన దారి తాను చూసుకునే పనిలో ఉన్నారని లీకులు బయటకు వస్తున్నాయి. సాధారణంగా పెద్దిరెడ్డి లాంటి సీనియర్ నేత బయటకు వెళ్లిపోతే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చాలా నష్టం. కోలుకోలేని దెబ్బ కూడా. అయితే తనపై ఉన్న కేసుల ఒత్తిడి, వ్యాపార ప్రయోజనాల దృష్ట్యా.. పెద్దిరెడ్డి కూటమి వైపు వెళ్తారా? లేకుంటే స్వతంత్రంగా వ్యవహరిస్తారా? అన్నది తెలియాల్సి ఉంది. అయితే ఏదో ఒక నిర్ణయం తీసుకుంటారు అనేది చిత్తూరు జిల్లా పొలిటికల్ వర్గాల్లో బలమైన చర్చ నడుస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో?

# అసెంబ్లీ వేదికగా రాజకీయ కురుక్షేత్రం

విజయవాడ, ఫిబ్రవరి 26, (న్యూస్ పల్స్)

కల్తీ నెయ్యి వ్యవహారంపై ఏపీ అసెంబ్లీ వేదికగా రాజకీయ కురుక్షేత్రం మొదలుకానుంది. ప్రభుత్వం ఈ అంశాన్ని అత్యంత ప్రతిష్టాత్మకగా తీసుకుని, వాస్తవాలను ప్రజల ముందు ఉంచేందుకు వ్యూహరచన చేసింది. తిరుమల పవిత్రతను దెబ్బతీసేలా గత ప్రభుత్వ హయాంలో జరిగిన నెయ్యి కల్తీ వ్యవహారం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో చిచ్చు రేపుతోంది. ఈ సున్నితమైన అంశంపై శాసనసభలో సుదీర్ఘ చర్చకు రంగం సిద్ధమైంది. కేవలం ఆరోపణలతో సరిపెట్టకుండా, ఆధారాలతో సహా వైసీపీ వైఫల్యాలను ఎండగట్టాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించుకుంది.వైసీపీ అధికారంలోకి రాగానే చేసిన నెయ్యి కల్తీ నుంచి అ నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్ఇచ్చిన నివేదికతో సహా ప్రస్తుతం విచారణ జరుపుతున్న ఏకసభ్య కమిషన్ వరకు ప్రతి అంశాన్ని ప్రభుత్వం సభ ముందు ఉంచనుంది. గత ప్రభుత్వ హయాంలో హిందూ ధర్మానికి, భక్తుల మనోభావాలకు జరిగిన ద్రోహాన్ని సాక్ష్యాధారాలతో నిరూపించడమే లక్ష్యంగా పాలకపక్షం అడుగులు వేస్తోంది. టెండర్ల ప్రక్రియలో జరిగిన లోపాలు, తక్కువ ధరకు నెయ్యి సరఫరా వెనుక ఉన్న మతలబులను బయటపెట్టడం ద్వారా ప్రతిపక్షాన్ని ఇరుకున పెట్టాలని భావిస్తోంది. తప్పును ఒప్పుకోకుండా తిరిగి హెరిటేజ్ సంస్థపై, ముఖ్యమంత్రి కుటుంబంపై వైసీపీ చేస్తున్న ఎదురుదాడిని తిప్పికొట్టేందుకు అసెంబ్లీని సరైన వేదికగా ప్రభుత్వం భావిస్తోంది.ప్రస్తుత పరిస్థితుల్లో వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వచ్చే ధైర్యం చేస్తారా అన్నది చర్చనీయాంశంగా మారింది. సభలో చర్చ జరిగితే వాస్తవాలు బయటకు వస్తాయని, అది తమ రాజకీయ మనుగడకే ప్రమాదమని వారు ఆందోళన చెందుతున్నారు. శాసనసభకు గైర్హాజరై, శాసనమండలిలో మాత్రం నిరసనల పేరుతో కాలయాపన చేసి బయటకు వెళ్లిపోయే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. చర్చలో పాల్గొంటే సమాధానం చెప్పుకోలేక, పాల్గొనకపోతే పారిపోయారన్న ముద్ర పడుతుందన్న సందిగ్ధంలో ఆ పార్టీ నేతలు ఉన్నారు.హిందూ ధర్మంపై దాడులు జరుగుతున్నా చూస్తూ ఊరుకుంటే అది మరిన్ని అనర్థాలకు దారితీస్తుందని ప్రభుత్వం గట్టిగా నమ్ముతోంది. భక్తుల మనోభావాలతో ఆడుకున్న వారిని చట్టపరంగానే కాకుండా, రాజకీయంగా కూడా ప్రజల ముందు దోషులుగా నిలబెట్టాలని చూస్తోంది. అందుకే ఈ వారంలోనే శాసనసభతో పాటు శాసనమండలిలో కూడా దీనిపై చర్చను చేపట్టాలని నిర్ణయించింది. ప్రజలకు అసలు నిజాలు తెలిస్తేనే తప్పుడు ప్రచారాలకు అడ్డుకట్ట పడుతుందని కూటమి నేతలు భావిస్తున్నారు. ప్రజలకు నిజాలు తెలియచేయడమే లక్ష్యంగా శాసనసభలో చర్చలు జరగనున్నాయి.

# బాలయ్య, నాగబాబులకు మంత్రి పదవులు..?

విజయవాడ, ఫిబ్రవరి 26

పొలిటికల్ గ్యాసిప్స్ అనేవి సర్వసాధారణం. ఎన్నికలతో పని లేకుండా ఇవి వినిపిస్తూనే ఉంటాయి. ఇప్పుడు నందమూరి బాలకృష్ణ విషయంలో ఒక వార్త వైరల్ అవుతోంది. త్వరలో నందమూరి బాలకృష్ణకు మంత్రి పదవి ఇవ్వబోతున్నారు అన్నది ఈ వార్త సారాంశం. త్వరలో మంత్రివర్గ విస్తరణ ఉన్న నేపథ్యంలో నందమూరి బాలకృష్ణ కు మంత్రి పదవి ఇవ్వబోతున్నారనే వార్త



పొలిటికల్ వర్గాల్లో హల్చల్ చేస్తోంది. అదే జరిగితే నందమూరి అభిమానులకు శుభవార్త. అయితే అదే సమయంలో కొన్ని రకాల సమీకరణల దృష్ట్యా.. బాలకృష్ణ కు మంత్రి పదవి ఇవ్వడం సాధ్యమేనా అనే చర్చ నడుస్తోంది.ఏపీ రాజకీయాలతో పాటు సినిమా రంగాల్లో నందమూరి కుటుంబానికి ప్రత్యేక స్థానం. ఎన్టీఆర్ నట వారసుడిగా తెరపైకి వచ్చారు బాలకృష్ణ. సినిమా రంగంలో తనకంటూ ఒక ముద్ర చాటుకున్నారు. రాజకీయాల్లోకి కూడా వచ్చారు. 2014 నవ్యాంధ్రప్రదేశ్ ఎన్నికల్లో తొలిసారిగా హిందూపురం నుంచి పోటీ చేసి గెలిచారు. హిందూపురం అంటే నందమూరి కుటుంబానికి పెట్టని కోట. అటువంటి చోట హ్యాట్రిక్ విజయం సాధించారు నందమూరి బాలకృష్ణ. ముచ్చటగా మూడోసారి గెలిచేసరికి బాలకృష్ణ కు మంత్రి పదవి దక్కుతుందని అంతా భావించారు. కానీ అటువంటిదేమీ లేకుండా పోయింది.తెలుగుదేశం పార్టీలో నందమూరి ఫ్యామిలీకి సరైన ప్రాధాన్యత లేకుండా పోయిందన్న విమర్శ రాజకీయ ప్రత్యర్థుల నుంచి వినిపిస్తూ ఉంటుంది. కానీ అటువంటిదేమీ పట్టించుకోరు నందమూరి బాలకృష్ణ. తన సినిమాలు తాను చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఎంత బిజీగా ఉన్నా హిందూపురం నియోజకవర్గానికి మాత్రం దగ్గరగానే ఉంటారు. ఇటీవల బాలకృష్ణ భార్య వసుంధర దేవి సైతం తరచూ హిందూపురం నియోజకవర్గం లో పర్యటిస్తూ వస్తున్నారు. బాలకృష్ణకు మంత్రి పదవి ఇవ్వాలని హిందూపురం నియోజకవర్గం ప్రజలతో పాటు నందమూరి కుటుంబాభిమానులు కోరుతూ వచ్చారు. అయితే ఇప్పటికే క్యాబినెట్లో బాలకృష్ణ అల్లుడు నారా లోకేష్ మంత్రిగా ఉన్నారు. బావ చంద్రబాబు సీఎం గా ఉన్నారు. బాలకృష్ణ కు మంత్రి పదవి ఇస్తే రాజకీయ ప్రత్యర్థులు తప్పుడు ప్రచారం చేస్తారన్న ఆలోచన చంద్రబాబులో ఉంది. ఇటువంటి నేపథ్యంలో నందమూరి బాలకృష్ణ కు మంత్రి పదవి ఇస్తారా? అనేది ఒక అనుమానం.త్వరలో మెగా బ్రదర్ నాగబాబును మంత్రి వర్గంలోకి తీసుకుంటామని సీఎం చంద్రబాబు స్వయంగా ప్రకటించారు. అందుకు తగ్గట్టుగానే నాగబాబును ఎమ్మెల్సీ చేశారు. విస్తరణలో ఆయనకు మంత్రి పదవి ఖాయం. అయితే మెగా కుటుంబంలో ఇద్దరికి ఇచ్చి.. నందమూరి కుటుంబంలో ఒకే ఒక్కడుగా ఉన్న బాలకృష్ణకు ఇవ్వకపోతే ఇబ్బందికర పరిస్థితులు వస్తాయని అంచనాలు ఉన్నాయి. పైగా నందమూరి కుటుంబాన్ని చంద్రబాబు పట్టించుకోవడం లేదన్న విమర్శకు బాలకృష్ణకు మంత్రి పదవి ఇవ్వడం ద్వారా చెక్ చెప్పవచ్చు. అందుకే ఈసారి మంత్రి పదవి బాలకృష్ణ కు ఖాయం అన్న ప్రచారం పొలిటికల్ వర్గాల్లో నడుస్తోంది. వీలైనంత త్వరగా పెండింగ్ సినిమాలు పూర్తి చేసి.. రాజకీయంగా యాక్టివ్ కావాలని చూస్తున్నారు బాలకృష్ణ. మెగా ఫ్యామిలీతో పాటు నందమూరి కుటుంబానికి ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా.. ఆ రెండు కుటుంబ అభిమానులతో మరోసారి అధికారంలోకి వచ్చేందుకు చంద్రబాబు స్కెచ్ వేసినట్లు ప్రచారం నడుస్తోంది. మరి అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి

# తెలుగు రాష్ట్రాల మధ్య తొలి హైటెక్ హైవే

హైదరాబాద్, ఫిబ్రవరి 26,

తెలుగు రాష్ట్రాల మధ్య రాకపోకలు సాగించే వారికి గుడ్‌న్యూస్. ముఖ్యంగా హైదరాబాద్ నుంచి విశాఖ వెళ్లే వాహనదారులు ఎగిరిగంతేసే వార్త. ఎందుకంటే త్వరలోనే మరో కొత్త హైవే అందుబాటులోకి రానుంది. ఖమ్మం-దేవరపల్లి మధ్య హైటెక్ హంగులతో నిర్మించిన హైవేను మే నెలలో ప్రారంభించేందుకు ఎన్‌హెచ్ఏఐ ఏర్పాట్లు చేస్తోంది. ఈ హైవే అందుబాటులోకి వస్తే హైదరాబాద్-విశాక 56 కి.మీ దూరం తగ్గనుంది.తెలంగాణ-ఏపీ మధ్య ప్రయాణాలు సాగించేవారికి గుడ్‌న్యూస్. త్వరలోనే మరో గ్రీన్‌ఫీల్డ్ హైవే అందుబాటులోకి రానుంది. ప్రస్తుతం హైదరాబాద్-విజయవాడ, హైదరాబాద్-శ్రీశైలం నేషనల్ హైవేలపై రాకపోకలు సాగిస్తున్నారు. ఈ హైవేలపై రద్దీ పెరగటంతో తెలుగు రాష్ట్రాలను కలుపుతూ మరో హైవేను నిర్మించారు. ఖమ్మం-ఏపీలోని దేవరపల్లి మధ్య నిర్మించిన మొదటి యాక్సెస్ కంట్రోల్ గ్రీన్‌ఫీల్డ్ హైవే త్వరలోనే వాహనదారులకు అందుబాటులోకి రానుంది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో హైటెక్ హంగులతో నాలుగు వరుసలుగా ఈ రోడ్డు రెడీ అవుతోంది.తెలుగు రాష్ట్రాల్లో ప్రస్తుతం అనేక గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవేలు నిర్మాణంలో ఉన్నాయి. వీటిలో మొదటిదిగా.. తెలంగాణలోని ఖమ్మం నుంచి ఏపీలోని దేవరపల్లి వరకు 162.04 కి.మీ. పొడవున చేపట్టిన ఈ రహదారికి ఎన్‌హెచ్ఏఐ తుదిమెరుగులు దిద్దుకుంటోంది. హైదరాబాద్ నగరం నుంచి విశాఖపట్నం వెళ్లాలంటే ప్రస్తుతం ఎన్‌హెచ్ 65పై సూర్యాపేట, విజయవాడల మీదుగా 676 కిలో మీటర్లు ప్రయాణించాల్సి ఉంటుంది. ఈ కొత్త హైవే అందుబాటులోకి వస్తే 56 కి.మీ తగ్గనుంది. ఖమ్మం సమీపంలోని తల్లంపాడు నుంచి ఏపీలోని ఏలూరు, తూర్పుగోదావరి జిల్లాల మీదుగా దేవరపల్లి వరకు ఈ రోడ్డును నిర్మిస్తుండగా.. ఎన్‌హెచ్-365బీజీగా ఈ రహదారికి నంబరును కేటాయించారు.ఇక ఈ హైవే హైటెక్ హంగులతో రూపుదిద్దుకుంటోంది. సీసీ కెమెరాలు, సోలార్ ప్యానళ్లు, సమాచారాన్ని అందించే క్యూఆర్ కోడ్‌లు, అత్యాధునిక రవాణా నిర్వహణ వ్యవస్థ, ఎమర్జెన్సీ మీడియన్ ఓపెనింగ్స్ వంటివి ఏర్పాటు చేశారు. ప్రయాణించిన దూరానికే టోల్ వసూళ్లు చేయనున్నారు. పరిమిత సంఖ్యలో అంటే 19 చోట్ల మాత్రమే ఎంట్రీ, ఎగ్జిట్ ప్రదేశాలు ఏర్పాటు చేశారు. దానికి తోడు ప్రతి 50 కి.మీ రోడ్డుకు రెండు వైపులా దాదాపు 5 ఎకరాల్లో స్థలంలో వాహనదారులు సేదతీరేందుకు ప్రత్యేక స్థలం కేటాయించారు. ఇందులో హోటళ్లు, రెస్టారెంట్లు, టాయిలెట్స్, పెట్రోల్ బంకులు వంటి సౌకర్యాలు ఉంటాయి. హైవేపై ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్ స్కాన్ చేయటం ద్వారా మీరున్న లొకేషన్, దగ్గర్లోనే పోలీస్ స్టేషన్లు, పెట్రోల్ బంకులు, హాస్పిటల్స్ వంటి సమాచారం తెలుసుకోవచ్చు.ఇప్పటి వరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య యాక్సెస్ కంట్రోల్ గ్రీన్‌ఫీల్డ్ రహదారి ఒక్కటి కూడా లేదు. ఖమ్మం దేవరపల్లి హైవే అందుబాటులోకి వస్తే ఇదే మొదటిది అవుతుంది. ఈ రహదారిని ఈ ఏడాది మేలో ప్రారంభించడానికి ఎన్‌హెచ్ఏఐ ఏర్పాట్లు చేస్తోంది.

# ఎన్ సీఈఆర్టీ బుక్ పై సుప్రీం ఆగ్రహాం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26

ఎన్‌సీఈఆర్టీ 8వ తరగతి పాఠ్య పుస్తకంలో అవినీతి గురించి ఓ అంశం చేర్చింది. అయితే, న్యాయవ్యవస్థ గురించి గతంలో మాజీ సీజేఐ చేసిన వ్యాఖ్యలను ఉటంకించడం గమనార్హం. దీనిపై తీవ్ర దుమారం రేగుతోంది. అసలు రాజకీయాలే అవినీతిక కేరాఫ్ అడ్రస్ అని, అలాంటప్పుడు వాటి గురించి ఎందుకు పుస్తకంలో పేర్కొనలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశం సుప్రీంకోర్టు దృష్టికి రాగా.. సీజేఐ కూడా తీవ్రంగా స్పందించారు. ప్రతిష్ఠకు భంగం కలిగిస్తే ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు.ఎనిమిదో తరగతి సిలబస్‌లో న్యాయవ్యవస్థలో అవినీతి ‘ ఓ పాఠ్యాంశంగా ప్రవేశపెట్టడంపై సర్వోన్నత న్యాయస్థానం తీవ్రంగా స్పందించింది. జాతీయ విద్య పరిశోధన శిక్షణ సంస్థ తీరుపై సుప్రీంకోర్టు మండిపడింది. ఇది అందర్నీ కలవరానికి గురిచేసిందని, న్యాయవ్యవస్థ ప్రతిష్ఠకు భంగం కలిగించే చర్యలను సహించబోమని తేల్చిచెప్పింది. న్యాయస్థానం ఏ సంస్థను, ఏ వ్యక్తిని కించపరచడానికి అనుమతించదని, ఈ విషయంలో చట్టం తన పని తాను చేసుకుపోతుందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. కొన్ని రోజులు ఆగితే దీనిపై సుమోటోగా విచారణ చేపడతామని పేర్కొన్నారు. ఈ అంశాన్ని సుప్రీంకోర్టు దృష్టికి సీనియర్ న్యాయవాది, ఎంపీ కపిల్ సిబల్ తీసుకొచ్చారు. ఎన్సీఆర్టీ 8వ తరగతిలో న్యాయవ్యవస్థలో అవినీతి గురించి బోధిస్తోందని వివరించారు. ఈ నేపథ్యంలో అత్యున్నత న్యాయస్థానం నుంచి స్పందన వచ్చింది.సుప్రీంకోర్టు స్పందన నేపథ్యంలో పాఠ్య పుస్తకం నుంచి ఈ అంశాన్ని ఎన్సీఈఆర్టీ తొలగించనున్నట్టు ఉన్నతస్థాయి ప్రభుత్వ వర్గాలు బుధవారం వెల్లడించాయి. “దీనిని చేర్చి ఉండకూడదు..

అటువంటి అంశాలను హైలైట్ చేయడం సముచితం కాదు.. బదులుగా స్ఫూర్తిదాయకమైన విషయాలు పొందుపరిచి ఉండాల్సింది'' కేంద్ర ప్రభుత్వ వర్గాలు ప్రకటించాయి.. న్యాయవ్యవస్థలో అవినీతి, దుష్ప్రవర్తన ప్రజల నమ్మకాన్ని దెబ్బతీస్తాయని, ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయన్న సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ జులై 2025లో చేసిన వ్యాఖ్యలను పాఠ్యాంశంలో ప్రస్తావించారు. “ప్రజలకు విశ్వాసం కల్పించడానికి పారదర్శకత, జవాబుదారీతనం ప్రజాస్వామ్య ధర్మాలు” అని ఆయన అన్న వ్యాఖ్యలను పుస్తకంలో ఉటంకించారు. సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసిన కొద్దిసేపటికే ప్రభుత్వ వర్గాలు ఈ అంశంపై స్పందించాయి.‘ఎన్సీఆర్టీ 8వ తరగతి పాఠ్య పుస్తకంలో న్యాయవ్యవస్థలో అవినీతి అనే అంశాన్ని పాఠంగా జోడించింది. మరి మంత్రులు, ప్రజా సేవకులు,దర్యాప్తు సంస్థలు సహా రాజకీయ నాయకులు భారీ అవినీతి సంగతి ఏంటి? వాటిని ఎందుకు పక్కనబెట్టాలి’ అని కపిల్ సిబల్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. అయితే, కాగా, కొద్ది రోజుల కిందట 2016 నుంచి 2025 మధ్య సుప్రీంకోర్టు, హైకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తులపై సుప్రీంకోర్టుకు 7,520 ఫిర్యాదు అందినట్టు న్యాయశాఖ నివేదిక విడుదల చేయడం గమనార్హం.

దీనిపై సీనియర్ అభిషేక్ మను సింఘ్వీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇతర రంగాల్లో అవినీతిని పక్కనబెట్టి కేవలం న్యాయవ్యవస్థనే వేలెత్తి చూపుతున్నారని మండిపడ్డారు.పాఠశాల స్థాయిలో విద్యలో పిల్లలకు విద్యావంతులను చేయాల్సింది పోయి ఇలాంటి సంక్లిష్టమై అంశాలను చేర్చడం ఏంటి? అని సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూత్రా ప్రశ్నించారు. ఎనిమిదో తరగతిలో, విద్యార్థులకు పాలనా విభాగాలు, వాటి విధులను పరిచయం చేయడమే ముఖ్య ఉద్దేశ్యం అని ఆయన అన్నారు.

# బీఆర్ఎస్ వ్యూహాత్మక మౌనం

హైదరాబాద్, ఫిబ్రవరి 26,

తెలంగాణ రాజకీయ ముఖచిత్రం ప్రస్తుతం ఆసక్తికరమైన మలుపు తిరుగుతోంది. కాంగ్రెస్, బీజేపీ మధ్య సాగుతున్న ప్రత్యక్ష పోరాటాలు ప్రజాక్షేత్రంలో హోరెత్తుతుంటే, ప్రధాన ప్రతిపక్షంగా ఉండాల్సిన బీఆర్ఎస్ వ్యూహాత్మక మౌనం పాటిస్తోందనే చర్చ జరుగుతోంది. రాష్ట్రంలో ప్రధాన పోటీ తమ మధ్యే అన్నట్లుగా కాంగ్రెస్, బీజేపీ శ్రేణులు వీధి పోరాటాలకు ప్రాధాన్యత ఇస్తున్నాయి. కామారెడ్డిలో మొదలైన నిరసన జ్వాలలు క్రమంగా రాష్ట్రమంతటా విస్తరించడం చూస్తుంటే.. ప్రజల్లో ఇతర ప్రత్యామ్నాయం లేదనే భావన కలిగించడం ఈ రెండు పార్టీల ఉమ్మడి ఎత్తుగడగా కనిపిస్తోంది. క్షేత్రస్థాయి సమస్యలపై ఈ రెండు పార్టీలు పరస్పరం విమర్శలు చేసుకుంటూ వార్తల్లో నిలుస్తుండటంతో రాజకీయం అంతా వారి చుట్టూనే తిరుగుతోంది.మరోవైపు బీఆర్ఎస్ అధినాయకత్వం ప్రస్తుతానికి కొంత వెనక్కి తగ్గినట్లు కనిపిస్తున్నా, అది ముందస్తు వ్యూహంలో భాగమేనని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు బీజేపీ వైపు మళ్లకుండా ఉండేందుకు, అధికార పక్షం వైఫల్యాలను ఎండగట్టే సరైన సమయం కోసం వేచి చూసే ధోరణిని గులాబీ దళం అనుసరిస్తోంది. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, ప్రభుత్వ పథకాల అమలులో లోపాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడం ద్వారా మళ్ళీ రేసులోకి రావాలని ప్లాన్ చేస్తోంది.కేవలం మౌనంగా ఉంటే ఇతర పార్టీల దూకుడు పెరిగి తమ ఉనికికే ప్రమాదం ఏర్పడుతుందని బీఆర్ఎస్ ద్వితీయ శ్రేణి నాయకత్వం ఆందోళన వ్యక్తం చేస్తోంది. దీనిని అధిగమించేందుకు త్వరలోనే పార్టీ అధిష్టానం నియోజకవర్గాల వారీగా భారీ బహిరంగ సభలు, పాదయాత్రలు లేదా ఇతర ఆందోళన కార్యక్రమాలకు రూపకల్పన చేసే అవకాశం ఉంది. కేవలం హైదరాబాద్‌కే పరిమితం కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో



కూడా క్యాడర్‌ను ఉత్తేజితం చేసేలా కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు సమాచారంఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల ఫలితాలు బీఆర్ఎస్‌కు కొంత హెచ్చరికగా మారాయి. కాంగ్రెస్ తన పట్టును నిరూపించుకోగా, బీజేపీ కొన్ని పట్టణ ప్రాంతాల్లో పుంజుకుంది. ఈ ఫలితాల తర్వాత బీఆర్ఎస్ తన శైలిని మార్చుకోవాల్సిన అవసరం ఏర్పడింది. ఓటర్ల నాడిని పట్టుకోవడంలో ఎక్కడ విఫలమయ్యామనే అంశంపై ఇప్పటికే అంతర్గత సమీక్షలు ప్రారంభమయ్యాయి. స్థానిక నేతలను సమన్వయం చేసుకుంటూ ప్రజల్లోకి వెళ్లడమే తదుపరి లక్ష్యంగా కనిపిస్తోంది.బీఆర్ఎస్ మళ్లీ తన ప్రాభవాన్ని చాటుకోవాలంటే కేవలం విమర్శలకే పరిమితం కాకుండా, నిర్మాణాత్మక పోరాటాలు చేయాల్సి ఉంటుంది. ముఖ్యంగా నీళ్లు, నిధులు, నియామకాల అంశంపై మరోసారి గళం విప్పడం ద్వారా తెలంగాణ అస్తిత్వ కార్డును వాడే అవకాశం ఉంది. కాంగ్రెస్ వైఫల్యాలను, బీజేపీ రాజకీయాలను ఒకేసారి టార్గెట్ చేస్తూ తెలంగాణ రక్షించే పార్టీ అనే నినాదంతో ముందుకు వెళ్తేనే తిరిగి ఆ రెండు పార్టీలకు ధీటైన పోటీ ఇచ్చే అవకాశం ఉంటుంది.

# క్షేత్రస్థాయిపై దృష్టి

హైదరాబాద్, ఫిబ్రవరి 26

తెలంగాణ రాజకీయాల్లో పదిహేనేళ్ల పాటు తిరుగులేని శక్తిగా వెలిగిన భారత్ రాష్ట్ర సమితి ఇప్పుడు తిరిగి పూర్వ వైభవం కోసం నిశ్శబ్దంగా పావులు కదుపుతోంది. అసెంబ్లీ ఎన్నికల ఓటమి తర్వాత కొంతకాలం మౌనంగా ఉన్న అధినేత కేసీఆర్, ఇప్పుడు క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు సరికొత్త వ్యూహాలను అమలు చేయనున్నారు. ఎన్నికల ఫలితాల తర్వాత కార్యకర్తల్లో నెలకొన్న నైరాశ్యాన్ని పోగొట్టడంపై కేసీఆర్ ప్రధానంగా దృష్టి సారించారు. నియోజకవర్గాల వారీగా కీలక నేతలతో టెలికాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తూ, ఓటమికి గల కారణాలను విశ్లేషిస్తున్నారు. పార్టీ శ్రేణులకు అండగా ఉంటామనే నమ్మకాన్ని కలిగిస్తూనే, ప్రభుత్వం చేస్తున్న పొరపాట్లను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని దిశానిర్దేశం చేస్తున్నారు. ముఖ్యంగా సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేలా ప్రత్యేక బృందాలను సిద్ధం చేశారు.రాజకీయాలు వేగంగా మారుతున్నా కేసీఆర్ ఏమాత్రం తొందరపడకుండా వ్యవహరిస్తున్నారు. వెళ్లే వారిని అడ్డుకోకుండా, మిగిలి ఉన్న నిబద్ధత గల నాయకులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. పదవుల కోసం పార్టీ మారే వారితో పోలిస్తే, సిద్ధాంతం కోసం నిలబడే వారే పార్టీకి అసలైన బలమని ఆయన భావిస్తున్నారు. ఈ క్రమంలోనే ద్వితీయ శ్రేణి నాయకత్వానికి పెద్దపీట వేస్తూ, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు వారిని సమాయత్తం చేస్తున్నారు. దీనికోసం ప్రతి మండలానికి ఒక ఇన్‌ఛార్జ్‌ను నియమించి కొత్త రక్తాన్ని ప్రోత్సహించాలని నిర్ణయించారు.గతంలో తెలంగాణ సెంటిమెంట్ మీద ఎక్కువగా ఆధారపడిన బీఆర్ఎస్, ఇప్పుడు ప్రజా సమస్యల మీద గొంతు ఎత్తుతోంది. నిరుద్యోగ భృతి, రైతు రుణమాఫీ, పెన్షన్ల పంపిణీలో జరుగుతున్న జాప్యం వంటి అంశాలను అస్త్రాలుగా మార్చుకుంటోంది. ప్రజల పక్షాన నిలబడి పోరాడటం ద్వారా కోల్పోయిన ప్రజాధారణను మళ్ళీ పొందవచ్చని కేసీఆర్ గట్టిగా విశ్వసిస్తున్నారు. శాసనసభలో కూడా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేలా వ్యూహకర్తలతో కలిసి నిరంతర చర్చలు జరుపుతున్నారు. ఓ వైపు తెలంగాణ సెంటిమెంట్ తో పాటు ప్రజా సమస్యలను కూడా ఎక్కువగా తెరపైకి తెచ్చి పోరాడాలని భావిస్తున్నారు.బయటకు పెద్దగా కనిపించకపోయినా, ఎర్రవెల్లి ఫామ్ హౌస్ కేంద్రంగా కేసీఆర్ రాజకీయ చదరంగం నడుపుతున్నారు. ఎప్పుడు ఏ అడుగు వేయాలో తెలిసిన ఆయన, ప్రస్తుత రాజకీయ పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నారు. ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత మొదలైనప్పుడు దాన్ని తమకు అనుకూలంగా మార్చుకునేందుకు సిద్ధంగా ఉన్నారు. ఒకప్పుడు ఉద్యమ నేతగా పార్టీని ఎలా నిర్మించారో, ఇప్పుడు కూడా అదే పట్టుదలతో పునర్నిర్మాణ బాధ్యతలు చేపట్టారు.సరైన సమయం చూసి బీఆర్ఎస్ పార్టీ మొత్తాన్ని ఒక్క సారి రీయాక్టివేట్ చేస్తారని బీఆర్ఎస్ వర్గాలు భావిస్తున్నాయి. గోదావరి జలాల పేరుతో బహిరంగసభలతో దీన్నిప్రారంభించాలనుకున్నా.. మున్సిపల్ ఎన్నికల కారణంగా వాయిదా వేశారు.

# విజయం వెనుక రహస్యం...

కరీంనగర్, ఫిబ్రవరి 26,

కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ విజయ పరంపర వెనుక ఒక బలమైన దైవ రహస్యం ఉంది. కరీంనగర్ కంచుకోటలో మహాశక్తి కొలువు తీర్చినా, భాగ్యనగర నడిబొడ్డున భాగ్యలక్ష్మి అమ్మవారి చెంత మోకరిల్లినా.. ఆయన వేసే ప్రతి అడుగు ఒక గెలుపు పిలుపుగా మారుతోంది. కార్పొరేటర్ స్థాయి నుండి నేడు కేంద్ర రాజకీయాల్లో చక్రం తిప్పే స్థాయి వరకు ఎదిగిన సంజయ్ ప్రస్థానంలో, 'భాగ్యలక్ష్మి అమ్మవారే' తన విజయలక్ష్మి అని ఆయన ప్రగాఢ నమ్మకం. వరుస విజయాలతో దూసుకుపోతున్న ఈ 'హిందూ హృదయ సామ్రాట్' సెంటిమెంట్ వెనుక ఉన్న ఆసక్తికరమైన ఆధ్యాత్మిక ప్రయాణంపై ప్రత్యేక కథనం..బండి సంజయ్ రాజకీయ ప్రయాణం కార్పొరేటర్ స్థాయి నుండి కేంద్ర మంత్రి వరకు ఎదిగింది అంటే, దానికి ఆయన పోరాట పటిమతో పాటు అమ్మవారిపై ఆయనకున్న అచంచలమైన విశ్వాసం కూడా ఒక



కారణం.కార్పొరేటర్‌గా ఉన్న కాలంలోనే కరీంనగర్‌లో మహాశక్తి ఆలయ నిర్మాణానికి సంకల్పించడం ఆయన ఆధ్యాత్మిక చింతనకు నిదర్శనం. ఎంపీగా బాధ్యతలు చేపట్టాక ఆ సంకల్పాన్ని పూర్తి చేసి, ప్రతి ఏటా శక్తి మాల ధరించి అమ్మవారి సేవలో తరించడం ఆయనకు ఒక ఆనవాయితీగా మారింది.హైదరాబాద్‌లోని చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారు బండి సంజయ్ పాలిట విజయలక్ష్మిగా నిలిచారు.ఎన్నికల ప్రచారం ప్రారంభించే ముందు అమ్మవారిని దర్శించుకోవడం. కీలకమైన రాజకీయ నిర్ణయాలు లేదా పోరాటాల సమయంలో ఉదాహరణకు జీహెచ్ఎంసీ ఎన్నికలు, ప్రజా సంగ్రామ యాత్ర భాగ్యలక్ష్మి ఆలయం నుండే అడుగులు వేశాడు. వరుస విజయాలు రెండు సార్లు ఎంపీగా, జీహెచ్ఎంసీలో పార్టీ బలోపేతం ఈ నమ్మకాన్ని మరింత బలపరిచాయి.తెలంగాణలో బీజేపీ అధికారం చేపడితే భాగ్యలక్ష్మి ఆలయాన్ని స్వర్ణ దేవాలయంగా తీర్చిదిద్దుతామన్న ఆయన ప్రకటన కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. హిందూ ధర్మ పరిరక్షణలో భాగంగా ఈ ఆలయ అభివృద్ధిని ఆయన ఒక ప్రతిష్టాత్మక అంశంగా భావిస్తున్నారు.ఇటీవల కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ సాధించిన విజయం ఆయన నాయకత్వానికి మరో నిదర్శనం. గెలుపు అనంతరం మేయర్, డిప్యూటీ మేయర్ మరియు కౌన్సిలర్లతో కలిసి భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకోవడం ద్వారా, తన విజయాలన్నీ అమ్మవారికే అంకితమని ఆయన మరోసారి చాటిచెప్పారు.రాజకీయాల్లో వ్యూహాలు ఎంత ముఖ్యమో, దైవబలం కూడా అంతే అవసరమని నమ్మే నాయకుల్లో బండి సంజయ్ ముందు వరుసలో ఉంటారు. భాగ్యలక్ష్మి అమ్మవారి ఆశీస్సులతో ఆయన మరిన్ని విజయాలు అందుకోవాలని ఆశిద్దాం.

=========================

# రాజ్యసభ ఎన్నిక ఏకగ్రీవమా...

హైదరాబాద్, ఫిబ్రవరి 26,

తెలంగాణ రాజకీయ ముఖచిత్రం ఇప్పుడు రాజ్యసభ ఎన్నికల చుట్టూ తిరుగుతోంది. రాష్ట్రం నుంచి ఖాళీ అవుతున్న రెండు రాజ్యసభ స్థానాల కోసం జరగబోయే ఈ ఎన్నికలు ఏకగ్రీవం



అవుతాయా లేక పోటీ తప్పదా అన్న ఉత్కంఠను రేపుతున్నాయి. అసెంబ్లీలో ప్రస్తుతమున్న ఎమ్మెల్యేల సంఖ్యను బట్టి చూస్తే, అధికార కాంగ్రెస్ పార్టీకి ఒక స్థానాన్ని సునాయాసంగా గెలుచుకునే సంఖ్యాబలం ఉంది. అయితే, రెండో స్థానాన్ని దక్కించుకోవాలంటే మాత్రం సమీకరణాలు కీలకంగా మారాయి. ఇక్కడే రాజకీయ చదరంగం మొదలవుతోంది.కాంగ్రెస్ పార్టీ ఒక స్థానానికి ప్రముఖ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ పేరును దాదాపు ఖరారు చేసినట్లు తెలుస్తోంది. గతంలో ఆయనకు తక్కువ కాలమే అవకాశం రావడంతో, ఈసారి ఆయనకే ప్రాధాన్యం ఇవ్వాలని అధిష్ఠానం నిర్ణయించినట్లు సమాచారం.అయితే, రెండో స్థానం విషయంలో మాత్రం పార్టీలో ఆశావహుల జాబితా చాంతాడంత ఉంది. సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి పేరు ఈ రేసులో బలంగా వినిపిస్తోంది. గత రెండేళ్లుగా అటు ప్రభుత్వంలోనూ, ఇటు పార్టీలోనూ కీలక పాత్ర పోషిస్తూ.. పలు ఉప ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో ఆయన క్రియాశీలకంగా వ్యవహరించారు.వీరితో పాటు వి.హనుమంతరావు, మధుయాస్కీ గౌడ్, టి.జీవన్ రెడ్డి, షబ్బీర్ అలీ, జగ్గారెడ్డి, జానారెడ్డి వంటి సీనియర్లు కూడా ఈ పదవిపై ఆశలు పెట్టుకున్నారు.మరోవైపు, ప్రతిపక్ష బీఆర్ఎస్ ఈ ఎన్నికల్లో ఎటువంటి వ్యూహాన్ని అనుసరిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. సంఖ్యాబలం తక్కువగా ఉన్నప్పటికీ, ఒక మైనార్టీ అభ్యర్థిని బరిలోకి దించడం ద్వారా కాంగ్రెస్‌ను ఇరకాటంలో పెట్టాలని బీఆర్ఎస్ యోచిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇదే జరిగితే ఎంఐఎం మద్దతు ఎవరికి దక్కుతుందనేది ఉత్కంఠ రేపుతోంది. ఎంఐఎం మద్దతు గనుక కాంగ్రెస్‌కు లభిస్తే రెండో సీటును కూడా వారు సులువుగా గెలుచుకోవచ్చు. అయితే, బీఆర్ఎస్ మైనార్టీ కార్డును ప్రయోగిస్తే మాత్రం కాంగ్రెస్ తన అభ్యర్థి ఎంపికలో ఆచితూచి అడుగు వేయాల్సి ఉంటుంది. సామాజిక సమీకరణాలు దెబ్బతినకుండా చూసుకోవడం అధికార పార్టీకి పెద్ద సవాలుగా మారనుంది.బీజేపీకి ఉన్న 8 మంది ఎమ్మెల్యేలు ప్రస్తుత పరిస్థితుల్లో ఏ పార్టీకి మద్దతు ఇచ్చే అవకాశం లేదు. వారు తటస్థంగా ఉంటే అది పరోక్షంగా ఎవరికి లాభిస్తుందనే లెక్కలు కూడా మొదలయ్యాయి. ఈ నెల 26న నోటిఫికేషన్ విడుదల కానుండగా, మార్చి 5వ తేదీ వరకు నామినేషన్ల దాఖలుకు గడువు ఉంది. ఈ తక్కువ సమయంలో రాజకీయ పార్టీల మధ్య జరిగే అంతర్గత చర్చలు, పొత్తులు ఈ ఎన్నికల తుది ఫలితాన్ని నిర్ణయించనున్నాయి. ఒకవేళ బీఆర్ఎస్ వెనక్కి తగ్గితే ఎన్నికలు ఏకగ్రీవం కావచ్చు, లేనిపక్షంలో తెలంగాణలో మరో రాజకీయ రణరంగాన్ని చూడాల్సి వస్తుంది. మొత్తానికి ఈ రాజ్యసభ ఎన్నికలు రాబోయే రాజకీయ పరిణామాలకు ఒక కీలక మలుపుగా మారనున్నాయి.

# ఉద్యమ లక్ష్యాలనే నమ్ముకున్న గులాబీదళం.

హైదరాబాద్, ఫిబ్రవరి 26,

తెలంగాణ ఏర్పాటు తర్వాత రాజకీయ పార్టీగా మారామని కేసీఆర్ ప్రకటించారు. కానీ ఇప్పటికీ ఉద్యమపార్టీగానే వ్యవహరిస్తోంది. లక్ష్యం నెరవేరిన తర్వాత కూడా..తెలంగాణ సెంటిమెంట్తోనే రాజకీయాలు ఈదాలనుకుంటున్నారు. అక్కడే అసలైనతప్పిదం జరుగుతోంది. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పుట్టిన టీఆర్ఎస్, లక్ష్యం నెరవేరిన తర్వాత రాజకీయ పార్టీగా




అవతరించింది. అయితే, కేసీఆర్ ప్రకటించినట్లుగా అది పూర్తిస్థాయి రాజకీయ శక్తిగా రూపాంతరం చెందిందా అంటే సందేహమే. పదేళ్ల అధికారం, రెండేళ్ల ప్రతిపక్షంగా బాధ్యతల తరవాత కూడా ఇప్పటికీ అదే తెలంగాణ సెంటిమెంట్ ను నమ్ముకుని రాజకీయం చేయడం ఆ పార్టీ చేస్తున్న అతిపెద్ద పొరపాటుగా మారుతోంది. ఉద్యమ కాలం నాటి వ్యూహాలు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పని చేయడంలేదు.ఒక రాజకీయ పార్టీగా ప్రజల్లో గుర్తింపు పొందాలంటే ప్రభుత్వ వైఫల్యాలపై నిరంతరం పోరాడాలి. ప్రజల సమస్యలను భుజాన వేసుకోవాలి. కానీ బీఆర్ఎస్ మాత్రం ఇంకా ఉద్యమ కాలం నాటి భావోద్వేగాలనే పెట్టుబడిగా పెడుతోంది. తెలంగాణ ఏర్పాటు అనే ప్రధాన లక్ష్యం నెరవేరిన తర్వాత, ప్రజలు అభివృద్ధిని, సుపరిపాలనను కోరుకుంటారు తప్ప మళ్ళీ పాత సెంటిమెంట్లను కాదు. ఈ మార్పును గమనించడంలో ఆ పార్టీ నాయకత్వం వెనుకబడిందనే చర్చ సాగుతోంది.ఉద్యమ పార్టీగా ఉన్నప్పుడు ప్రజల్లో ఉండే ఆవేశం, రాజకీయ పార్టీగా మారినప్పుడు ఉండదు. కేవలం సెంటిమెంట్ చూపిస్తూ ఓట్లు అడగాలనుకోవడం ఇప్పుడున్న పరిస్థితుల్లో సాధ్యం కాదు. రాష్ట్రం వచ్చిన తర్వాత కూడా అదే పాత పాట పాడటం వల్ల ప్రజల్లో ఆ పార్టీ పట్ల ఉన్న ఆసక్తి తగ్గుతోంది. మా అవసరం ఉంది అని ప్రజలకు నమ్మకం కలిగించాలంటే, క్షేత్రస్థాయిలో ప్రజల పక్షాన నిలబడి పోరాడాలి. కానీ బీఆర్ఎస్ ఇంకా పాత జ్ఞాపకాల నుంచే రాజకీయం చేయాలనుకుంటోంది.ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక రాజకీయ పార్టీగా ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి. కానీ బీఆర్ఎస్ మాత్రం తన రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికి పదే పదే ప్రాంతీయ వాదాన్ని తెరపైకి తెస్తోంది. ప్రజలు ఒక ప్రత్యామ్నాయ శక్తిగా గుర్తించాలంటే, ఆ పార్టీ తన పంథాను మార్చుకోవాలి. ఉద్యమ ముసుగును పక్కన పెట్టి, పూర్తిస్థాయి రాజకీయ పార్టీగా జనం మధ్యకు వెళ్లాలి. సమస్యల పరిష్కారం కోసం గొంతు ఎత్తాలి తప్ప, గతాన్ని గుర్తు చేస్తూ కాలం గడపకూడదు.బీఆర్ఎస్ అగ్ర నాయకత్వం అనుసరిస్తున్న వ్యూహాలు ఇప్పుడున్న రాజకీయ పరిస్థితులకు ఏమాత్రం సరిపోవడం లేదు. సెంటిమెంట్ అనేది ఒక పరిమితి వరకే పనిచేస్తుంది. ఆ గీత దాటిన తర్వాత ప్రజలు వాస్తవాలను చూస్తారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంలో వెనుకబడి, కేవలం భావోద్వేగాలను నమ్ముకోవడం వల్ల పార్టీ కేడర్ కూడా గందరగోళానికి గురవుతోంది. రాజకీయ పార్టీగా తన బాధ్యతలను విస్మరించి, ఇంకా ఉద్యమ పార్టీగానే ఉండిపోవాలనుకోవడం ఆత్మహత్యాసదృశ్యమే అవుతుందన్న భావన ఎక్కువగా వినిపిస్తోంది.

# విస్తరణ తలనొప్పికి దూరమే..

హైదరాబాద్, ఫిబ్రవరి 26,

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనదైన శైలిలో పాలన సాగిస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాల తర్వాత పార్టీ అధిష్టానం వద్ద ఆయన పరపతి గతంతో పోలిస్తే గణనీయంగా పెరిగింది. వరుస విజయాలు తెలంగాణ కాంగ్రెస్‌లో రేవంత్ రెడ్డి మాటకు తిరుగులేని పరిస్థితి కనిపిస్తోంది.మంత్రివర్గంలో ఖాళీగా ఉన్న స్థానాలతో పాటు పని చేయని వారిని తీసేసి కొత్త వారితో భర్తీ చేయాలన్న చర్చ కొంత కాలంగా జరుగుతోంది. అయితే ఇప్పుడున్న మంత్రులను కదిలించడం , కొత్తవారిని తీసుకోవడం వల్ల పార్టీలో అంతర్గత విభేదాలు తలెత్తే ప్రమాదం ఉందని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న టీమ్ తోనే సమన్వయం చేసుకుంటూ వెళ్లడం మేలని ఆయన ఆలోచనగా తెలుస్తోంది. అనవసరంగా కేబినెట్ ప్రక్షాళన చేసి అసంతృప్తికి తావివ్వడం కంటే పాలనపై దృష్టి పెట్టడమే ఉత్తమమని ముఖ్యమంత్రి భావిస్తున్నట్లు సమాచారం. కానీ ఆయనపై ఒత్తిడి పెరుగుతోంది. ఆశావహులు పలువురు తమ ప్రయత్నాలను ఢిల్లీ స్థాయి నుంచి చేసుకుంటున్నారు. మంత్రివర్గ విస్తరణ చేపడితే సామాజిక వర్గాల వారీగా సమతుల్యత పాటించడం రేవంత్ రెడ్డికి పెద్ద సవాలుగా మారనుంది. రెడ్డి సామాజిక వర్గంతో పాటు బీసీ, ఎస్సీ , మైనారిటీ వర్గాలకు సరైన ప్రాతినిధ్యం కల్పించాల్సి ఉంటుంది. ఇప్పటికే ఆశావహుల జాబితా చాంతడంత ఉండటంతో ఎవరిని తీసుకున్నా మిగిలిన వారిలో అసహనం కలిగే అవకాశం ఉంది. ఈ కారణాల వల్ల రేవంత్ రెడ్డి ప్రస్తుతానికి ఎలాంటి రిస్క్ తీసుకోవడానికి ఇష్టపడటం లేదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ పై హైకమాండ్ నుండి రేవంత్ రెడ్డికి పూర్తి స్వేచ్ఛ లభించినట్లు సమాచారం. ఎవరిని మంత్రిగా తీసుకోవాలి, ఎవరిని తొలగించాలి అనే నిర్ణయాధికారం ఆయనకే వదిలేసినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ రేవంత్ రెడ్డి తక్షణమే ఈ ప్రక్రియను చేపట్టేందుకు ఆసక్తి చూపడం లేదని ..కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి లాంటి వాళ్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.బడ్జెట్ సమావేశాలు, గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలు వంటి కీలక రాజకీయ పరిణామాల తర్వాతే దీనిపై ఒక నిర్ణయం ఉండవచ్చని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అప్పటి వరకు ప్రస్తుత మంత్రుల పనితీరును గమనించి ఆ తర్వాతే మార్పులు చేసే అవకాశం ఉంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో రేవంత్ రెడ్డి తన పట్టును మరింత పెంచుకోవడం పైనే దృష్టి సారించారు. ఆశావహుల్ని ఎలా ఎదురు చూస్తూ ఉండేలా చేయనున్నారు.

# మొదటి ఘాట్ రోడ్డులో ప్రమాదం ఒకరు మృతి

తిరుమలతిరుమల మొదటి ఘాట్ రోడ్డులో రోడ్డు ప్రమాదం జరిగింది. ఒక ద్విచక్రవాహనం అదుపు తప్పి పిట్టగోడను ఢీకొంది. ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. గాయాపడిన వ్యక్తిని స్విమ్స్ ఆస్పత్రికి తరలించారు. 30వ మలుపులో తమిళనాడుకు చెందిన ఇద్దరు వ్యక్తులు బైక్ వెళుతుండగా ప్రమాదం జరిగింది. మురళి స్విమ్స్ అత్యవసర వార్డులో గాయపడి చికిత్స పొందుతున్నాడు. నటరాజన్ మృతి చెందాడు.

# ముగ్గురు మంత్రులున్నా... మెడికల్ మాఫియా..

ఖమ్మం, ఫిబ్రవరి 26

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గ్రానైట్ ఫ్యాక్టరీలు, హోటళ్లు, సినిమాలు, ప్రైవేటు కంపెనీలు, దుకాణాలు, ఇతర ఫ్యాక్టరీలు, ఇలా ఎన్నో ఉన్నాయి. ఇందులో ఎంతలేదన్నా.. కనీసం 2.5 లక్షల మంది వరకు చిరు ఉద్యోగులు, కార్మికులు పనిచేస్తూంటారు. వీరందరూ ఎంప్లాయిస్ స్టేట్ ఇన్స్యూరెన్స్ (ఈఎస్ఐ) కిందకే వస్తారు. ఉద్యోగులు, కార్మికుల కుటుం బసభ్యులతో కలిపితే సుమారు 10 లక్షల మందికి వైద్య సేవలు అందించాల్సిన ఈఎస్ఐ ఎందుకనో ఈ జిల్లాలో సరైన సేవలు అందించలేకపోతుంది. కేవలం ఒక్కటంటే ఒక్కటే డిస్పెన్సరీ (భద్రాచలం దగ్గర సారపాక)తో జిల్లా మొత్తానికి సేవలు అందుతున్నాయా అంటే పెదవి విరుపే సమాధానంగా కనపడుతోంది. పేరు గొప్ప.. ఊరు దిబ్బలా తయారయ్యింది ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిస్థితి. డిప్యూటీ సీఎంతోపాటు మొత్తం ముగ్గురు ముఖ్యమైన మంత్రులు ఉన్నప్పటికీ.. ఈఎస్ఐ సేవలు అందించడంలో మాత్రం అన్ని జిల్లాల కంటే వెనుకబడే ఉంటోంది. సుమారు 10 లక్షల మంది చిరుద్యోగు లకు, కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు సేవలు అం దించాల్సిన ఈఎస్ఐ డిస్పెన్సరీల ఏర్పాటు విషయంలో ముగ్గురు మంత్రులు ఏ మాత్రం దృష్టి సారించనట్టుగా కనపడటం లేదు. ఇందుకు ప్రధాన కారణం.. ఇక్కడ ఉన్న కార్మిక, చిరుద్యోగులు భారీగా ఉండటాన్ని పరిగణలోకి తీసుకున్న కేంద్ర ప్రభుత్వం (కార్మిక శాఖ) అదనంగా ఈఎస్ఐ డిస్పెన్సరీలను మంజూరు చేసినా.. వాటిని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేయడం లేదు. దీనితో చాలాకాలం వేచిచూసీ.. మంజూరు చేసిన డిస్పెన్సరీలను సైతం కేంద్రం రద్దు చేసింది. దీంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రస్తుతం ఉన్న ముగ్గురు మంత్రులపై కార్మికులు, చిరుద్యోగులు భగ్గుమంటున్నారు.

ఖమ్మం జిల్లాలో ఉన్న కార్మిక లోకాన్ని, చిరుద్యోగులను దృష్టిలో పెట్టుకుని కేంద్రం సుమారు దశాబ్దం క్రితం (2018కి ముందు) మూడు ఈఎస్ఐ డిస్పెన్సరీలను మంజూరు చేసింది. అయితే అప్పటి ప్రభుత్వాలు దీనిపై దృష్టి పెట్టకపోవడంతో ఆ మూడింటినీ కేంద్రం రద్దు చేసింది. 2018లో రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 15 డిస్పెన్సరీల ఏర్పాటులో భాగంగా.. ముదిగొండలోనూ ఈఎస్ఐ డిస్పెన్సరీని కేంద్రం మంజూరు చేసింది. అయితే షరా మామూలుగా.. ఈ 15 డిస్పెన్సరీల ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. స్థల సేకరణ, భవన నిర్మాణం, సిబ్బందిని నియామకం లాంటివి చేయకపోవడంతో.. ఈ డిస్పెన్సరీల ఏర్పాటు అటకెక్కింది. దీనిపై అనేకసార్లు రాష్ట్ర ప్రభుత్వానికి తాఖీదులు పంపించిన కేంద్రం.. ఈ ఏడాది జనవరిలో సీరియస్‌గా వార్నింగ్ ఇచ్చింది. 15 రోజుల్లో డిస్పెన్సరీల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలంటూ అల్టిమేటం ఇచ్చింది. అయినా.. రాష్ట్ర ప్రభుత్వ వైఖరిలో మార్పు రాలేదు. దీనితో 2018లో మంజూరుచేసిన 15 డిస్పెన్సరీలను రద్దుచేస్తూ కేంద్రం ఆదేశాలు జారీచేసింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 15 డిస్పెన్సరీలను రద్దయ్యాయి. వాటిటో.. ఖమ్మం జిల్లాలోని ముదిగొండలోని డిస్పెన్సరీకూడా ఉండటంతో ఖమ్మంలోని కార్మికవర్గాలు మండిపడుతున్నాయి. హైదరాబాద్ నగరం తరువాత అత్యధిక మంది కార్మికులు, చిరుద్యోగులు ఉన్న పట్టణాల్లో ఖమ్మం కూడా ఉంది. ఈ నేపథ్యంలో గతంలోనే మూడు మంజూరైనా అప్పటి ప్రభుత్వాలు ఏర్పాటు చేయకపోవడం.. తాజాగా ముదిగొండలోనూ ఈఎస్ఐ డిస్పెన్సరీ ఏర్పాటుపై జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులకే ఆసక్తి లేకపోవడాన్ని ఇక్కడ కార్మిక వర్గాలు ఎత్తిచూపుతున్నాయి. స్థల సేకరణ, భవన నిర్మాణం, ఉద్యోగులను కేటయిస్తే.. వేలాదిమంది కార్మికులు.. వారి కుటుంబ సభ్యులతో కలుపుకుంటే.. లక్షలాది మందికి విస్తృతమైన సేవలు అందించే సదుపాయాన్ని మంత్రులు పట్టించుకోకపోవడంపై సర్వత్రా అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఎప్పుడో సారపాకలో ఏర్పాటుచేసిన ఒక డిస్పెన్సరీ ఉంది. అలాగే గతంలో కేంద్రం తీసుకున్న నిర్ణయం మేరకు బ్రాంచ్ ఆఫీసుగా పిలుచుకునే లోకల్ ఆఫీసు (ఖమ్మంలోని రాపర్తినగర్) మాత్రమే ఈఎస్ఐ పరిధిలో ఉన్నాయి. ఇందులోనూ డిస్పెన్సరీలో మాత్రమే వైద్యులు, సిబ్బంది, మందులు ఉంటాయి. ఇక లోకల్ ఆఫీసు (బ్రాంచ్ ఆఫీసు)లో ఎలాంటి వైద్య సేవలు అందవు.. మందులు అందుబాటులో ఉండవు. కొండొకచో.. వైద్యుడు వచ్చి చూసి వెళుతుంటారు. అంతకుమించి అక్కడ అందే వైద్య సేవలు ప్రత్యేకంగా ఏమీ ఉండవు. ఈ నేపథ్యంలోనే ఖమ్మం లాంటి చోట భారీగా ఉన్న కార్మికులు, చిరుద్యోగులను దృష్టిలో పెట్టుకుని కేంద్రం డిస్పెన్సరీలను మంజూరు చేసినా, రాష్ట్ర ప్రభుత్వం వైఖరితో అవికూడా రద్దు కావడంతో.. జిల్లా నాయకత్వంపై సర్వత్రా తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. డిస్పెన్సరీ ఏర్పాటు అనేది చిన్న అంశంగా బయటకు కనపడుతుందని, ఒకవేళ డిస్పెన్సరీని ఏర్పాటుచేస్తే.. ఖమ్మం జిల్లాలోని వేలాది మంది కార్మికులు, చిరుద్యోగులు, వారి కుటుంబాలతో కలిపి సుమారు 10 లక్షల మంది వరకు ప్రైవేటు ఆసుపత్రులకు దూరం అవుతారు. ఈఎస్ఐ డిస్పెన్సరీల్లో ఒక్క పైసా లేకుండా చికిత్సలు అందిస్తారు. ఒకవేళ వ్యాధి తీవ్రతను బట్టి.. హైదరాబాద్‌లోని ఈఎస్ఐ వైద్య కళాశాలకు, ఆసుపత్రికి రిఫర్ చేస్తారు. దీనివల్ల ప్రైవేటు ఆసుపత్రులకు వచ్చే రోగులు తగ్గిపోయి.. రూ. కోట్లు నష్టపోతామనే ఉద్దేశంతోనే మెడికల్ మాఫియా చాపకింద నీరులా ప్రభుత్వ పెద్దలను ప్రభావితం చేసి డిస్పెన్సరీని ఏర్పాటు చేయకుండా అడ్డుకుందని గట్టిగా అనుమానిస్తున్నారు. అయితే కార్మికులు, చిరుద్యోగుల దృష్టిలో.. ప్రస్తుతం ఏచిన్న వైద్య సేవలు అందాలన్నా.. ప్రైవేటు ఆసుపత్రులనే ఆశ్రయించాల్సి వస్తోంది. దీనికి రూ. వేలల్లో ఖర్చువుతోంది. అదే ఈఎస్ఐ డిస్పెన్సరీలను ఏర్పాటుచేస్తే.. పూర్తి ఉచితంగానే వైద్యసేవలు, మందులు, డ్రగ్స్ అందుతాయని వారంటున్నారు. ఈఎస్ఐ డిస్పెన్సరీల ద్వారా ఉచితంగా వచ్చే వైద్యసేవలు అందకుండా అడ్డుకున్న మెడికల్ మాఫియాపై, అచేతనంగా ఉన్న ముగ్గురు మంత్రులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. కార్మికులు, చిరుద్యోగులు భారీ సంఖ్యలో ఉండటంతో.. ఖమ్మం పట్టణంలో ప్రతి గ ల్లీకి ఒక ప్రైవేటు ఆసుపత్రి కనిపిస్తుంది. అలాగే జిల్లా వ్యాప్తంగాకూడా భారీగా ప్రైవేటు ఆసుపత్రులు ఎప్పుడూ రోగులతో కిటకిటలాడుతూ కనపడుతుంటాయి. వాస్తవానికి ఇక్కడికి వచ్చేవారిలో 50 శాతం కంటే ఎక్కువ మంది రోగులు కార్మికులు, చిరుద్యోగులు, చిరువ్యాపారులు, వారి కుటుంబ సభ్యులే ఉంటారు. అంటే వీరందరూ ఈఎస్ఐ పరిధిలోకి వస్తారన్నమాట. తాజాగా ముదిగొండలో మంజూరుచేసిన డిస్పెన్సరీని కూడా రద్దు చేయడంతో.. ఈ ప్రభావం కార్మికులపైనే ఎక్కువగా పడుతుందని వారంటున్నారు. అయితే మంజూరైన డిస్పెన్సరీలను రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు ఏర్పాటు చేయలేకపోతుందనే అనుమానాలు వీరిని తొలుస్తున్నాయి. పరిస్థితి చూస్తే.. ఈఎస్ఐ డిస్పెన్సరీ ఏర్పాటు అయితే.. ప్రైవేటు ఆసుపత్రులకు వచ్చే రోగుల సంఖ్య గణనీయంగా తగ్గి.. ప్రైవేటు ఆసుపత్రుల వ్యాపారం దెబ్బతింటుందని, ఈ నేపథ్యంలోనే మెడికల్ మాఫియా ప్రభుత్వ పెద్దలపై ఒత్తిడి తెచ్చి.. డిస్పెన్సరీల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం విముఖత చూపించి ఉంటుందని కార్మిక వర్గాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నాయి. అందుకే ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ.. మంజూరైన డిస్పెన్సరీ ఏర్పాటుపై దృష్టి పెట్టలేదంటూ వాపోతున్నారు.

# భారీ విస్తరణ దిశగా ఓయో

హైదరాబాద్, ఫిబ్రవరి 26,

ఓయో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో తన వ్యాపార విస్తరణను మరింత వేగవంతం చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా మొత్తం 300 కంపెనీ సర్వీస్డ్ హోటళ్లను ఏర్పాటు చేయాలని ప్రణాళిక రూపొందించింది. ముఖ్యంగా హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మం నగరాలను ప్రధాన లక్ష్యంగా ఎంపిక చేసింది. హైదరాబాద్‌లో నిర్వహించిన హోటల్ భాగస్వాముల సదస్సులో ఈ కీలక ప్రకటన వెలువడింది. వేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణ కేంద్రాలు, టియర్-2 నగరాల్లో తమ బలమైన ఉనికిని ఏర్పరచుకోవడమే ఈ కార్యక్రమం లక్ష్యంగా సంస్థ వెల్లడించింది. హైదరాబాద్‌లో అభివృద్ధి చెందుతున్న మెడికల్, బిజినెస్ టూరిజం రంగాల వల్ల ప్రయాణికుల సంఖ్య పెరుగుతోంది. అదే సమయంలో ఆధ్యాత్మిక పర్యాటక ప్రాంతాలైన యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం, భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయం ప్రాంతాలకు వచ్చే భక్తుల సంఖ్య కూడా గణనీయంగా పెరుగుతోంది. ఈ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని సంస్థ తన విస్తరణ వ్యూహాన్ని రూపొందించింది. ఇక ఏపీలో వైజాగ్ సహా విజయవాడ, తిరుపతి వంటి నగరాల్లో ప్రీమియం హోటల్స్ సంఖ్యను పెంచేందుకు వ్యూహాలు రచిస్తున్నట్లు సమాచారం. సరఫరా పెంపు, హోటళ్ల నాణ్యత ప్రమాణాల మెరుగుదల, అతిథులకు మెరుగైన సేవల అందుబాటు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టిన అభివృద్ధి ప్రణాళికను సంస్థ ప్రకటించింది. మౌలిక సదుపాయాల అభివృద్ధి, పెరుగుతున్న ఆర్థిక కార్యకలాపాలు, మెరుగైన విమాన సౌకర్యాలు వంటి కారణాల వల్ల తెలంగాణ దేశంలో అత్యంత వేగంగా ఎదుగుతున్న హాస్పిటాలిటీ మార్కెట్‌గా మారుతోంది. ఈ సందర్భంగా రాజూ మాతృసంస్థగా పేర్కొన్న సంస్థ) రీజినల్ హెడ్ (సౌత్ సెంట్రల్, ఈస్ట్) అయిన ఆశిష్ సౌరభ్ మాట్లాడుతూ, తెలంగాణ హాస్పిటాలిటీ రంగం నిర్మాణాత్మకంగా బలంగా ఉందన్నారు. హైదరాబాద్ వంటి వ్యాపార కేంద్రాలు స్థిరమైన కార్పొరేట్ డిమాండ్‌ను అందిస్తుండగా, మెరుగైన కనెక్టివిటీ కొత్త లీజర్ టూరిజం అవకాశాలను తెరుస్తోందని తెలిపారు. అతిథులకు మరింత విశ్వసనీయమైన సేవలను అందించే బలమైన నెట్‌వర్క్‌ను నిర్మిస్తున్నామని చెప్పారు. ఈ సమగ్ర వ్యూహం భాగస్వాములకు దీర్ఘకాలిక లాభాలను అందించడమే కాకుండా, ప్రయాణికులకు స్థిరమైన నాణ్యతతో కూడిన సేవలను అందించడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. దేశీయ పర్యాటకం వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో తెలంగాణలో హోటల్ రంగం మరింత అభివృద్ధి చెందుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు

# బాలీవుడ్ వర్సెస్ టాలీవుడ్

హైదరాబాద్, ఫిబ్రవరి 26

సినిమా ఇండస్ట్రీలో సక్సెస్ లను సాధించిన హీరోకి క్రేజ్ భారీ రేంజ్ లో మార్కెట్ ఉంటుంది. వాళ్ల నుంచి వచ్చిన సినిమాలను ప్రేక్షకులు అలరించడమే కాకుండా వాళ్ళు కనిపిస్తే చాలు వాళ్ళతో ఫోటోలు దిగడానికి కూడా ఎగబడిపోతుంటారు. ఇక ఇలాంటి క్రమంలోనే మన హీరోలు గత 10 సంవత్సరాల క్రితం వరకు తెలుగు సినిమాలకే పరిమితమయ్యారు. కానీ ఎప్పుడైతే బాహుబలి సినిమా వచ్చిందో అప్పటినుంచి పాన్ ఇండియా స్థాయిలో మన హీరోలు సినిమాలను చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు? ఇక ఇప్పటివరకు మన హీరోలు టాప్ లో ఉండాలనే ఆలోచిస్తున్నారు. కానీ బాలీవుడ్ హీరో అయిన రణ్వీర్ సింగ్ దూరంధర్ సినిమాతో సైతం 1000 కోట్ల మార్కెట్ ను దాటేశాడు. కాబట్టి బాలీవుడ్ హీరోలు మరోసారి ఊపందుకునే ప్రయత్నంలో ఉన్నారు. అలాంటి సందర్భంలో వారిని తక్కువ అంచనా వేసి చూడకూడదు. మన ప్రయత్నంలో మనం ఉండాలి అలాగే వాళ్ళ కంటే బెటర్ సినిమాలను చేసి సూపర్ హిట్లను సాధించడానికి తీవ్రమైన కృషి చేయాలి. ఏ మాత్రం నిర్లక్ష్యం వహించిన కూడా మళ్ళీ మన హీరోలు బీట్ చేసి వాళ్ళ ముందుకు దూసుకెళ్లే ప్రమాదం కూడా ఉంది? కాబట్టి ప్రతి విషయంలో మన వాళ్ళు చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తే మంచిదని మరి కొంతమంది సినిమా మేధావులు సైతం మన హీరోలను, దర్శకులను హెచ్చరిస్తున్నారు. ఇక ఇలాంటి క్రమంలోనే వీళ్ళు ఎలాంటి సక్సెస్ ను సాధిస్తారు. తద్వారా వీళ్ళకంటూ ఒక ఐడెంటిటి క్రియేట్ అవుతుందా? లేదా అనేది తెలియాలంటే మాత్రం మరికొద్ది రోజులు వెయిట్ చేయాల్సిందే? ఖాన్ త్రయం పని అయిపోయినప్పటికి నెక్ట్స్ జనరేషన్ బాలీవుడ్ హీరోలందరు కూడా మంచి కాన్సెప్ట్ లను ఎంచుకొని సినిమాలు చేస్తున్నారు. కాబట్టి మన హీరోలు సైతం చాలా చాకచక్యంగా వ్యవహరిస్తూ కాన్సెప్ట్ బేస్డ్ సినిమాలను చేస్తూ తెలుగు ఇండస్ట్రీ స్థాయిని పెంచాల్సిన పరిస్థితి అయితే ఏర్పడింది? ఇక ఏది ఏమైనా కూడా ఇండియాలో ఇప్పుడున్న స్టార్ డైరెక్టర్లందరు మన హీరోల వైపే మొగ్గుచూపుతున్నారు. మన వాళ్ళతో సినిమాలను చేస్తే వాళ్లకు కూడా గొప్ప పేరు వస్తుందని ఆలోచిస్తున్నారు

==============

# పూర్తికాని వెలుగొండను.. జాతికి అంకితమంటూ జగన్ మోసగించారు

## గుండ్లకమ్మ గేట్లు విరగ్గొట్టి ఇసుక దోపిడీ చేశారు
## ఐదేళ్లలో అన్ని వ్యవస్థల్నీ జగన్ రెడ్డి భ్రష్టు పట్టించాడు
## కూటమి ప్రభుత్వంలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నాం
## -ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

మార్కాపురం: పూర్తికాని వెలుగొండ ప్రాజెక్టును జాతికి అంకితం చేశామంటూ మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రకాశం జిల్లా ప్రజలను మోసగించారని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ఆరోపించారు. పనులు పూర్తిచేయకుండా కేవలం ప్రచారానికే పరిమితం అయ్యారని దుయ్యబట్టారు. రైతుల ఆశలను వమ్ము చేస్తూ ప్రాజెక్టును రాజకీయ లాభాల కోసం ఉపయోగించుకున్నారని విమర్శించారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్లు ధ్వంసం చేసి, భారీ ఎత్తున ఇసుక దోపిడీ చేశారని అన్నారు. ప్రజా సంపదను కాపాడాల్సిన ప్రభుత్వం దానినే దోచుకుందన్నది దురదృష్టకరమన్నారు. ఇలా జగన్ రెడ్డి అధికారంలో ఉన్న ఐదేళ్లలో అన్ని వ్యవస్థలను జగన్ రెడ్డి భ్రష్టు పట్టించారని పేర్కొన్నారు. మార్కాపురం జిల్లాలో బుధవారం నాడు సీఎం చంద్రబాబు పర్యటన సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రజా వేదిక బహిరంగ సభలో మంత్రి గొట్టిపాటి రవి కుమార్ మాట్లాడుతూ... కూటమి ఏర్పడిన వెంటనే గుండ్లకమ్మకు కొత్త గేట్లను ఏర్పాటు చేయడంతో పాటు మత్స్యకారుల సంక్షేమం కోసం 20 లక్షల చేప పిల్లలను గుండ్లకమ్మలో వదిలిన విషయాన్ని మంత్రి సభా ముఖంగా గుర్తు చేశారు. వెలిగొండ ప్రాజెక్టును యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేందుకు బడ్జెట్ లో నిధులు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాతే రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టుల నిర్మాణాన్ని కూడా వేగవంతం చేసినట్లు స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని వెల్లడించారు. గడిచిన 19 నెలల కాలంలోనే ముఖ్యమంత్రి సహాయ నిధి కింద పేదలకు వెయ్యి కోట్లు రూపాయిలు సహాయం చేశామని తెలిపారు. జగన్మోహన్ రెడ్డికి పేదల పెన్షన్ వెయ్యి రూపాయిలు పెంచడానికే ఐదేళ్లు పట్టిందని ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వంలో అన్ని హామీలను అమలు చేస్తున్నామని ఆయన తెలిపారు. కేవలం ఒక్క సంతకంతోనే ముఖ్యమంత్రి చంద్రబాబు పేదల పెన్షన్ ను వెయ్యి రూపాయిలు పెంచారని చెప్పారు. ఆర్థిక అసమానతలు తొలగించడానికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పీ4 కార్యక్రమాన్ని రూపొందించారని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు.

## ఎమ్మెల్సీ సోము వీర్రాజు పై దాడికి వైకాపా ఎమ్మెల్సీల యత్నం

అమరావతిబీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజుపై దాడి చేయడానికి వైసీపీ ఎమ్మెల్యేలు ప్రయత్నించడం గురువారం శాసనమండలిలో హాట్ టాపిక్ గా మారింది. రేవంత్ రెడ్డి తెలంగాణ అసెంబ్లీలో రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ను ఆపించామని ప్రకటించారని.. దానిపై ప్రభుత్వం ప్రకటన చేయాలని వైసీపీ ఎమ్మెల్సీలు ఆందోళన చేశారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుపై వచ్చిన ప్రశ్నలో భాగంగా ఈ చర్చ వచ్చింది. సభ్యులు మాట్లాడిన తర్వాత మంత్రి సమాధానం ఇచ్చారు . సమాధానం అయిపోయిన తర్వాత తదుపరి ప్రశ్నకు మండలి ఛైర్మన్ వెళ్లారు. అయితే రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై సమాధానం చెప్పాలని వైసీపీ సభ్యులు పట్టుబట్టారు. ప్రశ్న కు సమాధానం పూర్తయినందున ఇక దానిపై చర్చ ఉండదని చెప్పిన మండలి ఛైర్మన్ తదుపరి ప్రశ్న అడిగేందుకు..సోము వీర్రాజుకు అవకాశం కల్పించారు.

# పేదలకు విద్య అందాలంటే ఊరి బడి ఉండాల్సిందే !

## -ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణే యుటిఎఫ్ లక్ష్యం

## .-యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్.ప్రసాద్

బద్వేలు పేదలకు నాణ్యమైన ప్రభుత్వ విద్య అందాలంటే ఊరి బడి ఉండాల్సిందేనని యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్.ప్రసాద్ పేర్కొన్నారు. కడప నగరంలోని యుటిఎఫ్ కార్యాలయంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షురాలు డి.సుజాత రాణి అధ్యక్షతన జరిగిన "ప్రభుత్వ బడిలోనే విద్యార్థులను చేర్పిద్దాం-ఊరి బడిని కాపాడుకుందాం"అనే అంశంపై జరిగిన సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా కె.ఎస్.ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల సర్వతోన్ముఖాభివృద్ధికి పాటుపడుతూ, విద్యార్థులను అత్యుత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన ప్రభుత్వ పాఠశాలలు నేడు పాలకుల విధానాల ఫలితంగా ప్రమాదపుటంచుల్లోకి నెట్టి వేయబడ్డాయని ఆరోపించారు. ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణే లక్ష్యంగా హామీలిస్తున్న పాలకవర్గాలు తీరా గద్దినెక్కాక హామీలను విస్మరిస్తూ ప్రభుత్వ విద్యారంగ నిర్వహణ బాధ్యతల నుండి క్రమేపి తప్పుకునేందుకు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. గతంలో వైసిపి ప్రభుత్వం 117 జీవోను ప్రవేశపెట్టి, పాఠశాలల విలీనం పేరుతో ప్రభుత్వ విద్యారంగాన్ని అస్తవ్యస్తంగా తయారు చేసిందన్నారు. అప్పటి ప్రతిపక్ష హోదాలో వైసీపీ ప్రభుత్వ విధానాన్ని తీవ్రంగా తప్పు పట్టిన ప్రస్తుత కూటమి ప్రభుత్వం, తాము అధికారంలోకి రాగానే జీవో 117 ను రద్దుచేసి ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షిస్తామని హామీ ఇచ్చారన్నారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత జీవో 117 స్థానంలో జీవో 20 ని అమలు చేశారే తప్ప విధానాల్లో మాత్రం మార్పు లేదన్నారు. పాలకవర్గాలు విద్యారంగ నిర్వహణ బాధ్యతల నుండి తప్పుకునేందుకు ఉద్దేశపూర్వకంగా ఉపాధ్యాయులను బోధనకు దూరం చేస్తూ నిరంతరం బోధనేతర కార్యక్రమాలలో భాగస్వాములను చేస్తున్నారన్నారు. వివిధ యాప్ల పేరుతో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందకుండా చేయడంలో పాలకవర్గాలు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు.

ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంక్ లాంటి సంస్థల ఆదేశాల మేరకే ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేసేందుకు పాలకులు కుట్ర పన్నుతున్నారని విమర్శించారు. ఒకవైపు ప్రభుత్వ పాఠశాలలో పేద విద్యార్థులకు విద్య అందకుండా చేస్తూ మరోవైపు ప్రభుత్వ బడుల్లోని విద్యార్థులు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లోకి తరలి వెళ్లేందుకు మార్గం సుగమం చేస్తున్నారన్నారు. సాల్ట్ పథకం అమలులో భాగంగా ప్రపంచ బ్యాంకు నుండి 1750 కోట్లు అప్పు తీసుకున్న ప్రభుత్వం వారితో చేసుకున్న ఒప్పందం మేరకు ప్రభుత్వ పాఠశాలలను, ఉపాధ్యాయులను కుదించేందుకు ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. అందులో భాగంగానే సాక్షాత్తు విద్యాశాఖ కమిషనర్ రాష్ట్రంలోని ఉన్న 43 వేల పాఠశాలల నుండి 11 వేల పాఠశాలను కుదిస్తామని ప్రకటించారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1,70,000 ఉపాధ్యాయ పోస్టులను 1,10,000 పోస్టులకు కుదించేందుకు ఆలోచన చేస్తున్నారన్నారు. సంస్కరణల పేరుతో ప్రభుత్వ విద్యను నిర్వీర్య పరుస్తూ పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు విద్య అందకుండా చేసేందుకు పాలకులు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. గతంలో వైసిపి ప్రభుత్వం నాడు-నేడు పేరుతో ప్రభుత్వ పాఠశాలలను ముస్తాబు చేసిందని, కానీ బోధనేతర కార్యక్రమాల పేరుతో ఉపాధ్యాయులను బోధనకు దూరం తెలిపారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం సైతం గత ప్రభుత్వ విధానాలనే అమలు చేస్తూ, మరోపక్క ప్రభుత్వ విద్యా రంగంపై కపట ప్రేమను ప్రదర్శిస్తున్నదని ఆరోపించారు. రాష్ట్రంలో 17వేల ఏకోపాధ్యాయ పాఠశాలలు కొనసాగుతున్నాయని, 2020 నాటికి ప్రభుత్వ పాఠశాలలో 46 లక్షల మంది విద్యార్థులు కొనసాగుతుండగా 2025 నాటికి 31.50 లక్షల మందికి మంది మాత్రమే ఉన్నారని, ప్రస్తుతానికి ఆ సంఖ్య 29.30 లక్షల మందికి పడిపోయిందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన జరగకుండా కుట్రలు చేస్తూ, మరోపక్క ప్రభుత్వ పాఠశాలలో సంఖ్య తగ్గిపోవటానికి ఉపాధ్యాయులే కారకులని చిత్రీకరించేందుకు పాలకుల ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మి రాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు లు మాట్లాడుతూ పాలకుల విధానాల ఫలితంగా సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకోకపోతే, పేదలకు ప్రభుత్వ విద్య దూరమయ్యే ప్రమాదముందని పేర్కొన్నారు.

# సురక్షిత ప్రయాణం.. 'చూపు'తోనే సాధ్యం!



* ఆటోనగర్‌లో డ్రైవర్లకు కంటి పరీక్షలు
* 'అరైవ్ అలైవ్'లో భాగంగా పోలీసుల చొరవ..

వనస్థలిపురం, ఫిబ్రవరి 26: భారత శక్తి : "రహదారి భద్రత అనేది కేవలం నిబంధన కాదు.. అది ప్రతి డ్రైవర్ బాధ్యత. స్పష్టమైన కంటిచూపు ఉంటేనే ప్రమాదాలను నివారించి క్షేమంగా ఇంటికి చేరగలం" అని ఎల్బీనగర్ డీసీపీ అనురాధ పేర్కొన్నారు. రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు వనస్థలిపురం ట్రాఫిక్ పోలీసులు ఆటోనగర్‌లో నిర్వహించిన 'అరైవ్ అలైవ్' (Arrive Alive) కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. శ్రీ నేత్రాలయ ఆసుపత్రి సౌజన్యంతో డ్రైవర్ల కోసం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని అధికారులు ప్రారంభించారు.

**లక్ష్యం ఒక్కటే.. సురక్షిత ప్రయాణం**

ఈ సందర్భంగా ఎల్బీనగర్ ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాసులు, రోడ్ సేఫ్టీ డీసీపీ మనోహర్ మాట్లాడుతూ.. డ్రైవర్లలో పెరుగుతున్న పని ఒత్తిడి, సరిగ్గా నిద్ర లేకపోవడం, దృష్టి లోపాల వల్ల రహదారి ప్రమాదాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రైవర్లు కంటి చూపును నిర్లక్ష్యం చేయకుండా క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని హితవు పలికారు.

**అధికారుల పర్యవేక్షణ :**

కార్యక్రమంలో భాగంగా వందలాది మంది ఆటో, లారీ డ్రైవర్లకు వైద్యులు అత్యాధునిక పరికరాలతో పరీక్షలు నిర్వహించారు. దృష్టిలోపం ఉన్నవారికి ఉచితంగా మందులు పంపిణీ చేయడమే




కాకుండా, తదుపరి చికిత్స కోసం సూచనలు అందజేశారు.

**శిబిరంలో పాల్గొన్న ప్రముఖులు:**

పోలీసు యంత్రాంగం మరియు వైద్య బృందం సమన్వయంతో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు:

* ఏసీపీలు: నవీన్ రెడ్డి (ఎల్బీనగర్ ట్రాఫిక్), కాశి రెడ్డి (వనస్థలిపురం).
* ఇన్‌స్పెక్టర్లు: భూపతి గట్టుమల్లు, శ్రీనివాసరెడ్డి, శ్రీశైలం, వెంకటేశ్వర్లు, మహేష్.

ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన కల్పిస్తూనే, డ్రైవర్ల ఆరోగ్యంపై పోలీసులు చూపుతున్న శ్రద్ధ పట్ల స్థానిక వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు.

# ధైర్య దీప్తి.. విప్లవ గర్జన.. చంద్రశేఖర్ ఆజాద్!



బోయనపల్లి రమణారావు
9390267118

"ఆజాద్‌గా పుట్టాను.. ఆజాద్‌గానే మరణిస్తాను.." అన్న సింహగర్జనతో బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన ధీశాలి, భారత విప్లవ వీరుడు చంద్రశేఖర్ ఆజాద్ గారి వర్ధంతి నేడు. ఆయన కేవలం ఒక వ్యక్తి కాదు.. ఆరు అడుగుల అగ్నిపర్వతం! "ఆజాద్" అంటే స్వతంత్రుడు. పేరుకు తగ్గట్టుగానే పరాయి పాలనలో తలవంచని మహావీరుడు ఆయన. 1906 జూలై 23న జన్మించిన ఈ యువ కిశోరం, కేవలం 15 ఏళ్ల వయసులోనే బ్రిటిష్ కోర్టులో నిలబడి.. "నీ పేరేమిటి?" అని జడ్జి అడిగితే.. "ఆజాద్" (స్వతంత్రుడు) అని, "నీ తండ్రి పేరేమిటి?" అంటే "స్వతంత్ర" అని, "నీ ఇల్లు ఎక్కడ?" అంటే "జైలు" అని బదులిచ్చిన పిడుగు ఆయన. అన్యాయాన్ని చూసి సహించని ఆజాద్, భగత్ సింగ్, సుఖ్‌దేవ్ వంటి వీరులతో కలిసి 'హిందూస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్' ద్వారా సాయుధ పోరాటాన్ని ప్రారంభించారు. కాకోరి రైలు దోపిడీ ద్వారా బ్రిటిష్ ఖజానాకు కన్నం వేసి సవాల్ విసిరారు. లాలా లజపత్ రాయ్ మరణానికి ప్రతీకారంగా సాండర్స్‌ను హతమార్చి భారతీయుల పౌరుషాన్ని చాటారు. 1931 ఫిబ్రవరి 27.. అల్హాబాద్‌లోని ఆల్ఫ్రెడ్ పార్క్ (నేటి ఆజాద్ పార్క్) రణక్షేత్రంగా మారింది. వందలాది మంది బ్రిటిష్ పోలీసులు ఆజాద్‌ను చుట్టుముట్టారు. ఒక్కడే సింహంలా పోరాడారు. తన తుపాకీలో బుల్లెట్లు ఉన్నంతవరకు శత్రువుల గుండెల్లో వణుకు పుట్టించారు. చివరగా ఒక్క బుల్లెట్ మిగిలినప్పుడు.. శత్రువు చేతికి చిక్కకూడదని, తనను తాను కాల్చుకుని భారత మాత ఒడిలో అమరుడయ్యారు. "మనం శత్రువుల తూటాలను ఎదుర్కొంటాం.. మనం స్వేచ్ఛగా ఉన్నాం.. స్వేచ్ఛగానే ఉంటాం!" ఆజాద్ మరణం భారత యువతలో విప్లవ జ్వాలలు నింపింది. ఆయన చిందించిన ప్రతి రక్తపు బొట్టు ఒక నిప్పుకణమై దేశాన్ని రగిల్చింది. నేటి యువత ఆజాద్ చూపిన ధైర్యాన్ని, దేశభక్తిని స్ఫూర్తిగా తీసుకోవాలి. భారతమాత ముద్దుబిడ్డకు ఘన నివాళులు.. ఇన్కిలాబ్ జిందాబాద్.. ఆజాద్ అమర్ హై.. జై హింద్..

# పోలీస్ క్రీడల్లో మల్కాజిగిరి భేష్..!

* రాష్ట్రస్థాయి పోటీల్లో 81 పతకాలతో అదరహో!
* మెడల్ టేబుల్‌లో రెండో స్థానం కైవసం
* విజేతలను అభినందించిన సీపీ



మల్కాజిగిరి, ఫిబ్రవరి 26 భారత శక్తి: తెలంగాణ పోలీస్ క్రీడల్లో మల్కాజిగిరి కమిషనరేట్ సిబ్బంది పతకాల పంట పండించారు. సైబరాబాద్ వేదికగా ఫిబ్రవరి 16 నుంచి 21 వరకు జరిగిన '4వ తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడల' పోటీల్లో తమదైన ముద్ర వేశారు. క్రీడాకారులు అసాధారణ ప్రతిభ కనబరిచి ఏకంగా 81 పతకాలను ఖాతాలో వేసుకున్నారు. దీంతో ఓవరాల్ మెడల్ టేబుల్‌లో మల్కాజిగిరి కమిషనరేట్ రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిచి సత్తా చాటింది.

**వ్యక్తిగత విభాగాల్లో జోరు :**

వివిధ క్రీడాంశాల్లో మల్కాజిగిరి క్రీడాకారులు తిరుగులేని ప్రదర్శన ఇచ్చారు.

* ఏఆర్పీసీ సంజీవ్: వివిధ క్రీడల్లో ఏకంగా 8 పతకాలు సాధించి అందరి దృష్టిని ఆకర్షించారు.
* ఏఆర్పీసీ యమన్: విలువిద్య (ఆర్చరీ)లో గురి తప్పకుండా నాలుగు స్వర్ణ పతకాలు కొల్లగొట్టారు.
* డబ్ల్యూపీసీ నందిని: జిమ్నాస్టిక్స్‌లో మెరుపులు మెరిపించి 5 పతకాలు సాధించారు.

**జట్టు విభాగాల్లోనూ అగ్రగామి:**

మహిళల టగ్ ఆఫ్ వార్ జట్టు బంగారు పతకాన్ని సాధించగా.. పురుషుల ఫుట్‌బాల్, మహిళల కబడ్డీ జట్లు రజత పతకాలు (వెండి), పురుషుల కబడ్డీ జట్టు కాంస్య పతకాన్ని సాధించాయి. మహిళల విభాగంలో ఓవరాల్‌గా 'ఆల్ రౌండర్ రన్నరప్' ట్రోఫీని మల్కాజిగిరి దక్కించుకోవడం విశేషం.

**విజేతలకు పురస్కారాలు:**

అద్భుత ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వారికి ప్రశంసా పత్రాలతో పాటు నగదు బహుమతులను అందజేశారు. సిబ్బందిలో క్రమశిక్షణ, శారీరక దృఢత్వాన్ని పెంపొందించడానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని సీపీ పేర్కొన్నారు. క్రీడాకారుల విజయం కమిషనరేట్‌కు గర్వకారణమని కొనియాడారు.

# నిర్మల్ పోలీసింగ్‌లో నారి శక్తి – డయల్ 100కి సత్వర స్పందన

* సైబర్ నేరాల పై విద్యార్థులకు అవగాహన
* మహిళల భద్రత, ప్రజల రక్షణే నారి శక్తి ప్రధాన లక్ష్యం: జిల్లా ఎస్పీ డా.జి. జానకి షర్మిల,

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 26 (భారత శక్తి) నిర్మల్ జిల్లా ఎస్పీ డా.జి. జానకి షర్మిల, నాయకత్వంలో ప్రతి బుధవారం నిర్వహిస్తున్న "నారి శక్తి" కార్యక్రమం ఈ వారం (నిన్న) కూడా మరింత ప్రభావవంతంగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో భాగంగా మహిళా పోలీస్ సిబ్బంది తమ తమ పోలీస్ స్టేషన్ పరిధిలో పెట్రోలింగ్ నిర్వహిస్తూ, వచ్చిన డయల్ 100 కాల్స్‌కు తక్షణ స్పందన అందించి బాధితుల సమస్యలను వేగంగా పరిష్కరించారు. వీటితో పాటు గ్రామాల్లో ఉన్న పాఠశాలలను సందర్శించి పిల్లలకు సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు, మైనర్ డ్రైవింగ్ వల్ల కలిగే దుష్పరిణామాల గురించి వివరించారు, అంతేకాకుండా గ్రామాల్లో ఉన్న ప్రజలకు మద్యం తాగి వాహనాలు నడపడం, హెల్మెట్ లేకుండా ప్రయాణం చేయడం వల్ల సంభవించే ప్రమాదాల గురించి వివరించారు. అనంతరం నారిశక్తులు వాహన తనిఖీలు చేసి, డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్‌లు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. ఈ "నారి శక్తి" కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పోలీస్ స్టేషన్ల మహిళా సిబ్బంది చాలా ఉత్సాహంగా పాల్గొన్నారు.



# కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ చేసిన మంత్రి సీతక్క

ములుగు జిల్లా ప్రతినిధి , ఫిబ్రవరి 26 (భారత శక్తి) : ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలోని హరిత హోటల్ లో తాడ్వాయి మండల పరిధిలోని 25 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి / షాది ముభారక్ చెక్కులను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్., ఎస్ పి సుధీర్ రామ్ నాథ్ కేకన్, ఐటిడిఏ పి ఓ చిత్ర మిశ్రా, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, ఆర్డీఓ వెంకటేష్, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి చేరాలి

: **జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



భూపాలపల్లి ప్రతినిధి, ఫిబ్రవరి 27 (భారత శక్తి): విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆశ్రమ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని అమలు తీరును సమగ్రంగా పరిశీలించారు. వంటగది పరిశుభ్రత, ఆహార పదార్థాల నిల్వ విధానం, మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అనే అంశాలను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యతను స్వయంగా తనిఖీ చేసి, అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. పోషకాహారం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు. వంట సిబ్బంది పరిశుభ్రతను పాటించడంతో పాటు, ఆహార పదార్థాలు తాజావిగా ఉండేలా చూడాలని, గడువు ముగిసిన పదార్థాలను వినియోగించొద్దని ఆదేశించారు. భోజనం బావుంది ప్రతి రోజు ఇలానే చేయాలని వంట సిబ్బందిని అభినందించారు.. పాఠశాలల్లో ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పోషకాహారం అందించడంతో పాటు, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని తరచుగా పరిశీలించాలని సంబంధిత అధికారులకు సూచించారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేలా సమతుల ఆహారం అందించడం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. విద్యతో పాటు ఆరోగ్యం కూడా ముఖ్యమని, విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని, విద్యార్థులు మంచి అలవాట్లు అలవరచుకుని భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. అనంతరం హాస్టల్ పరిసరాలను పరిశీలించిన కలెక్టర్, భద్రతా పరమైన చర్యలపై దృష్టి సారించాలని, సీసీ కెమెరాల ఏర్పాటు చేయడంతో పాటు, ప్రహరీ గోడ పైభాగంలో ఫెన్సింగ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, పాఠశాల ప్రిన్సిపాల్ జీవరత్నం, పాఠశాల ఉపాధ్యాయులు మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మార్చి 1న గురుకుల 5వ తరగతి, ఇంటర్ ప్రవేశ పరీక్షలు

కడప, ఫిబ్రవరి 26(భారత శక్తి) : జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయాల్లో 202627 విద్యా సంవత్సరానికి సంబంధించి 5వ తరగతి, ప్రథమ ఇంటర్, ఐఐటీ/నీట్ ప్రవేశ పరీక్షలు మార్చి 1న నిర్వహించనున్నామని జిల్లా సమన్వయకర్త ఏ. ఉదయశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి పరీక్ష మార్చి 1వ తేదీ ఆదివారం ఉదయం 9. 30 నుంచి 11 గంటల వరకు, ఇంటర్ ప్రథమ సంవత్సరంకు పరీక్ష మధ్యాహ్నం 12 నుంచి 1.30 వరకు, ఐఐటీ, నీట్ పరీక్ష మధ్యాహ్నం 3 నుంచి 4.30 గంటల వరకు జరుగుతాయన్నారు. ఆయా పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు హాల్ టికెట్లు ఆన్లైన్లో డౌన్ లోడ్ చేసుకోవాలన్నారు. 6, 7, 8, 9, 10వ తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీ కోసం దర ఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మార్చి 8న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. వివరాలకు సమీపంలోని అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ను కలవాలని సూచించారు.

# అత్యుత్తమ భారత నిర్మాణానికి సమగ్ర సమాచారం తప్పనిసరి



* నేషనల్ స్టాటిస్టిక్స్ FOD కడప జాయింట్ డైరెక్టర్ నీతూ థామస్

కడప, ఫిబ్రవరి 26(భారత శక్తి) : కుటుంబ సరాసరి ఆదాయ వనరులను పెంచే ప్రణాళికలు రూపొందించటానికి జాతీయ గృహ ఆదాయ సర్వేలు ఎంతగానో ఉపయోగపడుతాయని, తద్వారా అత్యుత్తమ భారత సమాజ స్థాపన సాధ్యం అవుతుందని నేషనల్ స్టాటిస్టిక్స్ ఆఫీస్ (N.S.O) జాయింట్ డైరెక్టర్ నీతూ థామస్ పేర్కొన్నారు. కడపలోని R.S.R స్క్వేర్ మాల్ లో గణాంక సర్వే నిర్వహణపై నేషనల్ స్టాటిస్టిక్స్ ఆఫీస్ (N.S.O) ఫీల్డ్ ఆపరేషన్ డివిజన్ (FOD) కడప ప్రాంతీయ కార్యాలయం వారి ఆధ్వర్యంలో రోజుల పాటు నిర్వహిస్తున్న ప్రాంతీయ శిక్షణా శిబిరం (RTC) కు జాయింట్ డైరెక్టర్ నీతూ థామస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2026 ఏప్రిల్ 1 నుండి దేశవ్యాప్తంగా ప్రారంభం కానున్న జాతీయ గృహ ఆదాయ సర్వేలో భాగంగా, క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించే అధికారులకు మరియు సిబ్బందికి సర్వేలోని ముసాయిదాలు, నిర్వచనాలు మరియు సాంకేతిక అంశాలపై పూర్తి అవగాహన కల్పించడం కోసం రెండు రోజుల పాటు ప్రాంతీయ శిక్షణా శిబిరం (RTC) ను భారత ప్రభుత్వ గణాంక మరియు కార్యక్రమ అమలు మంత్రిత్వ శాఖకు చెందిన నేషనల్ స్టాటిస్టిక్స్ ఆఫీస్ (N.S.O) ఫీల్డ్ ఆపరేషన్ డివిజన్ (FOD) కడప ప్రాంతీయ కార్యాలయం వారి ఆధ్వర్యంలో నిర్వహించడం ఎంతో ఉపయోగకరం అన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ మరియు అసిస్టెంట్ డైరెక్టర్ ఆయిన శ్రీనివాస రావు మాట్లాడుతూ ముఖ్యంగా కుటుంబం యొక్క సరాసరి ఆదాయ వనరులను పెంచడానికి కావలిసిన ప్రణాళికలు రూపొందించటానికి ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. అర్హులైన వారికి సంక్షేమ పథకాలు నేరుగా పారదర్శకంగా లక్షిత వర్గాలకు చేరడానికి, ఉపాధి అవకాశాలు మరియు నైపుణ్యాభివృద్ధి గుర్తించడం, పెట్టుబడిదారులకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించడానికి ఈ సర్వే గణాంకాలు ప్రాధాన్యత వహిస్తాయన్నారు. ఈ కార్యక్రమాన్ని ఎన్ఎస్ఓ ఫీల్డ్ ఆపరేషన్ డివిజన్ కడప ప్రాంతీయ కార్యాలయ అధిపతి మరియు ఎస్ఎస్ఓ. ప్రశాంతి పర్యవేక్షించి ప్రజలందరూ గణాంక అధికారులకు సహకరించి ఖచ్చితమైన వివరాలను అందించాలన్నారు. ఈ శిక్షణ తరగతులలో ఉమ్మడి జిల్లాల ఉప ప్రాంతీయ కార్యాలయాలు అయిన కడప, అనంతపురం, కర్నూలు, నెల్లూరు మరియు గుంటూరు జిల్లాలకు సంబంధించిన ఎస్. ఎస్.ఓ అధికారులు మరియు క్షేత్రస్థాయి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల పనులను వేగిరం చేయండి

* వచ్చే నెలలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలి.
* రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా 2,160 ఇండ్లను ఒకే చోట నిర్మాణం
* మార్చి మొదటి వారంలో సీఎం చేతుల మిదిగా ప్రారంభోత్సవం
* మంత్రి నలమాధ ఉత్తమ్ కుమార్ రెడ్డి

సూర్యాపేట(భారత శక్తి జిల్లా ప్రతినిధి)ఫిబ్రవరి 26: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయించి, రూ.22,500 కోట్ల బడ్జెట్ తో పనులు వివిధ దశల్లో ఉన్నాయని రాష్ట్ర పౌరసరఫరాల నీటిపారుదల శాఖ మంత్రి నలమాధ ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. గురువారం హుజూర్నగర్ లోని రామస్వామి వద్ద 110 ఎకరాలలో 125 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న 2,160 ఇందిరమ్మ ఇండ్ల ప్లాట్ల పెండింగ్ పనుల పురోగతి పై జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తో కలిసి ప్రతి బ్లాకు కాలినడకన తిరుగుతూ అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, ఎలక్ట్రిసిటీ, మొక్కలు నాటడం, వైట్ వాష్ పనులను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నాడు గృహ నిర్మాణ శాఖ మంత్రిగా ఉన్న సమయంలో హుజూర్నగర్ నియోజకవర్గంలో నిరుపేదలు, వ్యవసాయ కూలీలు, రైస్ మిల్లులో పనిచేసే వారికి ఆశ్రయం కల్పించాలన్న లక్ష్యంతో 110 ఎకరాల దేవాలయ భూములను మార్కెట్ రేటుకి కొనుగోలు చేసి పనులు ప్రారంభించడం జరిగిందని కానీ రాష్ట్ర విభజన తర్వాత ఆనాటి ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను మధ్యలోనే నిలిపివేసి డంపింగ్ యార్డ్ మాదిరిగా మార్చిందని మండిపడ్డారు. తిరిగి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 14 సంవత్సరాల నా పట్టుదల , కృషి ఆకాంక్షలతో తిరిగి పనులను ప్రారంభించి ప్రాజెక్టును పూర్తిచేసి పేద ప్రజలకు అందించడం నా చిరకాల స్వప్నం నెరవేరుతుందన్నారు. దీనిని నా అదృష్టంగా భావిస్తున్నానని, 1 ప్లాట్ కు రూ. 6 లక్షలు ఖర్చు చేయడం జరిగిందని, భూమి ప్లాట్ తో కలిపి 10 పది లక్షల ఖర్చు అవుతుందని



ఒక్క ప్లాట్ విస్తీర్ణం 325 స్క్వేర్ ఫీట్ ఉంటుందని వివరించారు. రూ.75 కోట్లతో అంతర్గత రోడ్లు, ఎలక్ట్రిసిటీ, త్రాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ కొరకు ప్రభుత్వం నుండి మంజూరు చేయించి పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తున్నట్లు,అవసరమైతే రాత్రి, పగలు కూడ ఎక్కువ పనివారిని పెట్టి మార్చి మొదటి వారం కల్లా పెండింగ్ పనులు పూర్తి చేయడం జరుగుతుందని, వెల్లడించారు.మార్చి మొదటి వారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా మొదటి విడతలో హుజూర్నగర్ లోకల్ లో ఇండ్లు లేని వారికి, నిరుపేదలు, తెల్ల రేషన్ కార్డు కలిగిన 1000 మంది లబ్ధిదారులకు పంపిణీ చేయుటకు ఏర్పాట్లు చేస్తున్నామని ప్రకటించారు. రెండవ విడతలో హుజూర్నగర్ నియోజకవర్గంలోని పేదలకు అందించడం జరుగుతుందని ఎంపిక ప్రక్రియలో ఆర్డిఓ, మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవో తాసిల్దార్ లు పారదర్శకంగా నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఆదేశించారు. ఎంపిక విషయంలో ఎలాంటి అవినీతికి, అవకతవకలకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంత్రి తెలిపారు.ఈ విలేకరుల సమావేశంలోఎస్పీ కే నరసింహ,మున్సిపల్ చైర్ పర్సన్ దొంతగాని శ్రీనివాస్,వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జున్,మార్కెట్ కమిటీ చైర్మన్,హౌసింగ్ పీడీ సిద్ధార్థ, ఆర్టికల్చర్ పిడి నాగయ్య, ఇతర జిల్లా అధికారులు,స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# సివిల్స్ ఎస్పీరెంట్స్ కు ట్యాబ్ ల పంపిణీ

కడప, ఫిబ్రవరి 26(భారత శక్తి) : వైఎస్ఆర్ కడప జిల్లాలోని ఎస్సీ యువతకు అంబేడ్కర్ స్టడీ సర్కిల్ ద్వారా నిర్వహించిన పరీక్షలో డిజిటల్ మాడ్యుల్ ద్వారా యుపిఎస్సి ప్రిలిమ్స్ కోచింగ్ ఉత్తీర్ణులైన ఓబులేసు, హర్షసాయి వర్ధన్ అనే ఇద్దరు సివిల్స్ సర్వీస్ ఆస్పిరెంట్స్ కు వారికి జిల్లా షెడ్యూల్ కులముల సేవా సహకార సంస్థ, సాంఘిక సంక్షేమ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో యూపీఎస్సీ కి సంబంధించిన మెటీరియల్ ఇన్ బిల్ట్ తో కూడిన ట్యాబ్ లను బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ డి. శ్రీధర్ చెరుకూరి చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్సి కార్పొరేషన్ ఈడీ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

బాస్కెట్ ప్రారంభానికి

# జిల్లా స్థాయి సమీక్ష సమావేశం

వైఎస్సార్ కడప, ఫిబ్రవరి 26(భారత శక్తి): జిల్లా రైతు సాధికార సంస్థ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కార్యాలయంలో మార్చి 8న ప్రారంభించనున్న ఫుడ్ బాస్కెట్ కార్యక్రమం విజయవంతమైన అమలుకు సంబంధించి జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మూడు మండలాల నుంచి ఫుడ్ బాస్కెట్ కమిటీ సభ్యులు, ప్రకృతి వ్యవసాయం చేపడుతున్న రైతులు, అగ్రిగేటర్లు మరియు ఎంట్రప్రెన్యూర్లు హాజరయ్యారు. సమావేశంలో ఫుడ్ బాస్కెట్ కార్యక్రమం లక్ష్యాలు, ప్రాముఖ్యత మరియు అమలు విధానంపై అధికారులుచేసిన వివరణ పాల్గొన్న వారికి అవగాహన కల్పించింది. జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం అవసరం, రైతులకు మరియు వినియోగదారులకు కలిగే ప్రయోజనాలు, అలాగే రసాయన రహిత ఆహార ఉత్పత్తుల ప్రాధాన్యతపై వివరించారు. అనంతరం జిల్లాలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండిస్తున్న పంటలు, అందుబాటులో ఉన్న వ్యవసాయ ఉత్పత్తులు, వాటి సేకరణ, సరఫరా మరియు మార్కెటింగ్ అవకాశాలపై రైతులు, కమిటీ సభ్యులు, ఎంట్రప్రెన్యూర్లతో చర్చించారు. ఫుడ్ బాస్కెట్ కార్యక్రమం ద్వారా స్థానికంగా ఉత్పత్తి అయ్యే నాణ్యమైన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను వినియోగదారులకు సులభంగా అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో అదనపు జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీమతి వసంత కుమారి, హెల్త్ & న్యూట్రిషన్ విభాగానికి చెందిన అరుణ, మార్కెటింగ్ విభాగం నేచురల్ ఫార్మింగ్ అసోసియేట్ శ్రీనాథ్ మరియు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.




మంత్రి సీతక్క ను ఘనంగా సన్మానించిన

# తెలంగాణ గెజిటెడ్ అసోసియేషన్

ములుగు జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 26 (భారత శక్తి) : దశాబ్దాల తమ చిరకాల కోరికను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చిందని తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నేతలు తెలిపారు ఉద్యోగులు పెన్షనర్లకు 1.20 కోట్ల ప్రమాద బీమా వర్తింపజేయడంతోపాటు ఉద్యోగులకు పెన్షనర్స్ కు ఆరోగ్య పథకాన్ని రాష్ట్ర క్యాబినెట్ ఆమోదించడం తో హర్షం వ్యక్తం చేస్తూ, గురువారం మేడారం లో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నేతలు అధిక సంఖ్యలో పాల్గొని మంత్రి సీతక్కకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగులు పెన్షనర్లకు ప్రభుత్వం ప్రకటించిన ఆరోగ్య భీమా పథకాలు చరిత్రలో నిలిచిపోతాయని కొనియాడారు. 1998 వ్యాధులకు నగదు రహిత చికిత్సను పొందే విధంగా అవకాశం లభించడం నిజంగా వరమని ఇట్టి బిల్లు జారీ చేయడంతో పాటు క్యాబినెట్ సమావేశంలో పలు సానుకూల నిర్ణయాలను తీసుకోవడం తో కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగుల పక్షపాతి అని మరోసారి తెలియజేశారు అని ములుగు జిల్లా అధ్యక్షులు ఎం.సంపత్ రావు అన్నారు. అలాగే మంత్రి సీతక్క గారి చేతుల మీదుగా మహిళా దినోత్సవ గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఏం సంపత్ రావు గారితో పాటు సెక్రెటరీ కందుల జీవన్ కుమార్ రాష్ట్ర జిల్లా నాయకులు ప్రకాష్ రెడ్డి కే కొమరయ్య దీప రెడ్డి ఎం రాజు రఫిక్ రాజేశ్వరరావు డి రాజు ప్రేమలత సునీత రహీం అహ్మద్, యశ్వంత్, దేవేందర్ రావు నాయకులు గెజిటెడ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదాలకు ఆహ్వానం పలుకుతున్న శాంతిపురం అస్రర్ మలుపు

* ఆర్ & బి నిర్లక్ష్యానికి మరో నిదర్శనం

పోరుమామిళ్ల భారతశక్తి ప్రతినిధి ఫిబ్రవరి 26 : కడప-విజయవాడ ప్రధాన రహదారిపై, పోరుమామిళ్ల-కొమరోలు మార్గమధ్యంలో శాంతిపురం అస్రర్ సమీపంలోని మలుపు ప్రస్తుతం మృత్యు మలుపుగా మారుతోంది. రోడ్డుకు ఇరువైపులా విపరీతంగా పెరిగిన కంపచెట్ల కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలు కనబడకపోవడంతో ప్రమాదాల ముప్పు పెరుగుతోంది.ఈ మార్గంలో నిత్యం వాహన రాకపోకలు సాగుతున్నప్పటికీ, రహదారి భద్రతపై (ఆర్ అండ్ బి) శాఖ చూపుతున్న నిర్లక్ష్యం ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నట్లుగా మారింది. మలుపు వద్ద యూటర్న్ ఉందని తెలియజేసే సూచిక బోర్డులు, బాణపు గుర్తులు ఉన్న హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినప్పటికీ, అవి కంపచెట్ల మధ్య పూర్తిగా మరుగున పడిపోయి వాహనదారులకు స్పష్టంగా కనిపించని పరిస్థితి నెలకొంది. దీంతో మలుపు ముందే హెచ్చరిక లేకుండా వాహనాలు రావడం



ప్రమాదాలకు కారణమవుతోంది. ఇదే ప్రాంతంలో గతంలో ఓ తండ్రి తన కుమార్తెను కలవడానికి వస్తూ ఇదే మలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ప్రమాదం జరిగిన ప్రతిసారి "హెల్మెట్ లేదు, ఓవర్ స్పీడ్" అబ్జర్వేషన్ మిర్రర్స్ లేనందువలన అంటూ మృతులపైనే నిందలు వేయడం సరికాదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రహదారి నిర్వహణ కూడా ప్రభుత్వ శాఖ బాధ్యతేనని గుర్తించాలని వారు స్పష్టం చేస్తున్నారు. ఇరువైపులా ఉన్న కంపచెట్లను వెంటనే తొలగించి, యూటర్న్ సూచిక బోర్డులు, బాణపు గుర్తులు స్పష్టంగా కనిపించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

# బ్యాంకులకు నిర్దేశించిన రుణ లక్ష్యాలను అధిగమించాలి

: అదనపు కలెక్టర్ సిహెచ్ మహేందర్

ములుగు జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 26 (భారత శక్తి) : ములుగు జిల్లా పరిధిలోని బ్యాంకులకు నిర్దేశించిన రుణ లక్ష్యాలను అధిగమించాలని జిల్లా అదనపు కలెక్టర్ సిహెచ్ మహేందర్ జి అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో గురువారం బ్యాంకర్ల తో జిల్లా స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సి.హెచ్.మహేందర్ జి. హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పథకాలకు ప్రాధాన్యత కల్పిస్తూ బ్యాంకర్లు ముందుకు సాగాలన్నారు. గ్రామాలలోని నిరుపేద కుటుంబాలకు బ్యాంకుల ద్వారా రుణాలు పొంది ఆర్థికంగా అభివృద్ధి ఎదుగుదలకు గాను సమావేశాలు నిర్వహించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని బ్యాంకర్లకు సూచించారు. నూతనంగా ఏర్పడే మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలను అందించడానికి వారికి నూతన ఖాతాలను తెరిపించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా 60 సంవత్సరాలు నిండిన మహిళ వయోవృద్ధులతొ ఏర్పాటు చేస్తున్న



సంఘాలకు నూతన ఖాతాలు అందించడం వారికి అనుగుణంగా రుణ సహాయాలు అందించడానికి బ్యాంకర్లు ముందుకు రావాలని కోరారు. నిరుద్యోగ యువత స్వయం ఉపాధి మరియు చిన్న తరహా పరిశ్రమలు స్థాపించడానికి ప్రభుత్వ పథకాల ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి నియమ నిబంధనల ప్రకారం రుణాలు అందించే విధంగా చూడాలని పేర్కొన్నారు. అనంతరం అదనపు కలెక్టర్, లీడ్ బ్యాంకు మేనేజర్ జయప్రకాష్,నాబార్డ్ ఏజీఎం చంద్రశేఖర్,ఆర్.బి.ఐ ఏజీఎం యశ్వంత్ సాయి,యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డీజీఎం కమలాకర్ లతో కలిసి 202627 ఆర్థిక సంవత్సర ప్రొటెక్షన్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ బుక్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కొమురయ్య, పరిశ్రమల శాఖ జీఎం సిద్ధార్థ రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ధర్మ నాయక్, మత్స్య సంవర్ధక శాఖ సాల్మన్ రాజు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేష్ కుమార్, హార్టికల్చర్ అధికారి సంజీవరావు, అడిషనల్ డిఆర్డిఏ శ్రీనివాస్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఓ అధికారిగా మాయమాటలు...

## ప్రభుత్వ అధికారులను బెదిరించి డబ్బులు దోచుకున్న కేటుగాడు అరెస్ట్

* బెట్టింగ్ వ్యసనంతో మోసాల బాట పట్టిన నిందితుడు
* పలు జిల్లాల్లో 10కి పైగా కేసులు నమోదు
* వివరాలు వెల్లడించిన ఏఎస్పీ రుత్విక్ సాయి


వేములవాడ, ఫిబ్రవరి 26 (భారత శక్తి) : సీఎంఓ కార్యాలయ అధికారిగా నటిస్తూ ప్రభుత్వ అధికారులను భయభ్రాంతులకు గురిచేసి డబ్బులు వసూలు చేస్తున్న మోసగాడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వేములవాడ ఏఎస్పీ రుత్విక్ సాయి తెలిపారు. ఏఎస్పీ వెల్లడించిన వివరాల ప్రకారం...రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ మండలం కుంట్లూర్‌కు చెందిన రాయబండి సూర్యప్రకాశ్ గతంలో రామోజీ ఫిల్మ్ సిటీ సమీపంలోని ప్రైవేట్ సంస్థలో ఆఫీస్ బాయ్‌గా పనిచేశాడు. గుర్రపు పందేల బెట్టింగ్‌కు బానిసైన అతడు సంపాదన సరిపోక సులభంగా డబ్బులు సంపాదించాలనే దురుద్దేశంతో నేరాల మార్గాన్ని ఎంచుకున్నాడు.ఈ క్రమంలో హయత్‌నగర్ పరిధిలో మూడు మోటార్‌సైకిళ్లు దొంగిలించి అరెస్ట్ అయి జైలుకు వెళ్లిన నిందితుడు, విడుదలైన తర్వాత మరింత కుతంత్రానికి పాల్పడ్డాడు.




సీఎంఓ కార్యాలయంలో పనిచేస్తున్నానంటూ ప్రభుత్వ అధికారులకు ఫోన్ కాల్స్ చేసి బెదిరింపులకు దిగుతూ డబ్బులు డిమాండ్ చేయడం ప్రారంభించాడు.వార్తాపత్రికలు, ఇతర మార్గాల ద్వారా ప్రభుత్వ అధికారుల ఫోన్ నంబర్లు సేకరించిన సూర్యప్రకాశ్, "సీఎంఓ కార్యాలయం నుండి మాట్లాడుతున్నాను... అందరూ అధికారులు డబ్బులు చెల్లిస్తున్నారు,మీరు కూడా వెంటనే పంపాలి" అంటూ బెదిరించి తన ఫోన్‌పే ఖాతాకు నగదు పంపించాలని ఒత్తిడి తెచ్చేవాడు. చెల్లించకపోతే అధికారిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని భయపెట్టి పలువురి నుండి డబ్బులు దోచుకొని వాటిని బెట్టింగ్‌లలో ఖర్చు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇప్పటికే హైదరాబాద్ సీసీఎస్‌లో రెండు కేసులు, సనత్‌నగర్‌లో ఒకటి, సిద్ధిపేటలో రెండు, జగిత్యాలలో ఒక కేసుతో పాటు పలు పోలీస్ స్టేషన్లలో నిందితుడిపై కేసులు నమోదై జైలుశిక్ష అనుభవించిన చరిత్ర ఉన్నట్లు వెల్లడైంది.ఈ నెల 23న బోయినపల్లి పరిధిలోని మిడ్ మానేరు ప్రాజెక్ట్ డీఈఈ రఘుపతికి కాల్ చేసి సీఎంఓ అధికారిగా నటిస్తూ డబ్బులు డిమాండ్ చేయగా, అప్రమత్తమైన అధికారి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో కేసు నమోదు చేసిన బోయినపల్లి పోలీసులు సాంకేతిక ఆధారాలతో నిందితుడిని గుర్తించి, డబ్బులు స్వీకరించేందుకు కోదురుపాకకు వస్తున్న సమయంలో గురువారం అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుండి ఒక మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. నిందితుడిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై రమాకాంత్, కానిస్టేబుళ్లు కోటి, అచ్యుత్, వెంకటేష్, తేజలను ఏఎస్పీ రుత్విక్ సాయి ప్రత్యేకంగా అభినందించారు.

# సంస్కారవంతమైన విద్యకు నిలయాలు శిశుమందిరాలే

* బడంగ్‌పేటలో సరస్వతి శిశుమందిర్ పాఠశాల భవన ప్రారంభోత్సవం
* ముఖ్య అతిథులుగా లింగం సుధాకర్ రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, పారిజాత నరసింహారెడ్డి



బడంగ్‌పేట: ఫిబ్రవరి 26 భారత శక్తి : సంస్కృతి, సంప్రదాయాలతో కూడిన విద్యను అందిస్తూ సమాజంలో ఉత్తమ పౌరులను తీర్చిదిద్దడంలో సరస్వతి శిశుమందిర్ పాఠశాలలు అగ్రగామిగా నిలుస్తున్నాయని విద్యాపీఠం దక్షిణ మధ్య క్షేత్ర సంఘటన కార్యదర్శి లింగం సుధాకర్ రెడ్డి అన్నారు. గురువారం బడంగ్‌పేటలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ 42వ వార్షికోత్సవం, నూతన భవన ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించారు.

**వివేకానందుడి విగ్రహావిష్కరణ**

పాఠశాల ఆవరణలో నూతనంగా నిర్మించిన మొదటి రెండు అంతస్తులను ప్రారంభించడంతో పాటు, స్వామి వివేకానంద విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆర్థిక సాయం ఆశించకుండా, వేలాది మంది విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తూ ఉన్నత స్థాయికి చేర్చుతున్న యాజమాన్యం కృషి అభినందనీయమన్నారు. ఇక్కడి విద్యార్థులు డాక్టర్లు, ఇంజనీర్లు, లాయర్లుగా వివిధ రంగాల్లో రాణిస్తున్నారని గుర్తుచేశారు.

**వ్యక్తిత్వ వికాసానికి వేదికలు**

మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతి, వ్యక్తిత్వ వికాసానికి శిశుమందిరాలే పురుడు పోస్తున్నాయని కొనియాడారు. "గతంలో ఇళ్ల వద్దే పెద్దల ద్వారా పిల్లలకు రామాయణ, భారత గాథలు తెలిసేవని, ప్రస్తుతం మారుతున్న కాలంలో ఆ బాధ్యతను ఈ పాఠశాలలు స్వీకరించడం విశేషం" అని పేర్కొన్నారు. సమాజం బాగుండాలంటే ఇలాంటి విద్యా సంస్థల అవసరం ఎంతో ఉందన్నారు.

**దాతలకు సన్మానం**

కార్యక్రమంలో భాగంగా పాఠశాల భవన నిర్మాణానికి సహకరించిన దాతలను ఘనంగా సన్మానించారు. ఈ వేడుకల్లో మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, పతాకమురి శ్రీనివాసరావు, పాఠశాల అధ్యక్షుడు మదన్ మోహన్ ధరక్, సామ సంజీవరెడ్డి, ఉపాధ్యక్షుడు సమరసింహారెడ్డి, కార్యదర్శి దొడ్డి మల్లికార్జున్, ఉప కార్యదర్శి రామిడి శురకర్ణ రెడ్డి, గణేష్ గౌడ్, కిరణ్ గౌడ్, నరసింహగౌడ్ తో పాటు మాజీ కార్పొరేటర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కన్నీటి కుటుంబానికి
## అండగా నిలిచిన కౌన్సిలర్ ముత్యం



వేములవాడ, ఫిబ్రవరి 26 (భారత శక్తి) : వేములవాడ పట్టణంలోని 17వ వార్డుకు చెందిన తిప్పర్తి మాధవచారి అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతి చెందడంతో ప్రాంతం మొత్తం విషాదంలో మునిగిపోయింది. కుటుంబానికి ఏకైక ఆధారంగా ఉన్న వ్యక్తి ఆకస్మిక మరణంతో కుటుంబ సభ్యులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు.ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో చాలామంది దూరంగా నిలిచే వేళ, 17వ వార్డు కౌన్సిలర్ కొండ్లెపు ముత్యం వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి అండగా నిలిచి నిజమైన ప్రజా నాయకత్వాన్ని చాటుకున్నారు. మున్సిపల్ అధికారులతో సమన్వయం చేస్తూ వైకుంఠధామంలో అన్ని ఏర్పాట్లు చేయించడమే కాకుండా,లయన్స్ క్లబ్ సహకారంతో ఫ్రీజర్ బాక్స్‌ను స్వయంగా పర్యవేక్షిస్తూ అందుబాటులో ఉంచారు. అంత్యక్రియల ఏర్పాట్లన్నింటినీ స్వయంగా బాధ్యతగా తీసుకుని చివరి వరకు కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పుతూ దహన సంస్కార కార్యక్రమంలో పాల్గొని బాధితురాలు తిప్పర్తి ఎల్లవ్వకు రూ.5,000 ఆర్థిక సహాయం అందజేసి, భోజన ఏర్పాట్లు నిర్వహించడం ద్వారా సేవ అంటే మాటల్లో కాదు చేతల్లో చూపించారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ ముత్యం మాట్లాడుతూ, ప్రజలకు కష్టం వచ్చినప్పుడు ముందుండి నిలబడటం ప్రజా ప్రతినిధిగా తన కర్తవ్యమని స్పష్టం చేశారు. కష్టకాలంలో ప్రజలతో కలిసి నడిచే నాయకుడే నిజమైన నాయకుడు అంటూ స్థానిక ప్రజలు ఆయన సేవలను కొనియాడారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పూర్తి చేయాలి





ములుగు జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 26 (భారత శక్తి) : జిల్లావ్యాప్తంగా మంజూరైన ఇందిరమ్మ ఇండ్లను పూర్తిచేసి లబ్ధిదారులకు అందించే విధంగా సిద్ధం చేయాలని, జిల్లా లో వివిధ శాఖల లో పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క సూచించారు. గురువారం ములుగు జిల్లా ఎస్ ఎస్ తాడ్వాయి మండలం మేడారంలో సమ్మక్క సారలమ్మ వన దేవతలను మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్., ఎస్ పి సుధీర్ రామ్ నాథ్ కేకన్ లతో కలిసి దర్శించుకున్నారు. అనంతరం మంత్రి , కలెక్టర్ దివాకర టి. ఎస్., ఎస్ పి సుధీర్ రామ్ నాథ్ కేకన్, ఐటిడిఏ పి ఓ చిత్ర మిశ్రా లతో కలిసి మేడారం లోని హరిత హోటల్ లో మేడారం మాస్టర్ ప్లాన్, జంపన్న వాగు అభివృద్ధి పనులు, ఇందిరమ్మ నిర్మాణం, గోదావరి పుష్కరాల నిర్వహణ, వేసవికాలంలో త్రాగునీటి సరఫరా, సెంట్రల్ లైటింగ్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులు, పలు అభివృద్ధి పనులపై జిల్లాస్థాయి అధికారులతో కలిసి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ జిల్లాలో వివిధ దశలలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను పూర్తి చేసి లబ్ధిదారులతో గృహ ప్రవేశాలు నిర్వహించాలని అన్నారు. అదే విదంగా పూర్తయిన ఇండ్లకు డబ్బులు చెల్లించాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మేడారంలో మరిన్ని శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టాలని, భక్తులకు ప్రశాంతమైన దర్శనం కల్పించే విధంగా గద్దెల చుట్టూ గ్రిల్స్ ఏర్పాటు చేయాలని, ఆదివాసి పూజారులతో సమావేశాలు నిర్వహించి వారి సూచన సలహాలు మేరకు పటిష్టమైన మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని, మేడారం రహదారుల డివైడర్ మధ్య భాగంలో ప్లాంటేషన్ చేయాలని అన్నారు. అదేవిధంగా జంపన్న వాగులో నిరంతరం నీరు ప్రవహించేలా చూడడం కోసం జంపన్న వాగుపై చెక్ డ్యామ్ ల నిర్మాణం కోసం నిపుణులతో సర్వే నిర్వహించి ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా ప్రతిపాదనలు సిద్ధం చేసి అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వేసవికాలంలో పెండింగ్ పనులు పూర్తి చేయడంలో అధికారులు నిమగ్నం కావాలని వాటికి సంబంధించిన ప్రతిపాదనలు పలు అంశాలు అన్ని సిద్ధం చేసుకోవాలని ఈ మూడు నెలలు వేసవి కాలంలో త్వరితగతిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ప్రభుత్వ నిధులను పకడ్బందీగా ప్రజల అభివృద్ధి కోసం వెచ్చించాలని, ములుగు జిల్లా కీర్తి ప్రతిష్టలను ప్రపంచ స్థాయిలో గుర్తింపు లభించే విధంగా అభివృద్ధి పరచాలని అన్నారు. వచ్చే ఏడాది 2027లో జరగనున్న గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని జిల్లాలోని ప్రధానమైన ఈ పుష్కర ఘాట్ ల వద్ద ప్రజల సౌకర్యార్థం పరిసరాల పరిశుభ్రతతో పాటు కనీస సదుపాయాలు భక్తులకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. గోదావరి పుష్కరాలకు ఈ ఘాట్ వద్ద భక్తులు పుణ్య స్నానాలకు తరలివచ్చే అవకాశాలు ఉన్నందున ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా వాహనాల పార్కింగ్, మరుగుదొడ్లు, తాత్కాలిక గదులు, షామియానాలు వంటివి పక్కాగా అందుబాటులో ఉండాలన్నారు. భక్తులకు పూర్తి స్థాయిలో పటిష్ట భద్రత కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పుష్కర ఘాట్ వద్ద మెట్లు, ఘాట్ వంటి వాటికి అవసరమైన మేర మరమ్మతులు చేయించాలని అన్నారు. ఘాట్ వద్ద ప్రమాదాలకు ఆస్కారం లేకుండా అన్ని జాగ్రత్తలు చేపట్టాలని, హైమాస్ లైట్లు ఏర్పాటు చేయాలని, రహదారికి మరమ్మతులు జరిపించాలని మంత్రి ఆదేశించారు. భక్తుల సౌకర్యార్థం జిల్లాలో నాలుగు పుష్కర ఘాట్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు పకడ్బందీ ప్రణాళికలతో ప్రతి ఒక్కరికి త్రాగునీరు అందించే విధంగా చూడాలని అన్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ లో కూలీల సంఖ్య పెరిగే విధంగా చూడాలని ఈ పథకం ద్వారా గ్రామానికి అవసరం అయ్యే పనులను ఎంపిక చేయాలన్నారు. అంతకుముందు మంత్రి సీతక్క ఎస్ ఎస్ తాడ్వాయి మండలం మేడారంలోని హరిత హోటల్ లో ఎస్ ఎస్ తాడ్వాయి మండల పరిధిలోని 25 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి / షాది ముభారక్ చెక్కులను దివాకర టి. ఎస్., ఎస్ పి సుధీర్ రామ్ నాథ్ కేకన్, ఐటిడిఏ పి ఓ చిత్ర మిశ్రా లతో కలిసి పంపిణీ చేశారు. ఏటూరు నాగారం ప్రాజెక్ట్ ఆఫీసర్ గా విధులు నిర్వర్తిస్తున్న చిత్ర మిశ్రా ఐఏఎస్‌ను రాష్ట్ర ప్రభుత్వం కరీంనగర్ జిల్లా కలెక్టర్ గా ప్రమోట్ చేస్తూ బదిలీ ఉత్తర్వులు వచ్చిన సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క ఐటిడిఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ ను శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, ఎండోమెంట్ అడిషనల్ కమిషనర్ సునీత, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, పూజారుల సంఘం అధ్యక్షులు జగ్గారావు, ఆర్డీఓ వెంకటేష్, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన
## గరిమ అగ్రవాల్

* శుభాకాంక్షలు తెలిపిన అదనపు కలెక్టర్,జిల్లా అధికారులు.



రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 26 (భారత శక్తి) : జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్లో జిల్లా కలెక్టర్ గా గరిమ అగ్రవాల్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, ఇంచార్జి కలెక్టర్ గా గరిమ అగ్రవాల్ అక్టోబర్ 23 వ తేదీ 2025 న బాధ్యతలు స్వీకరించారు. గరిమ అగ్రవాల్ గారిని కలెక్టర్ గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ కు అర్చకులు ఆశీర్వచనం అందించారు. అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, పలువురు జిల్లా అధికారులు కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఏవో రామ్ రెడ్డి, కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రావణ్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై
## జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ సమీక్ష




ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 26 (భారత శక్తి) వచ్చే ఏడాది జరగనున్న గోదావరి నది పుష్కరాల సందర్భంగా జిల్లాలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై ఈరోజు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా గుర్తించిన మొత్తం 19 పుష్కర ఘాట్‌లకు భారీగా భక్తులు తరలివచ్చే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని జనసందోహ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, పార్కింగ్ సదుపాయాలు,వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ,జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల తో పాటు, భైంసా సబ్ కలెక్టర్ సంకేత్ కుమార్, భైంసా ఏ ఎస్పీ రాజేష్ మీనా, నిర్మల్ ఏ ఎస్పీ సాయి కిరణ్, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## గోదావరి పుష్కరాలపై ప్రభుత్వం ఫోకస్..
## అమరావతిలో కీలక భేటీ

గోదావరి పుష్కరాలను వైభవంగా నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటి నుంచి పుష్కరణాల నిర్వహణపై ఫోకస్ పెట్టింది. మహా కుంభమేళ తరహాలో గోదావరి పుష్కరాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గత అనుభవాలు రిపీట్ కాకుండా పటిష్టంగా సిద్ధాంత పరంగా నిర్వహించేందుకు కసరత్తులు ప్రారంభించింది. వచ్చే ఏడాది జూన్‌లో గోదావరి పుష్కరాలు జరగనున్న నేపథ్యంలో ఇప్పటికే గోదావరి పుష్కరాల బాధ్యతను కేబినెట్ సబ్ కమిటీకి అప్పగించింది. దీంతో తాజాగా అమరావతిలో కేబినెట్ సబ్ కమిటీ భేటీ అయింది. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధ్యక్షతన ఈ సమావేశం కొనసాగుతోంది. మంత్రులు కందుల దుర్గేష్, బి.సి. జనార్దన్, సత్యకుమార్, గొట్టిపాటి, మండిపల్లితో పాటు ఉన్నతాధికారులు హాజరై చర్చిస్తున్నారు.

## కేంద్ర బృందంకు పవార్ పాయింట్ ప్రజంటేషన్
## వివరించిన జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్

సూర్యాపేట (భారత శక్తి జిల్లా ప్రతినిధి) ఫిబ్రవరి 26: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పేరును కేంద్ర ప్రభుత్వం వి బి జి గ్రామ గా మారుస్తున్న తరుణంలో ఎం ఓ ఆర్ డి (కేంద్ర గ్రామీణాభివృద్ధి సంస్థ) కేంద్ర బృందం సభ్యులు సంజయ్ కుమార్ నేతృత్వంలో తేది.26022026 నుండి 28022026 వరకు సూర్యాపేట జిల్లాలో పర్యటన సందర్భంగా గురువారం జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తో సమావేశమయ్యారు. ఇట్టి సమావేశంలో సూర్యాపేట జిల్లాలో జరిగిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనుల పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా బృంద సభ్యులకు వివరించారు. అనంతరం ఈజీఎస్ పథకాల పనులపై జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ ప్రదర్శనను కేంద్ర బృందం, కలెక్టర్ తిలకించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె సీతారామారావు, డిప్యూటీ సీఈవో శిరీష, కేంద్ర బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ "ఫుడ్ ట్రక్కు" లను
## పరిశీలించిన జిల్లా కలెక్టర్




కడప, ఫిబ్రవరి 26(భారత శక్తి) : వైయస్సార్ కడప జిల్లాలో వినూత్నంగా ఆవిష్కృతమై.. దేశానికే స్ఫూర్తిగా నిలిచిన "సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్" వ్యవస్థలో తయారైన డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనాన్ని.. పాఠశాలలకు చేర్చేందుకు అధునాతన మానిటరింగ్ సాంకేతికతతో ప్రత్యేకంగా రూపొందించిన "ఫుడ్ రవాణా ట్రక్కు"లను కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పరిశీలించారు. ఈ సందర్భంగా వాహన తయారీదారులైన "EULER" కంపెనీ ప్రతినిధులు ఫుడ్ ట్రక్ నిర్వహణ డెమోను ప్రదర్శించి జిల్లా కలెక్టర్ కు వాహన నిర్వహణ ప్రత్యేకతలను వివరించారు. ఈ కార్యక్రమంలో స్టెప్ సీఈవో, స్మార్ట్ కిచెన్స్ నోడల్ అధికారి జోయల్ విజయ కుమార్, డిఆర్డీఏ పీడి రాజ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# మండలిని కుదిపేసిన లడ్డూ ప్రసాదం!



అమరావతి: తిరుపతి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వినియోగం అంశం శాసనమండలిని కుదిపేసింది. అధికార, ప్రతిపక్ష సభ్యుల రాజకీయ సవాళ్లకు వేదికైంది. పోటాపోటీ నినాదాలు, పోడియంలోకి చొచ్చుకువెళ్లి నిరసనలు తెలపడంతో మండలి హోరెత్తింది. తన ప్రమేయం లేకుండానే తన పేరిట కమ్యూనికేషన్ ఎలా వచ్చిందంటూ ఛైర్మన్ మోషేనురాజు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. తిరుపతి లడ్డూ ప్రసాదం అంశంపై మండలిలో లఘు చర్చ గురువారం ఉంటుందని.. ఆ అంశానికి సంబంధించి సమగ్ర సమాచారం తెలుగు, ఇంగ్లిషు భాషలో 150 కాపీలు సెక్రటేరియట్‌కు కావాలని ఛైర్మన్ పేరిట కమ్యూనికేషన్ ఎలా ఇచ్చారంటూ అధికార పక్షం పేర్కొంది. తన ప్రమేయం లేకుండా కమ్యూనికేషన్ ఎలా వెళ్లిందని ఛైర్మన్ ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. లడ్డూ ప్రసాదం అంశంపై ఎలాంటి స్టేట్‌మెంట్ ప్రభుత్వం నుంచి లేదని ఛైర్మన్ చెప్పారంటూ మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. లఘు చర్చకు అనుమతించే విషయమై మంత్రి, ఛైర్మన్, ప్రతిపక్ష నేతల మధ్య ఆసక్తికర సంభాషణ చోటు చేసుకుంది. చర్చకు సంబంధించి అధికార, ప్రతిపక్ష సభ్యులు ఎవరికి వారు వ్యూహాత్మకంగా వ్యవహరించారు. సభ్యుల మధ్య ఉద్రిక్తతలతో సభను అప్పటికే పలుమార్లు వాయిదా వేస్తూ వచ్చిన ఛైర్మన్.. ఆ తర్వాతా కొనసాగించలేని స్థితిలో శుక్రవారానికి వాయిదా వేశారు.

*** ఈ సందర్భంగా సభలో జరిగిన ఆసక్తికర సంభాషణలు..**

మంత్రి కేశవ్: సభ వాయిదా వేసి వెళ్తూ మిగిలిన ప్రశ్నలకు సమాధానం చెప్పినట్లుగా భావించాలని మీరు (ఛైర్మన్) అన్నారు. దీనివల్ల సభ్యుల్లో ఆందోళన ఉంది. అందుకే ప్రశ్నోత్తరాలు కొనసాగించాలని అడుగుతున్నారు. ఇవ్వాలా లేదా? అనేది మీ ఇష్టం. అలా కాకుండా ఛైర్‌లో కూర్చుని మెంబర్లకు ఏదో యాట్రిబ్యూట్ చేయడమనేది మంచిది కాదు.

ఛైర్మన్ మోషేనురాజు: మీరు శాసనసభ వ్యవహారాల మంత్రి కూడా. మీకు నిబంధనలన్నీ తెలుసు. ఒకసారి ప్రశ్నలకు సమాధానం చెప్పినట్లు భావించాలని ప్రకటించిన తర్వాత మళ్లీ ప్రశ్నోత్తరాలు జరపాలని ఎలా అడుగుతున్నారు? తిరిగి సమావేశమైన తర్వాత నేను ఇప్పటి వరకు సభలో కార్యకలాపాలు ప్రారంభించలేదు. నేను సభ కార్యకలాపాలు ప్రారంభించిన తర్వాత సభ్యులుగా మీకు కావాల్సిన అంశం గురించి డిమాండ్ చేసే అధికారం ఉండొచ్చు. ప్రశ్నలకు సమాధానం చెప్పినట్లుగా భావించాలని ఛైర్మన్‌గా ప్రకటించాను. తర్వాత 'లడ్డూ ప్రసాదం'పై లఘు చర్చకు అనుమతిస్తున్నా. దీనికి సంబంధించి శాసనమండలి బీఏసీ సమావేశంలో ఇరు పార్టీలు నిర్ణయం తీసుకున్నాయి.

కేశవ్: (లఘు చర్చ జరపాలంటూ వైకాపా సభ్యులు నినాదాలు చేయడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ) సభ ఎలా జరపాలో కూడా ప్రభుత్వానికి నిర్దేశిస్తారా? అది నిర్ణయించాల్సింది ప్రభుత్వం. ప్రభుత్వం చెప్పేది వినడానికి వైకాపా సభ్యులు ఎందుకు సిద్ధంగా లేరు; సభను ఆర్డర్‌లో ఉంచేలా ఛైర్మన్ చర్యలు తీసుకోవాలి. లడ్డూ ప్రసాదం అంశంపై ఎంతసేపైనా సమాధానం చెప్పడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. వినడానికి వైకాపా సభ్యులు ఓపికగా ఉండాలి. రోజూ మాదిరే వాకౌట్ చేసి వెళ్లొద్దు. సభ సంప్రదాయం ప్రకారం సంబంధిత మంత్రి మాట్లాడతారు. తర్వాత ఎంతసేపైనా మీరు మాట్లాడొచ్చు. ఆ తర్వాత ప్రభుత్వం సమాధానం ఇస్తుంది.

ఛైర్మన్: ఆర్థిక మంత్రి చెప్పేది వాస్తవం కాదు. లఘు చర్చలో సంబంధిత మంత్రి స్టేట్‌మెంట్ చేయాలన్న నిబంధన లేదు. మీరు స్టేట్‌మెంట్ ఇవ్వాలనుకుంటే ప్రభుత్వానికి హక్కు ఉంది. దానికి వేరే ఫార్మాట్‌లో రావాలి. అప్పుడు ప్రభుత్వానికి కచ్చితంగా అవకాశం ఇస్తా. లఘు చర్చలో మాత్రం ప్రకటన ఇవ్వడానికి మంత్రికి అధికారం లేదు. తొలుత చర్చ ప్రారంభించే అవకాశం ప్రతిపక్షానికే ఉంది. కాబట్టి అవకాశం ఇచ్చా.

కేశవ్: ప్రభుత్వ వాదన వినకపోతే ఎలా? ఛైర్మన్‌గా మీరు ఒక అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఒక అంశంపై ప్రకటన చేయడానికి ప్రభుత్వానికి అనుమతి ఇవ్వను అని అన్నారు.

ఛైర్మన్: నేను ప్రభుత్వానికి అనుమతి ఇవ్వను అని చెప్పడం లేదు. లఘు చర్చలో ప్రకటన చేసేందుకు ప్రభుత్వానికి అవకాశం ఇవ్వనని మాత్రమే అన్నా.

కేశవ్: లఘు చర్చలో ప్రభుత్వానికి ప్రకటన చేసే అవకాశం ఇవ్వనని అంటున్నారు. అయితే, మీరు కమ్యూనికేషన్ ఎందుకు ఇచ్చినట్లు. తిరుపతి లడ్డూ అంశంపై గురువారం లఘు చర్చ ఉంటుంది. ఆ అంశానికి సంబంధించి సమగ్ర సమాచారం తెలుగు, ఇంగ్లిషు భాషలో 150 కాపీలు సెక్రటేరియట్‌కు కావాలి' అని మీరు (ఛైర్మన్) కోరినట్లు కమ్యూనికేషన్ ఎవరు ఇచ్చారు? స్టేట్‌మెంట్ ఇవ్వమని కౌన్సిల్ నుంచి ప్రభుత్వానికి చెప్పి.. ఇప్పుడు వీల్లేదని అనడమేంటి? ఇది మీరు ఇచ్చిన సమాచారమే.

ఛైర్మన్: అది తప్పుడు పత్రం. నా నోటీసులో లేదు. నా అనుమతితో చేసింది కాదు.

కేశవ్: మీరు చూడకుండా.. చదవకుండా తప్పుడు పత్రం అని ఎలా అంటారు?

ఛైర్మన్: లఘు చర్చకు వెళ్దామా? లేదా? తేల్చండి.

కేశవ్: లఘు చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఈ రోజు లడ్డూ ప్రసాదం అంశంపై చర్చించడానికి మేం సిద్ధం. శాంతిభద్రతల అంశంపై ఇదే సభలో ప్రభుత్వం ప్రకటన ఇచ్చింది. వ్యవసాయంపై నిన్న జరగాల్సిన లఘు చర్చ జరగలేదు. ఈ రోజు అంశానికి అడ్డుపడటమేంటి?

ఛైర్మన్: అవన్నీ ప్రభుత్వం ఇచ్చే సమాధానం తప్పించి ప్రకటన కాదు. (అని ఇంకా మాట్లాడుతుండటంతో)

కేశవ్: మీకు వినడానికి ఓపిక లేదు. ఎందుకంత డిఫెన్స్‌లోకి వెళ్తారు?

ఛైర్మన్: మీరు సభను ఎందుకు డిఫెన్స్‌లో పెడుతున్నారు?

కేశవ్: మీరు ఇచ్చిన లెటర్‌ను కూడా కాదనడమేంటి? తెల్లవారుజామున రెండు గంటల వరకు ఉండి కల్తీ నెయ్యి అంశంపై సమాధానం చెప్పడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని అంటుంటే.. వినేందుకు వారు (వైకాపా సభ్యులు) ఎందుకు భయపడుతున్నారు? వారు చేసిన అవినీతిని, హిందూ వ్యతిరేక విధానాలు వెలుగులోకి వస్తాయనా? ఎందుకు భుజాలు తడుముకుంటున్నారు? దయచేసి వాకౌట్ చేయవద్దు. మంత్రి రామనారాయణరెడ్డి నిన్న శాసనసభలో లడ్డూ ప్రసాదం అంశంపై మాట్లాడారు. ఈ రోజు మండలిలో ప్రకటన ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారు. ఆ తర్వాత మీరు (వైకాపా సభ్యులు) ఎన్ని గంటలు మాట్లాడినా మేం చర్చిస్తాం. ప్రతిపక్షంగా మీకు ప్రభుత్వాన్ని శాసించే హక్కు లేదు.

ఛైర్మన్: విచిత్రంగా ఉంది. చర్చించడానికి ప్రభుత్వం, ప్రతిపక్షం రెండూ సిద్ధంగా ఉన్నామంటున్నాయి. కానీ సభలో చర్చ మాత్రం జరగడం లేదు.

**మూడు ప్రశ్నలు.. నాలుగు వాయిదాలు**

గురువారం ఉదయం మండలి ప్రారంభమైన తర్వాత ప్రశ్నోత్తరాల సమయంలోనే వైకాపా నిరసనలతో పలుమార్లు వాయిదా పడింది. 1.07 గంటలకు సభ సమావేశమైన తర్వాత ప్రశ్నోత్తరాలను తిరిగి కొనసాగించాలని తెదేపా సభ్యులు పట్టుబట్టారు. మిగిలిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చినట్లుగా భావించాలని సభలో ప్రకటించిన తర్వాత అనుమతించే ప్రసక్తి లేదని ఛైర్మన్ తిరస్కరించారు. దీనికి నిరసనగా తెదేపా ఎమ్మెల్సీలు పోడియంలోకి వెళ్లి కొద్దిసేపు నినాదాలు చేశారు. ఆ తర్వాత నేరుగా తిరుపతి లడ్డూ ప్రసాదం అంశంపై లఘు చర్చకు ఛైర్మన్ అనుమతించడం.. తొలుత వైకాపా సభ్యుడు చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడేందుకు ప్రయత్నించడం సుదీర్ఘ వాదనకు దారి తీసింది. చర్చ జరిగే అవకాశం లేక సభను శుక్రవారానికి ఛైర్మన్ వాయిదా వేశారు

*** ప్రభుత్వం చెప్పేది సత్యదూరమైన మాటలు: బొత్స సత్యనారాయణ**

తిరుపతి లడ్డూ ప్రసాదం అంశంపై ప్రభుత్వం చెప్పేవన్నీ సత్యదూరమైన మాటలని బొత్స ఆరోపించారు. 'ఈ అంశంపై మంత్రి (కేశవ్) మాట్లాడారు. స్టేట్‌మెంట్ ఇవ్వడానికి ప్రభుత్వం నుంచి ఏవైనా పత్రాలు మీ దగ్గరకు వచ్చాయా? అని నేను ముందే మిమ్మల్ని (ఛైర్మన్‌ను) అడిగా. అలాంటివి ఏమీ రాలేదని మీరు చెప్పారు. దోపిడీ కప్పిపుచ్చడానికి ప్రభుత్వం ఇలా చేస్తోంది. దేవదేవుడిపై అపవాదు సృష్టించి, వారి లాభం కోసం ఇదంతా చేస్తున్నారు' అని చర్చలో జోక్యం చేసుకుని ఆవేశంతో మాట్లాడారు.



## పదో తరగతి విద్యార్థులకు ప్రేరణాత్మక సదస్సు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 26 (భారత శక్తి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలను ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొనేందుకు మామడ మండలంలో ప్రత్యేక ప్రేరణాత్మక సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమం ZPHS మమడ పాఠశాలలో జరిగింది. ఇందులో KGBV మమడ మరియు MJP మమడ పాఠశాలల పదో తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ సైకియాట్రిస్ట్ డాక్టర్ సురేష్ అల్లాడి హాజరై విద్యార్థులకు మార్గనిర్దేశనం చేశారు. పరీక్షల సమయంలో ఒత్తిడిని ఎలా నియంత్రించుకోవాలి, సమయాన్ని ఎలా సమర్థంగా వినియోగించుకోవాలి, ప్రశ్నాపత్రాన్ని ఎలా విశ్లేషించాలి వంటి అంశాలపై వివరంగా చర్చించారు. క్రమబద్ధమైన చదువు, పునరావృత అభ్యాసం, ధ్యానం, లోతైన శ్వాసాభ్యాసం ద్వారా మానసిక ప్రశాంతతను పొందవచ్చని తెలిపారు. సమతుల్య ఆహారం, తగినంత నిద్ర, మొబైల్ వినియోగంపై నియంత్రణ వంటి అంశాలు కూడా మంచి ఫలితాలకు దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు. లక్ష్యాన్ని స్పష్టంగా నిర్దేశించుకుని క్రమశిక్షణతో ముందుకు సాగితే విజయం సాధ్యమని విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు పరీక్షల్లో అనుసరించాల్సిన విధానాలు, సమాధానాల రచనా పద్ధతులు, సమయ నిర్వహణపై విద్యార్థులకు సూచనలు అందించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి (MEO), ప్రధానోపాధ్యాయులు (HM), ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కార్యక్రమం విద్యార్థుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపగా, పరీక్షలను ధైర్యంగా ఎదుర్కొనే నమ్మకం పెరిగిందని నిర్వాహకులు తెలిపారు.

## ఇక మాజీ సైనికులకు రైల్వేలో ఉద్యోగాలు... ఆర్మీతో కీలక ఒప్పందం

మాజీ సైనికులు, అగ్నివీరులకు అండగా నిలిచేందుకు భారత రైల్వే శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. దేశ సేవలో రిటైర్ అయిన సైనికులకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో భారత సైన్యంతో ఒక కొత్త సహకార ఒప్పందం (ఫ్రేమ్‌వర్క్ ఆఫ్ కోఆపరేషన్) కుదుర్చుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా, తక్షణమే 5,000 మందికి పైగా మాజీ సైనికులను కాంట్రాక్టు పద్ధతిలో 'పాయింట్స్‌మెన్'గా నియమించుకోనున్నట్లు రైల్వే మంత్రిత్వ శాఖ గురువారం ఒక ప్రకటనలో వెల్లడించింది. సైనిక సేవ నుంచి పౌర జీవితంలోకి మారే సిబ్బందికి ఈ చొరవ ఎంతో భరోసా ఇవ్వనుంది. దేశవ్యాప్తంగా వివిధ రైల్వే జోన్లలో ఖాళీగా ఉన్న పోస్టులను వేగంగా భర్తీ చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. రెగ్యులర్ నియామక ప్రక్రియ పూర్తయ్యే వరకు ఈ కాంట్రాక్టు కొనసాగుతుంది. ప్రస్తుతం జోనల్, డివిజనల్ స్థాయిలలో 5,000కు పైగా లెవెల్ 1 పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోందని రైల్వే శాఖ తెలిపింది. నియామక ప్రక్రియను సులభతరం చేసేందుకు ఇప్పటివరకు తొమ్మిది రైల్వే డివిజన్లు సంబంధిత ఆర్మీ విభాగాలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఈ నియామకాలను వేగవంతం చేయడానికి రైల్వే డివిజన్లతో చురుకుగా సమన్వయం చేసుకోవాలని ఆర్మీ రిక్రూటింగ్ యూనిట్లను కూడా కోరారు. రిటైర్డ్ సైనిక సిబ్బంది సంక్షేమం, పునరావాసం తమ విధానంలో ముఖ్యమైన భాగమని రైల్వే శాఖ స్పష్టం చేసింది. ఈ క్రమంలోనే, మాజీ సైనికులకు లెవెల్ 2, ఆపై స్థాయి పోస్టులలో 10 శాతం, లెవెల్ 1 పోస్టులలో 20 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నారు. ఇదే తరహాలో, అగ్నివీరుల కోసం లెవెల్ 2, ఆపై స్థాయి పోస్టులలో 5 శాతం, లెవెల్ 1 పోస్టులలో 10 శాతం రిజర్వేషన్లు కేటాయించారు. 2024, 2025 సంవత్సరాల్లో రైల్వే విడుదల చేసిన ఉద్యోగ నోటిఫికేషన్లలో మాజీ సైనికుల కోసం మొత్తం 14,788 పోస్టులను రిజర్వ్ చేసినట్లు మంత్రిత్వ శాఖ వివరించింది.

# వర్షపాతం తగ్గొచ్చు.. ముందే సిద్ధమవుదాం

అమరావతి: 'ఈ ఏడాది వర్షపాతం తగ్గొచ్చు అన్న సూచనలు ఉన్నాయి. ఇందుకు అనుగుణంగా ముందే సిద్ధమవుదాం. రాష్ట్రంలోని జలాశయాల్లోని మొత్తం నీటి నిల్వ సామర్థ్యం 1,312 టీఎంసీలు కాగా ప్రస్తుతం 790 టీఎంసీలు ఉన్నాయి. మే 15 నాటికే ఖరీఫ్ సాగు ప్రారంభం కావాలి. ఎమ్మెల్యేలు ఇందుకు అందరినీ సన్నద్ధం చేయాలి. ఇబ్బందులు రాకుండా చూసుకోవాలి. 2047 స్వర్ణాంధ్ర విజన్‌లో భాగంగా నీటి భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్నాం. ఇందుకోసం బ్లూప్రింట్ సిద్ధం చేస్తున్నాం. ప్రతి ఇంటికీ నికర జలాలు అందించాలి. నదుల అనుసంధానంతో తెలుగుతల్లికి జలహారతి ఇవ్వాలి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. శాసనసభలో గురువారం ఆయన జలవనరుల బడ్జెట్ కేటాయింపులపై జరిగిన చర్చకు సమాధానం ఇచ్చారు. ముఖ్యమంత్రి ప్రసంగంలోని ముఖ్యాంశాలు ఇవీ...

**విచిత్రమైన వ్యక్తి.. క్రెడిట్ చోరీ..**

1996లో వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశా. ఆ ప్రాంతానికి వెళ్లినప్పుడల్లా అక్కడి ప్రజలు శ్రీశైలం నుంచి నీళ్లు ఇవ్వాలి అని అడిగేవారు. అలా రూపం దాలుస్తున్నదే వెలిగొండ. ఈ ప్రాజెక్టు పూర్తి చేసి నీళ్లు ఇవ్వాలంటే ఎన్డీయే ప్రభుత్వం వచ్చేసరికి రూ.2,500 కోట్లు ఖర్చు చేయాల్సిన పరిస్థితి. మేం వచ్చిన తర్వాత ఇప్పటికే రూ.500 కోట్లు ఇచ్చాం. అలాంటిది జగన్ ఈ ప్రాజెక్టుకు రిబ్బన్ కత్తిరించి పూర్తి చేసేశామంటూ జాతికి అంకితం చేశారంటే నవ్వాలో ఏడ్వాలో అర్థం కావడం లేదు. ఆయనొక విచిత్రమైన వ్యక్తి. ఇది కూడా క్రెడిట్ చోరీ ప్రయత్నమే. కుప్పం కాలువకు నీళ్లు ఇస్తున్నట్లు కూడా అప్పట్లో ఇలాగే సెట్టింగ్ వేశారు. పట్టిసీమ నిర్మిస్తే ఇదెందుకు అని ప్రశ్నించారు. అలాంటిది ఏడాదికి 100 టీఎంసీలు గోదావరి వరద జలాలు కృష్ణా డెల్టాకు తెచ్చి.. శ్రీశైలం నుంచి పూర్తిగా రాయలసీమకు నీళ్లు ఇచ్చాం. వెలిగొండ ప్రాజెక్టు నుంచి ఈ ఏడాది జులైలోనే నీళ్లు ఇస్తాం. ఇక 14 వారాల సమయం ఉంది. ప్రతి వారం పనుల పురోగతిపై నివేదిక ఇమ్మన్నా. ఆర్థిక ఇబ్బందులున్నా ఈ ప్రాజెక్టు పూర్తి చేస్తాం. మార్కాపురం, ప్రకాశం జిల్లాలు సస్యశ్యామలం అవుతాయి. ఉత్తరాంధ్రలో 11 ప్రాజెక్టులు పూర్తి చేయాల్సి ఉంది. రూ.2,000 కోట్లు ఖర్చు చేసి రెండేళ్లలో ఆ ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం. చింతలపూడి ఎత్తిపోతలను జగన్ సర్కార్ వదిలేసింది. అది కూడా పూర్తి చేసి ఉమ్మడి పశ్చిమగోదావరి మెట్ట ప్రాంతాలు, కృష్ణా జిల్లా ప్రాంతాలకు నీళ్లు అందిస్తాం.

*** పోలవరం ప్రాజెక్టుకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు..**

పోలవరం ప్రాజెక్టులోనూ జగన్ విధ్వంసం చేశారు. డయాఫ్రం వాల్ దెబ్బతింది. ఆ విషయాన్ని ఆలస్యంగా గుర్తించారు. ఎన్డీయే ప్రభుత్వం పోలవరాన్ని గాడిలో పెట్టింది. గోదావరి పుష్కరాల కన్నా ముందే పోలవరం పూర్తి చేస్తాం. ఇంత పెద్ద ప్రాజెక్టును సమీప భవిష్యత్తులో దేశంలో ఎక్కడా నిర్మించే అవకాశమే లేదు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ఈ ప్రాజెక్టు వద్దకు తీసుకువెళ్లి నిర్మాణ పనులు చూపించే ఏర్పాట్లు శాసనసభ సభాపతి చేయాలి. 201419లో సాగునీటి ప్రాజెక్టులపై రూ.68 వేల కోట్లు ఖర్చు చేశాం. కూటమి ప్రభుత్వంలో ఇప్పటికే రూ.20 వేల కోట్లు ఖర్చు చేశాం. హంద్రీనీవాలో కాలువను వెడల్పు చేసి అవసరమైన చోట లైనింగ్ చేసి 738 కి.మీ వరకు నీళ్లు తీసుకెళ్లాం. సాగునీటి నిర్వహణ సాగునీటి సంఘాలకే అప్పజెప్పాం. అంతే కాదు ఇప్పుడు కొత్త ఆలోచన చేస్తున్నాం. ఒక ప్రాంతమంతా సాగునీటి సంఘాలకు అప్పజెప్పి అక్కడి నీటి సంరక్షణ బాధ్యతలు కూడా వారికే ఇస్తాం. భూగర్భజలాలు పెంచాలి. ఒక మీటరు జలాలు పెరిగితే రూ.వందల కోట్ల విద్యుత్తు ఛార్జీలు ఆదా అవుతాయి. పచ్చదనం పెంచాలి. తిరుమలలో 89.5% పచ్చదనం ఉంది. ఒకప్పుడు కొండలన్నీ రాళ్లతో ఉండేవి. రాళ్ల మధ్య కూడా పచ్చదనం పెంచొచ్చు అని నిరూపించాం.

## 25 ఏళ్లకే పెళ్లి చేయాలి... దేవాన్ష్‌ను ఇప్పటినుంచే ట్యూన్ చేస్తున్నా

రాజకీయాల్లో ప్రజాప్రతినిధుల మధ్య ఉండే బంధం వారి కుటుంబాల మధ్య కూడా అనుబంధంగా మారాలనే ఉద్దేశంతో ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కర్నూలు, నరసరావుపేట పార్లమెంటు నియోజకవర్గాల పరిధిలోని కూటమి ప్రజాప్రతినిధులకు, వారి కుటుంబసభ్యులకు గురువారం ఉండవల్లిలోని తన నివాసంలో ఆత్మీయ విందు ఇచ్చారు. ఈ సమావేశం పూర్తిస్థాయి రాజకీయాలకు దూరంగా, ఒక ఫ్యామిలీ గెట్ టుగెదర్‌ను తలపించింది. రాజకీయ ఒత్తిళ్లకు దూరంగా, పూర్తి ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ విందు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నేతల కుటుంబసభ్యులు ఒకరికొకరు పరిచయం చేసుకుని, సరదాగా ముచ్చటించారు. మంత్రి లోకేశ్ ప్రతి ఒక్కరినీ పేరుపేరునా పలకరించి, వారి కుటుంబ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. "పిల్లలు ఏం చేస్తున్నారు? ఎక్కడ సెటిల్ అయ్యారు?" అంటూ ఆప్యాయంగా వాకబు చేశారు. ఈ క్రమంలో ఆయన సరదాగా మాట్లాడుతూ.. అబ్బాయిలకు 25 ఏళ్లకే పెళ్లి చేయాలని, తనకు 24 ఏళ్లకే వివాహమైందని గుర్తుచేసుకున్నారు. తన కుమారుడు దేవాన్ష్‌కు కూడా 25 ఏళ్లకు పెళ్లి చేసుకోవాలని ఇప్పటి నుంచే ట్యూన్ చేస్తున్నానంటూ నవ్వులు పూయించారు.



ఈ ఆత్మీయ కలయికలోనూ లోకేశ్ తనదైన మార్క్ చూపించారు. నియోజకవర్గాల అభివృద్ధి, సమస్యల పరిష్కారం కోసం ఆయా నేతలు గతంలో తనకు ఇచ్చిన వినతిపత్రాలపై తీసుకున్న చర్యల పురోగతిని వివరిస్తూ ప్రత్యేక నివేదికలను వారికి అందజేశారు. ఎన్ని పనులు పూర్తయ్యాయి, ఏవి పరిశీలనలో ఉన్నాయి, ఇంకా ఏవి మొదలుకాలేదు అనే వివరాలను స్పష్టంగా తెలియజేశారు. విందుకు హాజరైన మహిళామణులను గౌరవిస్తూ వారికి మంగళగిరి పట్టుచీరలను ఆత్మీయంగా బహూకరించారు. విందు ముగిసిన అనంతరం, ఇంటి గేటు వరకు స్వయంగా వచ్చి ప్రతి ఒక్కరికీ ఆత్మీయంగా వీడ్కోలు పలికి వారిని సాగనంపారు. ఈ సమ్మేళనానికి కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యేలు పీవీ పార్థసారధి, కేఈ శ్యాంబాబు, బొగ్గుల దస్తగిరి, బీవీ జయనాగేశ్వరరెడ్డి, ఎమ్మెల్సీ బీటీ నాయుడు హాజరయ్యారు. అలాగే నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యేలు భాష్యం ప్రవీణ్, పత్తిపాటి పుల్లారావు, చదలవాడ అరవింద్ బాబు, కన్నా లక్ష్మీనారాయణ, యరపతినేని శ్రీనివాసరావు, జూలకంటి బ్రహ్మారెడ్డి, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ తమ కుటుంబసభ్యులతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# బిజినెస్
BUSINESS

## డ్రైవింగ్ లైసెన్స్‌కు గ్రేడ్ పాయింట్లు.. తరచూ తప్పులు చేస్తే లైసెన్స్ రద్దు

ఢిల్లీ: దేశంలో రోడ్డు ప్రమాదాలను నివారించడంతో పాటు, బాధ్యతాయుతమైన డ్రైవింగ్‌ను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం నడుం బిగిస్తోంది. డ్రైవింగ్ లైసెన్స్ వ్యవస్థలో కీలక మార్పులకు శ్రీకారం చుట్టబోతోంది. దీని కోసం కొత్తగా గ్రేడ్ పాయింట్ల విధానం తీసుకురాబోతోంది. ఎవరైనా తరచూ నిబంధనలు ఉల్లంఘిస్తే పాయింట్లు కోత వేసి లైసెన్స్ రద్దు చేయడం వంటి కఠిన నిబంధనలను అమలు చేయనున్నట్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. సీఐఐ నిర్వహించిన కాన్‌క్లేవ్‌లో గురువారం ఆయన ఈ విషయాల గురించి మాట్లాడారు. ఏటా దేశవ్యాప్తంగా 1.8 లక్షల మంది రోడ్డు ప్రమాదాల బారినపడి ప్రాణాలు కోల్పోతున్నారని గడ్కరీ ఆవేదన వ్యక్తం చేశారు. వాహనం




నడిపేటప్పుడు మొబైల్ వినియోగం, అధిక వేగం, రాంగ్ సైడ్ డ్రైవింగ్, మద్యం తాగి నడపడం వంటివి ప్రమాదాలకు ప్రధాన కారణమని పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలను కాపాడటం ప్రభుత్వ విధి అని అన్న ఆయన.. ఇప్పటికే రోడ్డు ప్రమాదాల నివారణకు వివిధ చర్యలు చేపట్టినట్లు వివరించారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే వేసే పెనాల్టీలను భారీగా పెంచామని గుర్తు చేశారు. ఎన్ని చేసినా చట్టం అంటే గౌరవం, భయం లేకపోవడం అసలు సమస్య అని చెప్పారు. అందుకే డ్రైవింగ్ లైసెన్స్‌కు గ్రేడ్ పాయింట్ల విధానాన్ని తీసుకురాబోతున్నట్లు నితిన్ గడ్కరీ చెప్పారు. ''ఎవరైనా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కొన్ని పాయింట్లు కోత పెడతారు. డ్రైవింగ్‌లో తప్పులు చేసీ చేసీ వాళ్లకున్న పాయింట్లన్నీ అయిపోతే ఆరు నెలల పాటు డ్రైవింగ్ లైసెన్స్‌ను సస్పెండ్ లేదా పూర్తిగా రద్దు చేయడం వంటి చర్యలు తీసుకుంటారు. త్వరలోనే ఈ స్కీమ్‌ను లాంచ్ చేస్తాం'' అని గడ్కరీ వివరించారు. రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్న వారిలో 72 శాతం మంది 18 నుంచి 45 మధ్య వయస్కులే ఉంటున్నారని చెప్పారు. అలాగే, రోడ్డు ప్రమాద బాధితులకు సాయం చేయాలని పౌరులకు సూచించారు. క్షతగాత్రుల వైద్య ఖర్చులు గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని... పీఎం రాహత్ స్కీమ్ ద్వారా రూ.1.5 లక్షల వరకు క్యాష్‌లెస్ ట్రీట్మెంట్ లభిస్తుందని వివరించారు.




## గూగుల్ మ్యాప్స్‌లో ఇక ఆధార్ కేంద్రాల వివరాలు

ఢిల్లీ: గూగుల్ మ్యాప్స్‌లో అధీకృత ఆధార్ కేంద్రాల వివరాలను చూపించేందుకు విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (ఉడాయ్) గూగుల్‌తో జట్టుకట్టింది. ఆధార్ కేంద్రాలను సులువుగా గుర్తించేందుకు ఈ సదుపాయం ఉపయోగపడనుంది. ఆధార్ కేంద్రాలతో పాటు ఆయా కేంద్రాలు అందించే సేవల వివరాలు కూడా కనిపించనున్నాయి. పెద్దలు/చిన్నారుల ఆధార్ వివరాల నమోదు, అడ్రస్, మొబైల్ నంబర్ అప్‌డేషన్ వంటి సేవలు వివరాలు కనిపిస్తాయి. ఆధార్ కేంద్రంలో దివ్యాంగులకు అనువైన సదుపాయాలు ఉన్నాయా? పార్కింగ్ సదుపాయాలు, పనివేళలు వంటి వివరాలు కూడా ఇందులో ఉంటాయని ఉడాయ్ ఓ ప్రకటనలో పేర్కొంది. దీనివల్ల తప్పుడు సమాచారాన్ని నివారించడంతో పాటు దేశంలోని 60 వేల ఆధార్ కేంద్రాలను గూగుల్ మ్యాప్స్‌లోనే నేరుగా చూసుకొనే సదుపాయం లభించనుందని ఉడాయ్ సీఈఓ భువనేశ్ కుమార్ పేర్కొన్నారు. రాబోయే కొన్ని నెలల్లో ఈ సదుపాయం గూగుల్




మ్యాప్స్‌లో అందుబాటులోకి రానుంది. భవిష్యత్‌లో గూగుల్ మ్యాప్స్ ద్వారా అపాయింట్‌మెంట్‌లను బుక్ చేసుకునే సదుపాయం కూడా అందుబాటులోకి తేనున్నారు.

## విమాన టికెట్: 48 గంటల్లోగా రద్దు చేసుకుంటే ఛార్జీలుండవు!

విమాన టికెట్ల రిఫండ్‌కు సంబంధించి ఎయిర్‌లైన్స్ నిబంధనలను డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ సవరించింది. టికెట్ బుక్ చేసిన 48 గంటల్లోపు రద్దు చేసుకుంటే ప్రయాణికులు అదనపు ఛార్జీలు చెల్లించక్కర్లేదని తెలిపింది. టికెట్‌లో మార్పులను సైతం ఉచితంగా చేసుకోవచ్చని పేర్కొంది. అయితే, దీనికి కొన్ని షరతులు వర్తిస్తాయని పేర్కొంది

* టికెట్ బుక్ చేసుకున్న తర్వాత 48 గంటల పాటు 'లుక్ ఇన్ ఆప్షన్'ను విమానయాన సంస్థలు అందించాలి. ఈ సమయంలో ప్రయాణికులు ఎటువంటి అదనపు ఛార్జీ లేకుండా టికెట్ రద్దు లేదా మార్పులు చేసుకోవచ్చు. అయితే, ఎంచుకున్న కొత్త తేదీలో టికెట్ ధరలో మార్పులుంటే.. ఆ మేరకు చెల్లించాల్సి ఉంటుంది.
* ట్రావెల్ ఏజెంట్/వారి పోర్టల్స్ ద్వారా టికెట్ కొనుగోలు చేస్తే.. రిఫండ్ బాధ్యత విమానయాన సంస్థలదే. 14 పని దినాల్లోగా ఆ చెల్లింపు పూర్తి చేయాలి.
* విమానయాన సంస్థ అధికారిక వెబ్‌సైట్ ద్వారా నేరుగా టికెట్ బుక్ చేసుకున్న వారు.. 24 గంటల్లోగా పేరులో మార్పులు ఉంటే చేయమని కోరవచ్చు. వారి నుంచి ఎటువంటి అదనపు ఛార్జీలను సంస్థలు వసూలు చేయకూడదు.
* దేశీయ విమానాల్లో.. ప్రయాణ తేదీకి 7 రోజులు ఉండగా బుక్ చేసుకున్న టికెట్‌కు ఈ 'లుక్‌ఇన్ ఆప్షన్' ఉండదు. అంతర్జాతీయ విమానాల్లో అయితే ఆ గడువు 15 రోజులు.
* మెడికల్ ఎమర్జెన్సీ కారణంగా చేసే టికెట్ రద్దు నిబంధనల్లోనూ డీజీసీఏ మార్పులు చేపట్టింది. ప్రయాణికుడు లేదా అదే పీఎన్‌ఆర్ నెంబరు ఉన్న టికెట్‌లో పేరు



ఉండే కుటుంబ సభ్యులు ఎవరైనా ప్రయాణ తేదీనాడు ఆసుపత్రిలో ఉంటే రిఫండ్ లేదా క్రెడిట్ షెల్ ఆప్షన్‌ను కోరవచ్చు.
* ఇతర అనారోగ్య, అత్యవసర పరిస్థితుల్లో.. ప్రయాణికుల అభ్యర్థన మేరకు ఏరో స్పేస్ మెడిసిన్ నిపుణుడు/డీజీసీఏ ఎంప్యానెల్డ్ ఏరో స్పేస్ మెడిసిన్ నిపుణుడి సలహా ఆధారంగా విమానయాన సంస్థలు రిఫండ్‌ను జారీ చేయొచ్చు.

# క్రీడలు

## జింబాబ్వేపై భారత్ విజయం.. సెమీస్ ఆశలు సజీవం

చెన్నై: టీ20 ప్రపంచ కప్ 2026లో సెమీస్ ఆశలను టీమ్ఇండియా సజీవంగా ఉంచుకుంది. జింబాబ్వేతో జరిగిన సూపర్ 8 మ్యాచ్‌లో భారత్ 72 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన టీమ్ఇండియా 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 256 పరుగుల భారీ స్కోరు చేసింది. అనంతరం లక్ష్యఛేదనలో జింబాబ్వే 6 వికెట్ల నష్టానికి 184 పరుగులు చేసింది. ఆ జట్టులో బ్రియాన్ బెనెట్ (97*; 59 బంతుల్లో 8 ఫోర్లు, 6 సిక్స్‌లు) ఒక్కడే పోరాడాడు. సికిందర్ రజా (31), మరుమాని (20) పరుగులు చేశారు. భారత బౌలర్లలో అర్షదీప్ సింగ్ 3, వరుణ్



చక్రవర్తి, అక్షర్ పటేల్, శివమ్ దూబె ఒక్కో వికెట్ పడగొట్టారు. ఆదివారం వెస్టిండీస్‌తో భారత్ తలపడనుంది. టీమ్ఇండియా ఆ మ్యాచ్‌లో గెలిస్తే ఇతర జట్ల ఫలితాలతో సంబంధం లేకుండా నేరుగా సెమీస్‌కు అర్హత సాధిస్తుంది. తొలుత భారత బ్యాటర్లలో ఓపెనర్ అభిషేక్ శర్మ (55; 30 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) హాఫ్ సెంచరీ సాధించాడు. ఆఖర్లో ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య (50*; 23 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్స్‌లు), తిలక్ వర్మ (44; 16 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరుపులు మెరిపించారు. ఇషాన్ కిషన్ (38; 24 బంతుల్లో), సంజు శాంసన్ (24; 15 బంతుల్లో), సూర్యకుమార్ యాదవ్ (33; 13 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) క్రీజులో ఉన్నంత సేపు దూకుడుగా ఆడారు. జింబాబ్వే బౌలర్లలో రిచర్డ్ ఎంగరవ, ముజరబాని, మపోస, సికందర్ రజా తలో వికెట్ తీశారు.



## దక్షిణాఫ్రికా విజయం.. టీమ్ఇండియాకు ఆనందం!

టీ20 ప్రపంచ కప్ సూపర్ 8 మ్యాచ్‌లో వెస్టిండీస్‌పై దక్షిణాఫ్రికా అద్భుత విజయం నమోదు చేసింది. దీంతో వారు సెమీస్‌కు మరింత చేరువయ్యారు. అయితే, ఈ గెలుపు వారి కంటే టీమ్ఇండియా అభిమానులకు మరింత సంతోష పెట్టింది. అదెలాగ అంటారా? ప్రస్తుతం పాయింట్ల పట్టికలో దక్షిణాఫ్రికా (4 పాయింట్లు, +2.890 నెట్ రన్‌రేట్), వెస్టిండీస్ (2 పాయింట్లు, +1.791) తొలి రెండు స్థానాల్లో నిలిచాయి. భారత్ (3.800), జింబాబ్వే (5.350) ఇంకా పాయింట్ల ఖాతా తెరవలేదు. గ్రూప్‌లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన వారికి సెమీస్‌లో ఆడే అవకాశం ఉంటుంది. అలా జరగాలంటే టీమ్ఇండియా ముందున్న ఏకైక మార్గం.. రాబోయే రెండు మ్యాచుల్లో (జింబాబ్వే, వెస్టిండీస్‌తో జరిగే) విజయం సాధించడమే. నెట్ రన్ రేట్ గురించి ఆలోచించక్కర్లేదు. కాబట్టి, మాజీ క్రికెటర్లు, విశ్లేషకులు చెప్పినట్లుగా భారత్ నెట్ రన్ రేట్ గురించి ఆలోచించకుండా.. మ్యాచ్ విజయంపై దృష్టి పెడితే చాలు. అప్పుడు వెస్టిండీస్, జింబాబ్వే ఇంటిముఖం పడతాయి. దక్షిణాఫ్రికా, భారత్ సెమీస్‌లో అడుగు పెడతాయి. వరుసగా రెండు మ్యాచుల్లో గెలిచిన సఫారీ జట్టు తన చివరి మ్యాచ్‌ను మార్చి 1న జింబాబ్వేతో ఆడనుంది. అందులో గెలిస్తే అగ్రస్థానంతో సెమీస్‌కు చేరుతుంది.

## మార్‌క్రమ్ కెప్టెన్ ఇన్నింగ్స్.. విండీస్‌ను చిత్తు చేసిన దక్షిణాఫ్రికా

కెప్టెన్ మార్‌క్రమ్ (82*) అద్భుతమైన ఆటతీరుతో సఫారీల గెలుపులో కీలక పాత్ర పోషించాడు. దీంతో టీ20 ప్రపంచ కప్ సూపర్ 8లో వెస్టిండీస్‌పై దక్షిణాఫ్రికా 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన విండీస్ 20 ఓవర్లలో 176/8 స్కోరు చేయగా.. అనంతరం దక్షిణాఫ్రికా కేవలం ఒక్క వికెట్‌ను మాత్రమే కోల్పోయి 16.1 ఓవర్లలో టార్గెట్‌ను ఛేదించింది. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచిన కెప్టెన్ మార్‌క్రమ్ హాఫ్ సెంచరీ సాధించగా.. మరో ఓపెనర్ క్వింటన్ డికాక్ (47), వన్‌డౌన్ బ్యాటర్ రైన్ రికెల్టన్ (45*) రాణించారు. విండీస్ బౌలర్ రోస్టన్ ఛేజ్ ఒక వికెట్ తీశాడు. ఈ విజయంతో దక్షిణాఫ్రికా సెమీస్ అవకాశాలను మరింత మెరుగుపర్చుకుంది. ఆ జట్టు ఖాతాలో 4 పాయింట్లు ఉన్నాయి. ఆఖరి పోరులో జింబాబ్వేతో దక్షిణాఫ్రికా, భారత్‌తో విండీస్ (2 పాయింట్లు) మార్చి 1న తలపడతాయి. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో దక్షిణాఫ్రికా, విండీస్ తొలి రెండు స్థానాల్లో నిలిచాయి. భారత్, జింబాబ్వే ఇంకా పాయింట్ల ఖాతాను తెరవలేదు.

**విండీస్ ఇన్నింగ్స్‌లో ఆ ఇద్దరు..**

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన విండీస్ 83 పరుగులకే ఏడు వికెట్లను కోల్పోయి కష్టాల్లో పడింది. అయితే, రొమారియో షెఫర్డ్ (52*), జాసన్ హోల్డర్ (49) కీలక భాగస్వామ్యంతో విండీస్ స్కోరు 170+కి చేరుకుంది. వీరిద్దరూ ఎనిమిదో వికెట్‌కు 89 పరుగులు జోడించారు. విండీస్ బ్యాటర్లలో బ్రాండన్ కింగ్ (21), షై హోప్ (16), షెర్ఫానె రూథర్‌ఫోర్డ్ (12), మాథ్యూ ఫోర్డె (11), షిమ్రోన్ హెట్‌మయర్ (2), రోవ్‌మన్ పావెల్ (9), రోస్టన్ ఛేజ్ (2) విఫలమయ్యారు. దక్షిణాఫ్రికా బౌలర్లలో లుంగి ఎంగిడి 3, రబాడ 2, కార్బిన్ బాష్ 2 వికెట్లు పడగొట్టారు.



## శివమ్ దూబె ఆల్‌రౌండర్ కాదు.. ఎందుకంటే.. టీమ్ఇండియా మాజీ క్రికెటర్

టీమ్ఇండియా యువ క్రికెటర్ శివమ్ దూబె కొంతకాలంగా బౌలింగ్‌లో కాస్త మెరుగైనట్లుగా కనిపిస్తున్నాడు. తనను తాను ఆల్‌రౌండర్‌గా తీర్చిదిద్దుకునే పనిలో ఉన్నాడు. అయితే టీమ్ఇండియా మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్ మాత్రం శివమ్ దూబె.. ఆల్‌రౌండర్ కాదని, కేవలం బ్యాటర్ మాత్రమే అంటున్నాడు. అందుకు గల కారణాలనూ అతడు విశ్లేషించాడు. 'శివమ్ దూబె.. డెవాల్డ్ బ్రెవిస్‌కు వైడ్‌గా బంతులు వేసే ప్రయత్నం చేశాడు. అతడు రక్షణాత్మక ధోరణిలో బంతులు సంధించాడు. కానీ 10వ ఓవర్‌లో ఎవరూ ఇలా డిఫెన్సివ్ మోడ్‌లో బౌలింగ్ వేయరు. ఆ సమయంలో బాల్‌తో అటాక్ చేస్తూ..



వికెట్లు తీసేందుకు ప్రయత్నించాలి. నా దృష్టిలో శివమ్ దూబె బ్యాటర్ మాత్రమే. ఆల్ రౌండర్ కాదు' అని మహ్మద్ కైఫ్ విశ్లేషించాడు. అలాగే శివమ్ దూబె బంతుల్లో వేగం ఉండదని కూడా అతడు అన్నాడు. 'మనకు గంటకు కేవలం 120 కిలోమీటర్ల వేగంతో బంతులు సంధించే ఆల్‌రౌండర్‌తో పని లేదు. శివమ్ ఎక్కువగా పరుగులు సమర్పించుకుంటున్నాడు' అని కైఫ్ విమర్శించాడు. జట్టు కూర్పు గురించి కూడా మహ్మద్ కైఫ్ వ్యాఖ్యానించాడు. 'ప్రతి విషయంలో సమతుల్యత ఉండాలి. జట్టులో ఎక్కువగా ఎడమచేతివాటం బ్యాటర్లున్నారు. టాప్ 8 స్థానాల్లో ఆరుగురు లెఫ్ట్‌హ్యాండర్సే ఉన్నారు. లెఫ్ట్ అండ్ రైట్ కాంబినేషన్ కోసం హార్దిక్ పాండ్య అయిదో స్థానంలో బ్యాటింగ్‌కు వస్తున్నాడు. ఇది విన్నింగ్ ఫార్ములా అనుకుంటే.. దీన్ని దృష్టిలోపెట్టుకుని జట్టును తయారుచేసుకోవాలి. లెఫ్ట్ అండ్ రైట్ కాంబినేషన్ కోసం సంజు శాంసన్‌ను జట్టులోకి తీసుకోవాలి' అని కైఫ్ సూచించాడు. శివమ్ దూబె గత పది మ్యాచుల్లో 19.7 యావరేజ్‌తో 7 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. అయితే ప్రస్తుత టీ20 వరల్డ్‌కప్‌లో అతడి ఎకానమీ రేట్ 10 కన్నా ఎక్కువ ఉంది. సూపర్ 8లో భాగంగా దక్షిణాఫ్రికాతో ఇటీవల జరిగిన మ్యాచ్‌లో అతడు రెండు ఓవర్లలో 32 పరుగులిచ్చి, కేవలం ఒక్క వికెట్ మాత్రమే తీసుకున్నాడు.

## రంజీ ట్రోఫీ ఫైనల్.. మయాంక్ అగర్వాల్ సెంచరీ.. పోరాడుతున్న కర్ణాటక

జమ్ము కశ్మీర్‌తో జరుగుతున్న రంజీ ట్రోఫీ ఫైనల్‌లో కర్ణాటక పోరాడుతోంది. మూడో రోజు ఆట ముగిసేసమయానికి కర్ణాటక 5 వికెట్ల నష్టానికి 220 పరుగులు చేసింది. మయాంక్ అగర్వాల్ (130*) శతకం సాధించగా.. అతడితోపాటు క్రుతిక్ కృష్ణ (27*) క్రీజ్‌లో ఉన్నాడు. వీరిద్దరూ అర్ధశతక (54) భాగస్వామ్యం నిర్మించారు. కేఎల్ రాహుల్ (13), దేవదత్ పడిక్కల్ (11), కరుణ్ నాయర్ (0), సమ్రాన్ రవిచంద్రన్ (0) విఫలమయ్యారు. శ్రేయస్ గోపాల్ (23) ఫర్వాలేదనిపించాడు. జమ్మూకశ్మీర్ బౌలర్లలో ఆకిబ్ నబీ 3.. సునీల్ కుమార్, యుద్వీర్ సింగ్ చరక్ చెరో వికెట్ తీశారు. కర్ణాటక ఇంకా తొలి ఇన్నింగ్స్‌లో 364 పరుగులు వెనుకబడి ఉంది. అంతకుముందు



తొలి ఇన్నింగ్స్‌లో జమ్ముకశ్మీర్ 584 పరుగులకు ఆలౌటైంది. ఈ ఫైనల్‌లో ఇంకా రెండు రోజుల ఆట మాత్రమే మిగిలి ఉంది. మ్యాచ్ ఫలితం తేలకపోతే తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం ఆధారంగా విజేతను నిర్ణయిస్తారు. దీంతో కర్ణాటకను త్వరగా ఆలౌట్ చేసేందుకు జమ్ముకశ్మీర్ బౌలర్లు ప్రయత్నిస్తున్నారు.

# వంద తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు

హైదరాబాద్ : రాష్ట్ర వ్యాప్తంగా 100 నియోజకవర్గాల్లో (హైదరాబాద్ నగరం వెలుపల) తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ఈ ఏడాది నుంచి ప్రారంభించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. తరగతి గదులు, క్రీడా మైదానం, ఇతర అన్ని రకాల వసతులు, బోధనా సిబ్బంది, రవాణా సౌకర్యం కలిగి ఉన్న రంగారెడ్డి జిల్లా మంచాల మండలంలోని ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్ తరహాలోనే ఈ వంద స్కూళ్లు ఉండాలని నిర్దేశించారు. గురువారం హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. నాణ్యమైన విద్యకు చిరునామాగా తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలని ఆయన తెలిపారు. ఇందుకు ఎంత వ్యయమైనా వెనుకాడేది లేదని సీఎం స్పష్టం చేశారు. కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) పరిధిలో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలల తరహాలో నిర్మించాలని ఇంజినీర్లను ఆదేశించారు. వీటి నిర్మాణంలో ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలనీ, ఏడాదిలో క్యూర్ పరిధిలో నిర్దేశించుకున్న 12ఇంటిగ్రేటెడ్ నూతన పాఠశాలల నిర్మాణం పూర్తి కావాలని సీఎం సూచించారు. నగరంలోని భారతీయ విద్యా భవన్, జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూళ్లలో ఉండే అన్ని వసతులు ఈ ఇంటిగ్రేటెడ్ పాఠశాలల్లో ఉండాలని ముఖ్యమంత్రి తెలిపారు. క్యూర్‌లో అప్‌గ్రేడ్ చేయనున్న 17 పాఠశాలలు, అదనపు గదులు, ఇతర వసతులు కల్పించనున్న 164 పాఠశాలల పనుల్లో ఎటువంటి రాజీ పడకూడదని సీఎం స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో 99 రోజుల పాటు చేపట్టనున్న కార్యక్రమాల్లో వారం రోజులు విద్యా సంబంధిత అంశాలకు కేటాయించాలని సీఎం సూచించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు.. పాఠశాలలు, కళాశాలలను సందర్శించి అవసరమైన వసతుల కల్పన, ఇతర అంశాలను తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు.

*** సాంకేతికతకు అనుగుణంగా మార్పులు తేవాలి**

కృత్రిమ మేధ (ఏఐ) ప్రపంచాన్ని శాసిస్తున్న నేపథ్యంలో పాఠశాల స్థాయి నుంచి దాని బోధనకు అవసరమైన చర్యలను తక్షణమే చేపట్టాలని అధికారులను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకునేలా ఏఐపై ఉపాధ్యాయులు, లెక్చరర్లకు స్వల్పకాలిక శిక్షణా తరగతులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఏఐతో ప్రపంచ వ్యాప్తంగా వచ్చే మార్పులను తెలుసుకొని దాని ద్వారా వచ్చే అవకాశాలు మన విద్యార్థులే అందిపుచ్చుకునేలా మన సన్నద్ధత ఉండాలని సీఎం అభిప్రాయపడ్డారు. సాంకేతిక విద్యా విధానంలో అందుకు అనుగుణమైన మార్పులను తీసుకురావాలని కోరారు. 2026..2027 విద్యా సంవత్సరం నుంచి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్ అమలు చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. బ్రేక్ ఫాస్ట్ అందజేతకు సంబంధించి అధికారులు, హరేకృష్ణ మిషన్ ప్రతినిధులకు పలు సూచనలు చేశారు. బ్రేక్‌ఫాస్ట్‌తో పాటు ప్రతి విద్యార్థికి పాలు అందజేయాలనీ, ఇందుకు విజయా డెయిరీ నుంచి పాలను సేకరించాలని సీఎం ఆదేశించారు. అదే విధంగా విద్యార్థులకు ఎన్ని క్యాలరీలు అందజేస్తున్నామనేది తెలుసుకునేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని సూచించారు. పాఠశాల విద్యార్థులకు స్కూల్ యూనిఫాం, పుస్తకాలతో పాటు ఈ ఏడాది నుంచి స్కూల్ బ్యాగ్, పెన్నులు, పెన్సిళ్లు, షార్పనర్లు, రంగుల పెన్సిళ్లు, జామెట్రీ బాక్సులు, డిక్షనరీ, బూట్లు, సాక్సులు ఉండే కిట్ ఇవ్వాలని తెలిపారు. ఇందుకు సంబంధించిన మొత్తాన్ని బడ్జెట్‌లో పొందుపర్చేలా చూడాలని అధికారులను సీఎం ఆదేశించారు.

*** ఏఐ ఆధారిత కోర్సులు వెంటనే ప్రారంభించాలి**

పాలిటెక్నిక్ కళాశాలలు, ఏటీసీల్లో ఏఐ ఆధారిత కోర్సులు వెంటనే ప్రారంభించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. కాలం చెల్లిన కోర్సులను తొలగించాలన్నారు. పాలిటెక్నిక్, ఏటీసీల్లో కోర్సులు పూర్తి చేసిన వారికి వెంటనే వివిధ పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు లభించేలా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని విశ్వ విద్యాలయాలకు నిధులు కేటాయిస్తామని సీఎం తెలిపారు. ఇప్పటికే ఉస్మానియా యూనివర్సిటీకి రూ.1000 కోట్లు కేటాయించిన విషయాన్ని సీఎం గుర్తు చేశారు. మిగతా యూనివర్సిటీలకు ఎంత నిధులు అవసరమనే దానిపై నివేదిక సమర్పించాలని ఉన్నత విద్యా మండలి చైర్మెన్ బాలకిష్టారెడ్డిని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రయివేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణకు సంబంధించి తెలంగాణ ప్రయివేటు పాఠశాలల ఫీజు రెగ్యులటరీ మానిటరింగ్ కమిషన్ తమ నివేదికలోని అంశాలను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఎదుట ఉంచింది. వివిధ రాష్ట్రాల్లో అమల్లో ఉన్న విధానాలు, తెలంగాణలో తీసుకోవాల్సిన అంశాలను వివరించింది. దీనిపై సావధానంగా విన్న ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి జిల్లా స్థాయిలో కలెక్టర్, డీఈవోల నేతత్వంలో పాఠశాలలను పరిశీలించి ఫీజుల నిర్ణయంపై నివేదిక సమర్పించాలన్నారు.. రాష్ట్ర స్థాయిలో రిటైర్డ్ జడ్జి లేదా రిటైర్డ్ చీఫ్ సెక్రెటరీ స్థాయిలోని కమిటీ తుది కమిటీగా ఉండి నిర్ణయాలు తీసుకుంటుందని తెలిపారు. అలాగే ఫీజుల నియంత్రణకు సంబంధించి విద్యార్థుల తల్లిదండ్రులు, మేధావులు, సామాజికవేత్తల అభిప్రాయ సేకరణకు ముసాయిదాను పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలని సీఎం సూచించారు.

# ఎల్‌అండ్‌టీ కాంట్రాక్ట్ కార్మికుల ఆగ్రహం

సూరత్ : గుజరాత్‌లోని హజీరాలో నిర్మాణంలో ఉన్న ఆర్సెలర్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా ప్లాంట్‌లో లార్సెన్ అండ్ టుబ్రోకు చెందిన కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆందోళన చేపట్టారు. కూలీ రేటు పెంచాలని, పనిగంటలు తగ్గించాలని వీరు కొంతకాలంగా నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే గురువారం సుమారు ఐదువేల మంది కాంట్రాక్ట్ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ఆందోళనకు దిగారు. రెచ్చిపోయిన యాజమాన్యం వారి సమస్యల పరిష్కారానికి ముందుకు రాకపోగా పోలీసులను రంగంలోకి దింపింది. దీంతో అక్కడ తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు కార్మికులపై లాఠీచార్జి చేశారు. అంతటితో ఆగకుండా కార్మికులను చెదరగొట్టేందుకు టియర్ గ్యాస్‌ను ప్రయోగించారు. 25మంది కిపైగా కార్మికులను అదుపులోకి తీసుకున్నారు.

**అసలేం జరిగింది..?**

హజీరాలో ఆర్సెలర్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా ప్లాంట్‌లో పనిచేస్తున్న కార్మికులు చాలా కాలంగా తమ సమస్యలు పరిష్కరించాలని ఆందోళనలు చేస్తున్నారు. ముఖ్యంగా వారి రోజువారీ పని గంటలను 12 గంటల నుంచి 8 గంటలకు తగ్గించాలని, ఓవర్ టైంకు ప్రస్తుతం ఒకే రేటుతో పరిహారం చెల్లించకుండా, డబుల్ ఓవర్ టైం వేతనాన్ని చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. అదే విధంగా అధికరిస్క్ నిర్మాణ పనులను గణనీయమైన ఎత్తులో చేస్తున్నప్పటికీ రోజుకు రూ. 600 నుంచి రూ.700 మాత్రమే కూలి చెల్లిస్తున్నారని, పనికి తగ్గట్టుగా వేతనం పెంచాలని కోరుతున్నారు. అయితే వీరి నిరసన ప్రదర్శన భారీ స్థాయిలో జరగడంతో.. యాజమాన్యం ఢిల్లీలోని కమలం పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్లింది. ప్రధాని మోడీ ఇజ్రాయిల్ పర్యటనలో ఉండగా.. ఇలాంటి ఘటన జరగకుండా ఉండేందుకు సత్వరమే గుజరాత్ పోలీసులకు హుకుం జారీ చేశారు. అంతే సూరత్ పోలీసుల బృందం సంఘటనా స్థలానికి చేరుకుని కార్మికులను రెచ్చగొట్టింది. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు కార్మికులపై లాఠీచార్జ్ చేశారు. అంతటితో ఆగకుండా వారిని చెదరగొట్టేందుకు 40కిపైగా టియర్ గ్యాస్ షెల్స్ ప్రయోగించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారనే ఆరోపణలతో 25మందికిపైగా కార్మికులను అదుపులోకి తీసుకున్నారు. ప్లాంట్ ప్రాంగణంలో గట్టి భద్రతను మోహరించారు. కాగా, పానిపట్‌లోని శుద్ధి కర్మాగారంలో జరిగిన అల్లర్ల వీడియో వైరల్ కావడంతో ఉద్రిక్తతలు మరింత తీవ్రమయ్యాయి. "వాట్సాప్‌లో వీడియో హల్‌చల్ అయిన తర్వాత ఈ విషయం సంక్లిష్టంగా మారింది. ఇది తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది"అని డీసీపీ బరన్వాల్ తెలిపారు.

# తప్పుడు ఫిర్యాదులపై సుప్రీం సీరియస్



న్యూఢిల్లీ: దేశంలో రోజు రోజుకు తప్పుడు ఫిర్యాదులు, కట్టుకథల సాక్ష్యాలు నమోదు అవుతున్నాయంటూ దేశ సర్వోన్నత న్యాయస్థానం ఆందోళన వ్యక్తం చేసింది. తప్పుడు కేసులను ఎదుర్కొంటున్న వారిని కాపాడాల్సిన బాధ్యత న్యాయస్థానాలపై ఉందని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఉద్ఘాటించారు. కొన్ని సందర్భాల్లో కేసు నమోదు అయిన విషయం ఫిర్యాదు దారుడికి కూడా తెలియడం లేదన్నారు. తప్పుడు ఫిర్యాదులు, కట్టుకథల సాక్ష్యాలు, దురుద్దేశపూర్వకంగా నమోదు చేసే క్రిమినల్ కేసులను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలంటూ సీనియర్ న్యాయవాది అశ్వినీ ఉపాధ్యాయ్ వేసిన పిల్‌పై గురువారం సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ విపుల్ పంచోలీల ధర్మాసనం విచారణ చేపట్టింది. తప్పుడు కేసుల వివరాలను తెలపాలంటూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది.

**నిరపరాధుల జీవితాన్ని రక్షించాలి**

ఆర్టికల్ 32 కింద దాఖలైన ఈ పిల్‌లో అంశాలు ఇలా ఉన్నాయి. 'తప్పుడు కేసులను అరికట్టేందుకు పరిపాలనా భద్రత చర్యలు తీసుకోవాలి. నిరపరాధుల జీవితం, స్వేచ్ఛ, గౌరవాలను రక్షించాలి. నిజమైన కేసుల కంటే తప్పుడు కేసుల వల్లనే న్యాయవ్యవస్థపై భారం పడుతోంది. భూ వివాదాలు వంటి సివిల్ కేసులు కొన్ని సందర్భాల్లో.. ఎస్సీ, ఎస్టీ చట్టాల కింద క్రిమినల్ కేసులవుతున్నా యి. ఫలితంగా గ్రామీణ వాతావరణం ఇబ్బ ందికరంగా ఉంటోంది'అంటూ సీనియర్ న్యాయవాది అశ్వినీ ఉపాధ్యాయ్ పేర్కొన్నారు. రోజూ దేశంలో తప్పుడు కేసులు వందల సంఖ్యలో నమోదు అవుతున్నాయని, వీటిని అరికట్టాల్సిన బాధ్యత న్యాయవ్యవస్థలపై ఉందని ఆమె పేర్కొన్నారు.

**విమర్శలకు భయపడం**

నిరపరాధులను రక్షించాల్సిన అవసరం ఉందని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. 'కోర్టు ఈ అంశంపై ఆదేశాలు ఇస్తే.. ప్రజల హక్కులను అణచివేస్తున్నారనే ఆరోపణలు రావొచ్చనే విషయాన్ని కూడా మేం గమనించాం'అని పేర్కొన్నారు. అయినప్పటికీ.. తాము ఎవరో చేసే విమర్శలకు భయపడమని స్పష్టం చేశారు. 'మమ్మల్ని గ్యాగ్ చేస్తున్నారని అంటున్నారు, అలా చేస్తున్నారని మేం భయంతో ఉండాలా?'అంటూ ప్రశ్నించారు. కొందరు దుర్వినియోగం చేసి మాయవుతామంటే ఎలా అని పేర్కొన్నారు. 'ఇటువంటి కేసుల విషయంలో సమాజం అవగాహనతో ఉండాలి, పక్కవారి మౌలిక హక్కుల గురించి కూడా తెలుసుకోవాలి, సోదరభావం పెంపొందించాలి'అంటూ సీజేఐ చెప్పారు. విమర్శల కారణంగా న్యాయవ్యవస్థ దుర్వినియోగాన్ని పట్టించుకోకుండా ఉండబోమని ఈసందర్భంగా స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్రాలకు సూచనలు విచారణ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. 'పోలీసు స్టేషన్‌లు, కోర్టు ప్రాంగణాలు, పంచాయతీ కార్యాలయాలు, విద్యాసంస్థల వద్ద తప్పుడు కేసులపై శిక్షలకు సంబంధించిన వివరాలతో డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేయాలి. ఫిర్యాదు సమయంలో ఆరోపణలు నిజమని అఫడవిట్ లేదా లిఖితపూర్వక హామీ తీసుకోవాలి.

# పేదలపై ప్రతాపం..పెద్దలపై ప్రేమా?

గాంధీచౌక్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ రాజ్యం కాదని, కుంభకోణాల రాజ్యమని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు, మాజీ మంత్రి కేటీఆర్ మండిపడ్డారు ఇప్పటికే కోట్లాది రూపాయల పలు కుంభకోణాలకు తమ పార్టీ వెలుగులోకి తెచ్చిందని తెలిపారు. పేదల పట్ల దమనకాండ చేస్తున్న ప్రభుత్వం పెద్దలకు మాత్రం ఊడిగంచేస్తున్నదని మండిపడ్డారు. ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని వెలుగుమట్ల భూదాన్ భూముల నిర్వాసితుల ఇండ్లను పరిశీలించేందుకు ఖమ్మంనగరానికి గురువారం ఆయన వచ్చారు. సంఘటన స్థలాన్ని సందర్శించి బాధితులతో మాట్లాడి ఇండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బుల్డోజర్ పాలన నడుస్తున్నదని ఆరోపించారు. హైదారాబాద్‌లో కూడా వికలాంగుల ఇండ్లను కూడా కూలగొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బంధువులే కబ్జాదారులు అని, రేవంత్ ప్రభుత్వం వారికి కొమ్ము కాస్తూ పేదలను మాత్రం వీధుల పాలు చేస్తుందని అన్నారు. గాంధీనే ఆదర్శమని చెప్పుకునే రేవంత్‌రెడ్డి పేదల వుసురు పోసుకుంటూ గాడ్సేలా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం భూదాన్ నిర్వాసితుల విషయంలో తప్పు చేయకపోతే మంత్రులు సంఘటనా స్థలాన్ని ఎందుకు సందర్శించడం లేదని ప్రశ్నించారు. అసలు భూదాన్ భూమి అంటేనే దానంగా ఇచ్చే భూమి అన్నారు. అటువంటి భూమిలో పేదల ఇండ్లు కూల్చడం ప్రభుత్వ దమనకాండకు నిదర్శనమన్నారు. రానున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, మన ప్రభుత్వంలో ఇండ్లు నిర్మించి గృహ ప్రవేశం చేయించే బాధ్యత తనదేనన్నారు. అప్పటి వరకు బాధితుల పక్షాన న్యాయ పోరాటం చేస్తామన్నారు. బాధితులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, పార్టీ రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్, పార్టీ ఖమ్మం, భద్రాద్రి జిల్లాల అధ్యక్షులు తాతా మధు, రేగా కాంతారావు, సీనియర్ నాయకులు గుండాల కృష్ణ, నగర అధ్యక్షులు పగడాల నాగరాజులతో పాటు పలువురు రాష్ట్ర, జిల్లా, నగర నాయకులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ అవినీతికి బీజేపీ సహకారం

హైదరాబాద్ : బీఆర్ఎస్ సర్కారుకు కాళేశ్వరం ప్రాజెక్టు ఏటీఎంలా మారిందంటూ విమర్శలు గుప్పించిన బీజేపీ నాయకులే ఇప్పుడు అదే పార్టీకి సహకరిస్తున్నారని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. కాళేశ్వరం అక్రమాలపై సీబీఐ విచారణకు అసెంబ్లీలో తీర్మానం చేసినప్పటికీ కేంద్రప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. దానిపై విచారణ కమిటీని నియమించామనీ, ఆ నివేదిక ఆధారంగా సీబీఐ విచారణ చేపట్టాలని కేంద్రాన్ని కోరామని చెప్పారు. బీఆర్ఎస్, బీజేపీ ఫెవికాల్ బంధం వల్లే సీబీఐ విచారణ ముందుకు సాగడం లేదని విమర్శించారు. గురువారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, జి వివేక్ వెంకటస్వామి, ఎంపీలు బలరాంనాయక్, రఘురాంరెడ్డి, ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డితో కలిసి విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నుంచి ఇప్పటివరకు జరిగిన పార్లమెంటు, ఉప ఎన్నికలు, పంచాయతీరాజ్, మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టం కట్టడాన్ని బీఆర్ఎస్ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు. కడుపులో విషం పెట్టుకుని ప్రజా ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దానికి బీజేపీ నేతలు వంతపాడుతున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్ట్‌ను కాదని కమీషన్ల కోసం కాళేశ్వరం ప్రాజెక్టును చేపట్టిందని అన్నారు. ఆ ప్రాజెక్టును ఎనిమిదో వింతగా ప్రచారం చేసిందని గుర్తు చేశారు. ఆ ప్రాజెక్టును టూరిస్టు కేంద్రంగా మార్చేందుకు బస్సులు పెట్టి తీసుకెళ్లారని, చివరికి అది పేకమేడల్లా కూలిందని ఎద్దేవా చేశారు. మార్చి16 నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు ప్రతిపక్ష నేత కేసీఆర్, బావ బావమరుదులు వచ్చి మాట్లాడాలని సూచించారు. దానిపై రాష్ట్ర ప్రభుత్వం చర్చకు సిద్ధంగా ఉందన్నారు. బీఆర్ఎస్ హయాంలో ప్రతిపక్ష కాంగ్రెస్ మాట్లాడేందుకు అవకాశం ఇవ్వలేదని గుర్తు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై సమగ్రంగా చర్చించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం రెడీగా ఉందని చెప్పారు. రూ.1.40 లక్షల కోట్లతో డీపీఆర్ సిద్ధం చేసిన బీఆర్ఎస్...దాన్ని రూ.1.80 లక్షల కోట్లకు బడ్జెట్ పెంచిందని తెలిపారు. నాలుగేండ్లలో 168 టీఎంసీల నీరు ఇస్తామని చెప్పి వంద టీఎంసీలను మాత్రమే ఇచ్చిందన్నారు. మిగతా నీటిని సముద్రం పాలుజేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రానికి వర ప్రదాయినిగా పేరొందిన ప్రాణహిత చేవెళ్ల పెండింగ్ పనులను కొనసాగించలేదని చెప్పారు. చాలా చోట్ల పిల్ల కాల్వలను కూడా తవ్వలేదని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి చేసిన అప్పుకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 48వేల కోట్లు రీపేమెంట్ చేసిందన్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రమైన ఆర్థికభారం పడుతోందని తెలిపారు. అయినప్పటికీ ప్రజాసంక్షేమాన్ని కొనసాగిస్తూ... ముందుకు పోతున్నామని చెప్పారు.

*** ఉత్తర తెలంగాణకు అన్యాయం : మంత్రి పొన్నం**

బీఆర్ఎస్ ప్రభుత్వం నీటి ప్రాజెక్టుల విషయంలో ఉత్తర తెలంగాణకు పూర్తిగా అన్యాయం చేసిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. 196 టీఎంసీల నీరు ఇస్తామని చెప్పి 168 టీఎంసీలకు పరిమితం చేసిందని విమర్శించారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని చెప్పారు. తమ ప్రభుత్వం వచ్చాక బీఆర్ఎస్ సర్కారు చేసిన అప్పులపై శ్వేతపత్రం విడుదల చేసిందని తెలిపారు. మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ బీఆర్ఎస్ అవినీతికి పాల్పడిందన్నారు. దేశంలోని ప్రాంతీయ పార్టీల్లో బీఆర్ఎస్ ధనిక పార్టీగా మారిందని చెప్పారు. సుమారు వెయ్యి కోట్ల రూపాయల ఫిక్స్‌డ్ డిపాజిట్లు, ఎలక్ట్రోరల్ బాండ్లు దీనికి నిదర్శనన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కారణంగా ఏర్పడిన నష్టాన్ని కేసీఆర్ నుంచి వసూలు చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు.

# పెద్ద విమానాలతో తిరుపతి రన్‌వే కళకళ

తిరుపతి: తిరుపతి విమానాశ్రయం సరికొత్త రికార్డులు నమోదుచేస్తోంది. తొలిసారిగా ఆర్థిక సంవత్సరం ముగియకముందే (జనవరి నాటికే) 10 లక్షల మంది ప్రయాణికుల రాకపోకల మైలురాయిని దాటింది. చిన్న విమానాల (ఏటీఆర్) స్థానంలో పెద్ద విమానాలు (ఎయిర్‌బస్) అందుబాటులోకి రావడం, భక్తుల రద్దీ పెరగడంతో ఈ ఘనత సాధ్యమైందని ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ (ఏపీడీ) భూమినాథన్ తెలిపారు. గతేడాది 9.9 లక్షల మంది ప్రయాణించగా, ఈ ఆర్థిక సంవత్సరం(మార్చి) ముగిసేనాటికి 11.5 లక్షలకు చేరే అవకాశముందని అంచనా.

**భారీ విమానాలతోనే బూస్ట్**

గతంలో 72 సీట్లు ఉండే ఏటీఆర్ విమానాలు ఎక్కువగా నడిచేవి. ఇప్పుడు వాటిస్థానంలో 230 సీట్ల సామర్థ్యం గల ఎయిర్‌బస్సులు నడుస్తున్నాయి. సర్వీసుల సంఖ్య రోజుకు 16కు చేరింది. శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు కనెక్టివిటీ పెరగడం, ఉదయం వచ్చి సాయంత్రం వెళ్లే వెసులుబాటు, శ్రీవాణి టికెట్లు అందుబాటులో ఉండటం రద్దీ అనూహ్యంగా పెరగడానికి ప్రధాన కారణాలు. నెలకు సగటున లక్ష మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు.

**నష్టాలు అధిగమించేలా..**

భారీ టెర్మినల్ భవన నిర్మాణ వ్యయం, తరుగుదల కారణంగా.. ప్రస్తుతం ఈ విమానాశ్రయం ఏటా సుమారు రూ.30 నుంచి రూ.32 కోట్ల నష్టాల్లో ఉంది. నష్టాలు అధిగమించడానికి కమర్షియల్ ఆదాయాన్ని పెంచుకోవాలని ఇటీవల కేంద్రమంత్రి సూచించారు

**హోటల్ ఏర్పాటుకు సన్నాహాలు**

విమానాశ్రయం సమీపంలో ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉండేలా హోటల్ లేదా రెస్టారెంట్ లేకపోవడం పెద్దలోటు. ఎయిర్‌పోర్ట్ భూములు ప్రభుత్వం ఉచితంగా ఇచ్చినవి కావడంతో, నిబంధనల ప్రకారం అక్కడ వాణిజ్య కార్యకలాపాలు (హోటల్ వంటివి) చేపట్టడంపై కొన్ని ఆంక్షలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మరోసారి సర్వే నిర్వహించి, అనుమతుల కోసం ప్రతిపాదనలు పంపారు. భద్రతా కారణాలను పరిగణనలోకి తీసుకుని త్వరలో నిర్ణయం వెలువడే అవకాశం ఉంది.

**తిరుపతి విమానాశ్రయంలో ప్రయాణికులు**

**దక్షిణాదిలోనే అతిపెద్ద రన్‌వే**

తిరుపతి విమానాశ్రయం రన్‌వే పొడవు 3,800 మీటర్లు.. ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా పరిధిలోని దక్షిణాది విమానాశ్రయాల్లో ఇదే అత్యంత పొడవైనది. చెన్నై, హైదరాబాద్ (శంషాబాద్ మినహా) కంటే ఇది పెద్దదని, ఫ్లోరింగ్ పనులు పూర్తయితే మరింత బలోపేతమవుతుందని ఏపీడీ వెల్లడించారు.

**డిజియాత్ర, భద్రత..**

కోయంబత్తూరు తరహాలో తిరుపతిలోనూ త్వరలో 'డిజియాత్ర' సేవలు అందుబాటులోకి వస్తాయని ఏపీడీ ఈ సందర్భంగా తెలిపారు. భద్రతపరంగా విమానాశ్రయం పటిష్ఠంగా ఉందని, దాదాపు 800 సీసీ కెమెరాలతో నిరంతర నిఘా ఉందని పేర్కొన్నారు. రాత్రిపూట ల్యాండింగ్ సౌకర్యం కూడా ఉందని.. విమానయాన సంస్థల డిమాండ్ బట్టి 24గంటల సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు.

**అంతర్జాతీయ సర్వీసులపై ఆశలు..**

సింగపూర్, దుబాయ్ వంటి దేశాల నుంచి తిరుపతికి నేరుగా విమానాలు నడిపే అంశం పరిశీనలో ఉంది. సింగపూర్ ఎయిర్‌లైన్స్ సానుకూలంగా ఉన్నా విమానాల లభ్యత, పైలట్ల కొరత, మంత్రిత్వశాఖ అనుమతుల వంటి అంశాలపై ఇది ఆధారపడి ఉంది. ప్రైవేట్ జెట్‌లు, చార్టర్డ్ విమానాల కోసం బేగంపేట తరహాలో 'జనరల్ ఏవియేషన్' టెర్మినల్ ఏర్పాటుకు ప్రతిపాదనలు ఉన్నాయి.




## వచ్చే సంక్రాంతి హీరోలు వీళ్లే!

ఈ సంక్రాంతికి చిరంజీవి వెంకటేశ్‌లతో కలిసి 'మన శంకరవరప్రసాద్‌గారు' చిత్రంతో ప్రేక్షకుల్ని అలరించారు దర్శకుడు అనిల్ రావిపూడి. ఇప్పుడాయన వచ్చే ముగ్గుల పండగ కోసం మరో ఆసక్తికర కలయికను తెరపైకి తెచ్చారు. కథానాయకులు వెంకటేశ్ నందమూరి కల్యాణ్‌రామ్‌లతో ఓ మల్టీస్టారర్‌ను రూపొందించనున్నారు. ఈ విషయాన్ని గురువారం సామాజిక మాధ్యమాల వేదికగా అధికారికంగా ప్రకటించారు. ''మొదటిసారి బొమ్మ తీసే అవకాశమిచ్చిన హీరో కల్యాణ్‌రామ్, మొదటి రూ.వందకోట్ల బొమ్మ కొట్టిన హీరో వెంకటేశ్‌తో కలిసి 2027 మొదటి పండక్కి మీ ముందుకొస్తున్నా'' అని అనిల్ పోస్ట్‌లో పేర్కొన్నారు. అనంతరం వెంకటేశ్ స్పందిస్తూ.. ''నేను.. అనిల్ కలిసి పని చేసిన ప్రతిసారీ సరదాగా, సానుకూలంగా స్వచ్ఛమైన వినోదంతో ఇంటికి తిరిగొచ్చినట్లు అనిపిస్తుంది. ఇప్పుడాయనతో ఐదో సినిమా కోసం తిరిగి కలిశాను. ఈ ప్రయాణంలో కల్యాణ్‌రామ్ చేరడం ఆనందంగా ఉంది. పండక్కి కలుద్దాం'' అని ట్వీట్ చేశారు. ''పటాస్' తర్వాత మీతో తిరిగి కలవడం ఇప్పటికీ ప్రత్యేకంగా అనిపిస్తుంది అనిల్. ఈసారి మా ప్రియమైన వెంకటేశ్‌తో ఓ సూపర్ ఎంటర్‌టైనర్ కోసం. చిత్రీకరణ ప్రారంభించేందుకు ఆసక్తిగా ఎదురు చూస్తున్నా'' అని కల్యాణ్‌రామ్ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. ఇది అనిల్ శైలికి తగ్గట్లుగా స్వచ్ఛమైన వినోదం, బలమైన కుటుంబ భావోద్వేగాలతో అందర్నీ అలరించే ఎంటర్‌టైనర్‌గా ఉంటుందని.. ప్రస్తుతం స్క్రిప్ట్‌కి తుది మెరుగులు దిద్దుతున్నారని.. పూర్వ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని చిత్ర వర్గాలు తెలిపాయి.

## 'పెద్ది'... రై రై రారా



కథానాయకుడు రామ్‌చరణ్.. దర్శకుడు బుచ్చిబాబు సానా కలయికలో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'పెద్ది'. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. జాన్వీ కపూర్ కథానాయిక. ప్రస్తుతం ముగింపు దశలో ఉన్న ఈ సినిమా ఏప్రిల్ 30న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ప్రచార పర్వంలో భాగంగా ఈ చిత్ర రెండో గీతాన్ని విడుదల చేసేందుకు సిద్ధమవుతున్నారు. ''రై రై రారా'' అంటూ సాగే ఆ పాటను మార్చి 2న విడుదల చేయనున్నట్లు గురువారం ప్రకటించారు. ఈ మేరకు ఓ కొత్త పోస్టర్‌ను నెట్టింట పంచుకున్నారు. అందులో చరణ్ మాస్ లుక్‌లో ఆసక్తికరంగా కనిపించారు. ఉత్తరాంధ్ర నేపథ్యంలో సాగే పీరియాడిక్ యాక్షన్ డ్రామా ఇది. క్రీడా నేపథ్య అంశాలతో మిళితమై ఉంటుంది. ఇందులో చరణ్ ఆట కూలీగా అలరించనున్నారు. ఇందులో శివ రాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: ఏఆర్ రెహమాన్, ఛాయాగ్రహణం: రత్నవేలు.

## యాక్షన్ మోడ్‌లో అగ్రతారలు



మహేశ్ నారాయణన్ దర్శకత్వంలో అగ్ర కథానాయకులు మోహన్‌లాల్, మమ్ముట్టి ప్రధానపాత్రలో తెరకెక్కుతున్న మలయాళ చిత్రం 'పేట్రియాట్'. ఈ సినిమాలో ఫహాద్ ఫాజిల్, నయనతార, కుంచకో బోబన్, గౌతమి తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్నారు. స్పై యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ సినిమా ఏప్రిల్ 23న థియేటర్లలో విడుదల కానుంది. తాజాగా ఈ సినిమా సెకండ్ లుక్ పోస్టర్‌ని ఇన్‌స్టా వేదికగా ఆవిష్కరించింది చిత్రబృందం. ఈ పోస్టర్.. కుంచకో నడుపుతున్న కారులో అగ్ర హీరోలిద్దరూ తుపాకులు చేతపట్టి యాక్షన్ మోడ్‌లో ఆకట్టుకుంటున్నారు. దేశభక్తి నేపథ్యంతో ఈ చిత్రాన్ని తీర్చిదిద్దుతున్నట్లు ఇప్పటికే విడుదలైన ట్రైలర్‌తో స్పష్టమైంది.

# సినిమా

## వివాహబంధంతో ఒక్కటైన విజయ్-రష్మిక





[illegible]

### ఏవి ఫొటో వైరల్

[illegible]

### ప్రేమగా పెట్టిన పేరు విరోష్

[illegible]

## ఆలస్యమైనా అద్భుతమే



[illegible]

## కోతి కరుస్తుందని..



[illegible]

## ఈ చిత్ర వసూళ్లు ధైర్యాన్నిచ్చాయి

'అంబాజీపేట మ్యారేజి బ్యాండు' సినిమా తర్వాత నా చిత్రాలకి ఆశించిన స్థాయిలో వసూళ్లు కనిపించకపోవడంతో భయమేసింది. కానీ, 'హే బల్‌వంత్' వసూళ్లు చూశాక మళ్లీ ధైర్యం వచ్చింది'' అన్నారు హీరో సుహాస్. ఆయన.. శివానీ నాగారం జంటగా నటించిన ఈ సినిమాని గోపీ అచ్చర తెరకెక్కించారు. బి.నరేంద్ర రెడ్డి నిర్మించారు. ఈ చిత్రం ఇటీవల విడుదలైన నేపథ్యంలో గురువారం హైదరాబాద్‌లో థాంక్స్ మీట్‌ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుహాస్ మాట్లాడుతూ.. ''మా చిత్రానికి ఓవర్సీస్ నుంచి మంచి వసూళ్లు దక్కాయి. చాలా రోజుల తర్వాత నా సినిమాకి ఓటీటీ నుంచి మంచి ఫ్యాన్సీ రేటు వచ్చింది'' అన్నారు. ''చాలా తక్కువ మంది మాత్రమే మా సినిమా బ్రేక్ ఈవెన్ అయిందని ధైర్యంగా చెప్తారు. ఆ కోవలో మా 'హే బల్‌వంత్' నిలిచినందుకు ఆనందంగా ఉంది. త్వరలోనే దర్శకుడు గోపీతో మరో సినిమా చేస్తున్నాం'' అన్నారు నిర్మాత వంశీ నందిపాటి. ఈ కార్యక్రమంలో బి.నరేంద్ర రెడ్డి, శివానీ, గోపీ తదితరులు పాల్గొన్నారు.



Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.